
ఈతరం కోసం

కథాస్రవంతి



చాగంటి సోమయాజులు
కథలు

ఈతరం కోసం

కథాస్రవంతి

చాసో

17-1-1915 ❖ 2-1-1994

గురజాడ వారసత్వానికి వన్నె తెచ్చిన చాసో అయన పెన్నుమూసిన 1915లో కన్ను తెరిచారు. శ్రీకాకుళానికి చెందిన కానుకొలను నరహరిరావు దత్తతవలన విజయనగరపు చాగంటి సోమయాజులుగా మారి తరువాతి కాలంలో చాసోగా ప్రసిద్ధులయ్యారు. కాదంబరి అన్నపూర్ణ గారితో 13వ ఏట చాసోకి వివాహమయింది. 1948లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జమిందారీ, ఇనాందారీ రద్దు బిల్లులవలన చాసో ఆస్తులను కోల్పోయారు. 1957లో తన తల్లి పేరున తులసి ప్రెస్‌ను విజయనగరంలో పెట్టారు.

బి.ఎ. రెండవ సంవత్సరం సగంలోనే చదువు ఆపేసిన చాసో తొలుత స్వయంగా 'చిన్నాజీ కథలు' అచ్చు వేసుకున్నారు. 1968లో విశాలాంధ్రవారు ప్రచురించిన 'చాసోకథలు' తొలి కూర్పులో 23 కథలను మాత్రమే అయన యిచ్చారు. ఇప్పుడు మొత్తం నలభై కథలతో చాసో కథలు పలు ప్రచురణలు పొందింది. "చాసో కవితలు" విశాలాంధ్ర ప్రచురించింది. చాసో తొలి కవిత 'ధర్మక్షేత్రం' 1941 జూన్ భారతిలో, తొలి కథ 'చిన్నాజీ' 1942 మే భారతిలో అచ్చయ్యాయి.

ప్రసిద్ధ రచయితలు రోణంకి అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ తదితరుల సాన్నిహిత్యంతో విజయనగరం కస్పాలోని చాసో ఇల్లు ఆధునిక సాహిత్య వేదికగా రూపొందింది.

అరసం వ్యవస్థాపక సభ్యులైన చాసోది 1943 నుండి అందులో క్రియాశీల పాత్ర. కార్యవర్గ సభ్యునిగా, అధ్యక్షవర్గ సభ్యునిగా కొనసాగారు. మృతిచెందే నాటికి అధ్యక్షులుగా వున్నారు. 1987లో అరసం గుంటూరు జిల్లా శాఖ చాసోకు అమరజీవి కొండేపూడి శ్రీనివాసరావు సాహితీ సత్కారాన్ని అందజేసింది. 'దేశమునకు గాని దేహమేల' అని భావించిన చాసో తన కళ్లని, దేహాన్ని దేశానికి అర్పించారు. వీరి సంతానం తులసి, కృష్ణకుమారి, శంకర్‌లు రచయితలు.

భారతీయ సాహిత్య నిర్మాతలు శీర్షికన చాగంటి కృష్ణకుమారి రాసిన చాసో జీవిత చరిత్రను సాహిత్య అకాడెమీ 2014లో ప్రచురించింది. ఇది చాసో శతజయంతి సంవత్సరం.

కథాస్రవంతి

చాసో కథలు



ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

గుంటూరుజిల్లా శాఖ

CHASO KATHALU

Edited by : Dr. Chaganti Tulasi

చాసో కథలు

సంపాదకులు : **డా॥ చాగంటి తులసి**

ప్రచురణ సంఖ్య : 24

ప్రథమ ముద్రణ :

జనవరి 2015

ముఖచిత్రం : **పినిశెట్టి**

లే అవుట్ డిజైన్ : **స్ఫూర్తి డిజిటల్స్,**

విజయవాడ, సెల్: 90105 70550

ప్రచురణ :

అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరుజిల్లా శాఖ

101, బృందావన్‌పార్క్ రెసిడెన్సీ, 7వ లేన్, ఎస్.వి.ఎన్.కాలనీ,

గుంటూరు-522 006 సెల్: 92915 30714

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : *విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్*

ప్రతులకు : *విశాలాంధ్ర బుక్ హౌస్*

విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం,

శ్రీకాకుళం, అనంతపురం, తిరుపతి, కాకినాడ, హనుమకొండ, కడప

for e-book : www.anandbooks.com

ముద్రణ : *రెయిన్‌బో ప్రింట్ ప్యాక్, హైదరాబాద్.*

040-23731620, 23741620

వెల: రూ. 50/-

డా॥ చాగంటి తులసి

స్వీయ రచన, అనువాద రచనలతో కీర్తి ప్రతిష్ఠలనార్జించిన అభ్యుదయ రచయిత్రి చాగంటి తులసి. 5 నవంబర్ 1937న విజయనగరంలో జన్మించారు. హిందీలో డాక్టరేట్ పట్టా తీసుకున్న తులసి ఒడిశా ప్రభుత్వ విద్యాశాఖలో రీడర్‌గా పనిచేసి 1995లో పదవీవిరమణ చేశారు. దక్షిణ కొరియా హాంకుక్ యూనివర్సిటీలో 1992 నుంచి 1994 వరకు 'గెస్ట్ ప్రొఫెసర్‌గా' పనిచేశారు. అమెరికా, యూరప్, ఆసియా ఖండాలలో పర్యటించారు. హిందీ, ఒడియా, ఇంగ్లీషు భాషలనుండి కథలు, నవలలు అనువదించారు. నవలిక, ఏకాంకిక, విమర్శలాంటి ప్రక్రియలలో కృషి చేశారు. 'తులసి కథలు' పుస్తకానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కథారచయిత పురస్కారం అందుకున్నారు. చాసో రెండవ అమ్మాయి అయిన తులసి తండ్రి పేరున 1995 నుండి చాసో స్ఫూర్తి సాహిత్య ట్రస్టును విజయనగరంలో నిర్వహిస్తున్నారు. అరసం విశిష్ట ఆహ్వానితురాలు.

చిరునామా :
5-127, 3వ వీధి, పాల్‌నగర్,
విజయనగరం - 535 003
సంచారవాణి : 99633 77672

కృషిని కొనసాగిస్తూనేవుంది. కథా ప్రస్థానంలో గుంటూరు సీమది, అరసం గుంటూరుజిల్లా శాఖది ప్రత్యేకపాత్ర.

చిరస్మరణీయ కథలతో 'కథాస్రవంతి' శీర్షికన 80వ దశకంలో నాలుగు కథాసంకలనాలను వెలువరించి కథా సంకలనాల ప్రచురణకు కొత్త ఊపునిచ్చింది. విస్తృత కథ, విశాలాంధ్ర తెలుగు కథ సంకలనాల నిర్మాణంలో గుంటూరు అరసం బాధ్యుల భాగస్వామ్యముంది. వందేళ్లు (1913-2013) నిండిన ఈ సీమ కథకు 'గుంటూరు కథలు' సంకలనం ద్వారా అరసం హారతి పట్టింది.

తొలి కథాసంకలనం 'కథావళి' 1932లో గుంటూరు నుండే వెలుగు చూసింది. కథావిమర్శ, అనువాద కథలను తెలుగువారికి మొదటిసారిగా పరిచయం చేసింది గుంటూరు సీమే. తెలుగు కథానికకు బలమైన భూమికగా గట్టి వేదికగా గుంటూరు నాటినుండి నేటివరకూ నిలిచింది. అరసం అందుకు ఓ గొప్ప ప్రేరణ, ఆలంబన. సమస్త సామాజిక విలువలు పతనమవుతున్న ప్రస్తుత తరుణంలో మంచి అనే ప్రతిదీ వెనుకబడివుంది. సాహిత్యానిదీ అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో సాంస్కృతిక పునర్వికాస ఉద్యమ అవసరాన్ని అరసం గుర్తించింది. అందులో భాగంగా అరసం గుంటూరు జిల్లాశాఖ పాఠకులలో స్ఫూర్తిని కలిగించే, చైతన్యాన్ని రగిలించే సాహిత్యాన్ని అందించ బూనుకుంది. అందులో భాగంగా ఉద్యమ స్థాయిలో కథానికా సంపుటాల ప్రచురణను చేబట్టింది. ప్రముఖ కథకుల ప్రసిద్ధ కథానికలను సమర్థులైన సంపాదకులచేత ఎంపిక చేయించి, విశ్లేషణాత్మక సంపాదకీయంతో ముఖ్యంగా ఈ తరంకోసం అందిస్తోంది.

ఈ కథాసంపుటాలను సాంస్కృతిక వారసత్వ సంపదగా ఉత్తమాభిరుచి కలిగిన తెలుగు పాఠకలోకం స్వీకరిస్తుందన్న ఆశ మాకుంది. ఆదరించండి.

❖ ❖ ❖

చాసో కథా సంపుటి ప్రచురణకు అనుమతించి, సంపాదకత్వం వహించిన డా॥ చాగంటి తులసిగారికి అరసం పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు.... ఈ సీరీస్ కథా సంపుటాలను ముఖ చిత్రాలతో తీర్చి దిద్దిన ప్రముఖ చిత్రకారులు శ్రీ పినిశెట్టి గారికి ధన్యవాదాలు.

మీ

గుంటూరు
20-11-2014

వల్లూరు శివప్రసాద్
ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం

విశిష్ట కథకుడు

అంతర్జాతీయ సాహిత్యంలో నిలవదగిన కథలు రచించిన చాసో 1915 జనవరి 17వ తేదీన శ్రీకాకుళంలో (ఉత్తరాంధ్ర) కానుకొలనువారింట జన్మించారు. చిన్నప్పటి పేరు కానుకొలను నరహరిరావు. తన 13వ ఏట విజయనగరం చాగంటి వారింటికి దత్తపుత్రుడిగా వచ్చి సోమయాజులుగా మారి విజయనగరంవారు అయ్యారు. గురజాడ వేంకట అప్పారావు గారి లాగానే విజయనగరంలో పుట్టకపోయినా ఆయన జీవన సృజన కార్యక్షేత్రం విజయనగరం అయింది. చాగంటి సోమయాజులు చాసోగా ప్రఖ్యాతులయ్యారు.

శ్రీకాకుళంలో చిన్నతరగతులు చదువుకుంటున్న బాల్యదశలోనే ఆయనకి పద్యరచనపట్ల ఆసక్తి కలిగింది. అయితే తెలుగు మాస్టరుగారు గణవిభజన చెప్పారే తప్ప పద్యం ఎలా రాయాలో (ఆయనకే తెలియని కారణం చేత) చెప్పలేక పోయారు. పైగా పాండిత్యం లేందే పద్యం రాయడం రాదు. ముందు పండితుడివి అవాలి అని కూడా భయపెట్టారు.

చాసోలో సాహిత్యం పట్లా రచన పట్లా ఉన్న ఆసక్తి మాత్రం తగ్గలేదు. విజయనగరం వచ్చాక హైస్కూల్లో ఇంగ్లీషు పాఠాల్లో ప్రాసెడీ నేర్చుకొన్నాక ఇంగ్లీషులో పద్యాలు రాయడం మొదలుపెట్టారు. ఇంగ్లీషు కవులను కంఠతాపెట్టారు. ఈ అభిరుచివల్ల తనకన్నా పెద్దక్లాసు బి.ఎ.లో ఉన్న రోణంకి అప్పలస్వామిగారికి మిత్రుడయ్యారు. తెలుగులోనూ కవిత్వం అల్లడం మొదలుపెట్టారు. కాలేజీ లైబ్రరీకి వచ్చే ఇంగ్లీషు పత్రికలనీ, పుస్తకాలని చదివి ఆనాటి తమ సమకాలికులైన ఆ కవుల ఆలోచనలతో తమ ఆలోచనలను కలగలుపుకొన్నారు. చారిత్రిక దృక్పథంతో చూడటం మొదలుపెట్టారు. వామపక్ష భావాలకు మొగ్గారు. ఈ ఇద్దరు మిత్రులూ నిరీశ్వరవాదులు. వామపక్ష భావాలతో సాహిత్యాధ్యయనం చేశారు. వీరికి శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ మిత్రులయ్యారు. మొదట్లో ఈ ఇద్దరూ భావకవులు. చాసోఇల్లు సాహిత్యాధ్యయనానికీ, వాదోపవాదాలకీ, సాహిత్య సృజనకి వేదిక అయింది. నారాయణబాబూ శ్రీశ్రీలు కూడా భావ కవిత్వాన్ని వదిలి ప్రపంచ పరిస్థితులకి స్పందించి వామపక్షవాదు లయ్యారు. చాసో కథాప్రక్రియను తన స్వంతం చేసుకొని కవిత్వరచన వదిలేసారు. 1934 నుండి 1940 వరకూ చాసో ఇంట్లో ఈ మిత్రులు నలుగురూ సమకాలీన ప్రపంచ సాహిత్యాన్ని చదువుతూ, చర్చిస్తూ, విశ్లేషిస్తూ, విమర్శిస్తూ తమ సృజనకు పదును పెట్టుకొన్నారు. చాసో కథలు, నారాయణబాబు రుధిరజ్యోతి, శ్రీశ్రీ మహా ప్రస్థానం రచనలకు రోణంకి అప్పలస్వామి గారు ఆచార్య విమర్శకులై దోహదపడ్డారు.

చాసో రాశికన్నా వాసిమీద దృష్టి ఉన్న రచయిత. తనకు తాను పెట్టుకున్న గీటురాయి వీసం అటూ ఇటూ అయినా తాను చేసిన రచన తనకే అంగీకారయోగ్యం కాదు. ఆయన కటుకు విమర్శకుడు. అందుచేతనే తన 27వ ఏట 1942లో ప్రచురించిన 'చిన్నాజీ' కథ నుండి తన 73వ ఏట 1988లో ప్రచురించిన 'వాఅప్పు' కథ వరకూ అదే ఉన్నత స్థాయి సాంద్రతతో రచన చేయగలిగారు.

సామాన్యులు మాట్లాడే భాషలో రచన చేయాలనీ, సామాన్యుని జీవితం రచనకు ఇతివృత్తం అవాలని గురజాడ అప్పారావుగారు తన రచనల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్య సృజనకు తలుపులు తెరిచారు. చాసో రొమాంటిక్ కవుల రచనలు చదివి ఉన్నారు. వర్డ్సువర్త్ కాల్‌రిడ్జిల లిరికల్ బేలడ్స్ ఆయనకు కంఠతాగా వచ్చు. చాసో ఆశయానికి ఇదే పునాది. కథను లిరికల్ బేలడ్‌గా తలచడానికీ సామాన్యుని భాషని స్వీకరించి సామాన్యుని బతుకును వస్తువుగా స్వీకరించడానికి వెనక ఈ నేపథ్యం ఉంది. చాసో గురజాడకు వారసుడుగా సాహిత్య సృజనలో తిరుగులేని రచయితగా తనదైన అపూర్వమైన స్థానాన్ని ఏర్పరచుకోవడంలో కృతకృత్యులయ్యారు.

మార్క్సిస్టు దృక్పథంతో ఆయన సమాజాన్ని నిశితంగా పరిశీలించారు. మార్క్సిజాన్ని కథాసాహిత్యంలోకి ప్రవేశపెట్టింది నేనే అని గర్వంగా చెప్పుకున్నారు. అయితే ఆయనకి 'జీవితమే' ప్రధానం. ఉన్న దానిని చూపిస్తారే తప్ప ఆపాదించి ఏదీ చెప్పరు. ఎక్కడా తన దృక్పథం ఇదీ అని నేరుగా చెప్పరు. వస్తువు, సన్నివేశం, పాత్రల ప్రవర్తన, సంభాషణలు అన్నిటిలోనూ ఆయన చింతనా, దృక్పథం అంతర్లీనంగా మొదటి నుండి చివరివరకూ ఉంటాయి. ఆయన మాస్టర్ ఆర్టిస్టు.

ధనస్వామ్యంలో ధనం ఏ విధంగా మనుషుల్ని అవినీతిపరుల్ని చేస్తుందో, మానవత్వాన్ని ఎలా మంటకలుపుతుందో, బూర్జువా సమాజంలో మనుషులు ఎలా సంచరిస్తారో ఆయన చుట్టూ ఉన్న సమాజంలోని అన్ని తరగతుల వ్యక్తులను సునిశితంగా పరిశీలించి పాత్ర సృష్టి చేశారు. ఆయాపాత్రల జీవితాలలో నైతిక ఆర్థిక పార్శ్వాలకు మధ్య జరిగే సంఘర్షణతో పాటు ఆయా నర్దుబాట్లకు వెనక ఉన్న వ్యవస్థ డొల్లతనం పాఠకుని ఆలోచనకు అందేటట్టు చేశారు. దీనికి వ్యంగ్యాన్ని ఆయన సాధనంగా స్వీకరించారు. మోసం, దోపిడి, దౌర్జన్యం, అమాయకత్వం, అజ్ఞానం, మూఢనమ్మకం, అన్నిటినీ వ్యంగ్యంతో వ్యక్తీకరిస్తూ వ్యవస్థలోని అవకతవకలని ప్రశ్నిస్తూ వ్యవస్థ మారాలి, మారడానికి వీలుగా వ్యక్తి ఆలోచన సాగాలి, వృద్ధి చెందాలని కళాత్మకంగా చెప్పారు. పెట్టుబడి దారీ సమాజపు వ్యవస్థలో లేడీకరుణాకరం లాంటి స్త్రీలు, 'ఏలూరెళ్లాలి' లోని మాణిక్యాంబగారిలాంటి స్త్రీలు, 'బండపాటు' లోని పార్వతి, చామాలు, కనకమ్మలాంటి స్త్రీలు, వారితో పాటు పురుషులూ పుట్టుకువస్తూనే ఉంటారు. ఈ వ్యవస్థ ఇలాగే ఉండాలి. మారకూడదు. ఇదిగాని మారి సోషలిస్టుస్వామ్యం గాని వస్తే డబ్బున్న వాళ్లు, లావాదేవీలు, కోర్టులు, వ్యాజ్యాలు, ప్లీడర్లు లేకపోతే తమ బతుకు ఏమైపోతుందో అనే భల్లూక స్వప్నంలో భయపడే గవరయ్య లాంటివారూ పుడుతూనే ఉంటారు. ఆ వ్యవస్థ మారవలసిన అవసరాన్ని

చాసో తన కథలన్నిటిలో చెప్పారు. 'బూర్జువా కుక్క' కథలో బూర్జువా సమాజంపై కలిగిన జుగుప్స, హేళన, ఆ క్రమం తిరస్కారంతో కూడిన భాషలో, పదజాలానికి అతీతమైన ప్రతిభతో సూక్ష్మంగా లక్షభావాల్ని వ్యక్తం చేసే, నాలుగు వేల అంచుల్తో నయాగారాలాగ విరుచుకుపడే నవ్వూ, గువ్వపిట్టలా గుబాళించిన ఆనందాల ద్వారా చాసో ఆ విషయాన్ని సూటిగా చెప్పారు.

చాసో తన కథల్లో సమస్యకు పరిష్కారం చేయరు. పరిష్కారం అభూత కల్పన అవుతుంది. ప్రస్తుత వ్యవస్థలో లేనిది అవుతుంది. అది వాస్తవం అవదు. అక్రమాల్ని ఎదురుకొనే తత్వం ప్రజల్లో కలిగి అది వ్యాప్తి పొందాలి. ఉధృతమై మార్పు రావాలి. దానికి అనుకూలమైన రచన చేయాలి. అజ్ఞానం, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలతో ఉన్న భారతీయ సమాజంలో, తాను రచించిన కథలను చదివి ఆదిశగా ప్రేరణపొంది, నిజాయితీతో సమాజంలోని మార్పుకు కృషిచేసే కార్యకర్తలు పెరిగినప్పుడు తన రచనల ప్రభావం ప్రసరించగలదనీ ప్రజలు చైతన్యవంతులు కాగలరనీ చాసో చెపుతూ ఉండేవారు.

రచనకు ఆయన తీసుకొనే విషయాలు, ప్రధానంగా సంఘానికి సంబంధించినవి గానూ మార్క్సిస్టు వాద విషయాలకి సంబంధించినవిగా ఉంటాయి. ఆయన సోఫిస్టికేటెడ్ జీవితాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కథ రాసే పద్ధతిలో పాత్రకి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. విషయం పాత్రకేంద్రంగా పాత్రకు విశ్లేషించడమే ప్రముఖంగా ఉంటుంది. వాయులీనం, బూర్జువాకుక్క, బొండు మల్లెలు, ఎందుకు పారేస్తానునాన్నా? పరబ్రహ్మము మొదలైన కథలు ఉదాహరణలు.

చాసో ఆంధ్రదేశం అంతటా సాహితీ యాత్రికుడిగా తిరిగినప్పటికీ ఉత్తరాంధ్ర, (శ్రీకాకుళం విజయనగరం, విశాఖపట్నం) మూడుజిల్లాలు అటు గోదావరి జిల్లాకు చెందినవారు. ఈ నాలుగు జిల్లాల స్థానికతను ఆయన తన కథల్లో చిత్రించారు. కాల స్థలాల వాస్తవిక స్వరూప స్వభావ చిత్రణ దుమ్ములగొండి కుక్కుటేశ్వరం, ఊహోఊర్వశి కథల్లో స్ఫూర్తిమంతం. సీవు ఘాట్, కొండలు, కోనాడ సముద్రం, చంపావతీనది, మామిడితోటలు, అన్నవరం, తుని, పిఠాపురం, గోదావరిలో ఏరువాక పడవప్రయాణం కాకికాడ రామారావు పేట, కళ్లముందుకు వస్తాయి.

రచయితలు వ్యక్తినిష్ట సంవేదనలతోనూ, Personal Touch తోను రచన చేస్తారు. చాసోకథల్లో కొన్ని కథలు ఈకోవకి చెందుతాయి. చాసో మొదటికథ 'చిన్నాజీ' అటువంటి కథే. ఐదేళ్ల కూతురు 'చిన్నాజీ' (తులసి) మీద రాసినది. అది చాసో ఇంటికథే పాత్రలు ఆయన కుటుంబంలోని వారూ, ఆయన మిత్రులు రోణంకి అప్పలస్వామీ, నారాయణబాబులు. అలాగే 'దుమ్ములగొండి', 'గుడిసె-దీర్ఘరోగి' కథలోనూ Personal Touch కనవడుతుంది. 'గుడిసె-దీర్ఘరోగి' కథలో పాడేరు కొండ చరియల్లో సవరవాడి గుడిసె, అభిమానకవి వర్డ్స్ వర్త్ కావ్యం ఎక్సెకార్షన్, కృష్ణశాస్త్రి, నారాయణబాబు, శ్రీశ్రీల గీతాలు, దుమ్ములగొండి కథలో గిరిరావు, మణ్యం, దుక్కడుకాళిదాసు, దాసన్నపేట గొల్లవాళ్లు, సీతాఫలంతోటలో రెల్లివాళ్లపాక – అన్నీ Personal Touch తో వచ్చినవే!

చాసో పాత్రలు అన్ని వయస్సులకు చెందినవీ, అన్ని తరగతులకి చెందినవి ఉంటాయి. ఆ పాత్రలు (Conflicting Characters) ఘర్షణపడే వాటిని చిత్రించడం చాసోకి ఇష్టం. పాత్రకు తాను బతికే వ్యవస్థతో ఘర్షణ ఉంచడం ఆయన కథల్లో చాలావాటిలో కనపడుతుంది. 'కుక్కుటేశ్వరం' కథలో ముసలమ్మ, "పరబ్రహ్మము" కథలో పిచ్చివాడు ఈ దృష్టితో పాత్రల్ని చూడొచ్చు. చాసోపాత్ర చిత్రణలో మరొక విశేషం పాత్ర ఒక పరిస్థితిలో మెలుగుతున్నప్పుడు ఆ పాత్ర మానసిక స్థితిని రచయిత చెప్పకుండా పాత్ర ప్రవర్తన ద్వారా ఆ స్థితిని ధ్వనింపచెయ్యడం. ఈ రకంగా ధ్వనింపచేయడం వల్ల పాఠకుణ్ణి ఆలోచనకు గురి చెయ్యడం జరుగుతుంది. ఈ విశేషం - ఈ చెప్పేతీరు సాహిత్య లక్షణాలకి కళాత్మకతకి ఉత్కృష్టమైనది. ఇది కష్టతర సాధ్యమైనది. చాసో దీనిని సాధించారు.

పాత్రల్లోనూ వైవిధ్యం సున్పష్టం. చిన్నపిల్లలు, ముసలివాళ్లు, సాహితీవేత్త, పిచ్చివాడు. పాకీది, విద్యాధికులు, పల్లెటూరి వాళ్లు, పట్నాలలోని విద్యార్థులు, మహానగరాల్లోని వాళ్లు, పెద్ద ఉద్యోగులు, గుమాస్తాలు, ఇలా సమాజంలో అన్ని వర్గాల వారినీ చూడ్డం చాసోలోని విశేషం. మొత్తం సమాజంలోని Cross section ని ఆయన రాసిన అతికొద్ది కథల్లో చూడొచ్చు. ఆ కాలానికి ప్రాతినిధ్యం వహిస్తూనే ఆయన కథలు అన్ని కాలాలికిచెంది విశ్వజనీనతతో ఉంటాయి. దీనికి చాసో 'జీవితాని' కిచ్చిన ప్రాధాన్యత కారణం అని చెప్పవచ్చు.

'కుంకుడాకు' కథలో పల్లెటూరి చిన్నపిల్లలు గవిరీ పారమ్మలు - ఆర్థికవ్యత్యాసాలు / బబ్బబ్బా కథలో పట్నవాసపు కుర్రాళ్లు - ఆర్థికవ్యత్యాసాలు / ఎందుకు పారేస్తాను నాన్నా కథలో విద్యార్థీ విద్యార్థినులుగా చిన్న పిల్లలు - ప్రధానపాత్ర కృష్ణుడు, బొండుమల్లెలు కథలో తాత, కుక్కుటేశ్వరం కథలో ముసలమ్మ, బొమ్మలపెళ్లిలో ముత్తవ్వ, వజ్రహస్తం కథలో అధికారులు, రాజకీయుడు, కర్మసిద్ధాంతంలో ఉర్లాం పండితుడు, ఊహాఊర్వశిలో సాహితీవేత్త, పరబ్రహ్మములో పిచ్చివాడు, జంక్షన్‌లోబడ్డీలో కౌన్సిలరు, వాయులీనంలో గుమాస్తా, ఎంపులో సొట్టాడు- గుడ్డివాడు, కుష్ఠురోగపు ముసిలాడు, లేడీకరుణాకరంలో లేడీకరుణాకరం, గుడిసె - దీర్ఘరోగిలో చిత్రకారుడు, ముష్టిరోగిష్టి ముసిల్ది, వాయిపులో రైతు ఇలా ఒకపాత్రకు మరొకపాత్ర భిన్నంగా అన్ని రకాల వర్గాలతో ఒక పూర్తి సమాజం కళ్లెదుటకు వస్తుంది.

చాసో ఏది రాయాలో ఏది రాయకూడదో బాగా తెలిసిన రచయిత. శిల్పం అంటే ఔచిత్యం. ఔచిత్యంతో రాయడానికి చాసో ఎంచుకున్న పద్ధతులు, ఆయనకి ఆయన తను సొంతంగా ఏర్పరచుకున్నవి ఆయన కథల్లో మనం గమనించవచ్చు. ప్రపంచ సాహిత్యంలోని గొప్ప రచయితలను అధ్యయనం చేసిన చాసో ఎవరి ప్రభావానికి లోనుకాకుండా తనదైన, తనకే చెందిన రాసే విధానాన్ని సాధించారు.

ఆయన కథల ఎత్తుగడలు నిబిడార్థాలతో ఉంటాయి. అల్పాక్షరాలతో అనల్పార్థ రచన ఆయనది. మాటల పొదుపు, క్లుప్తత. ఏ మాట ఎక్కడ ఎలా వాడాలో అంతే వాడడం. ఒక్కమాట

వెయ్యడానికి గాని తియ్యడానికి గాని వీల్లేనంత బిగువు. ఒక సన్నివేశం నుండి మరొక సన్నివేశంలోకి జార్చే వాక్యాలు- అంటే gliders ఉంటాయి. సన్నివేశంలోకి ప్రవేశించ గలిగిన రచయితకే ఇది సాధ్యం. ఈ glider వాక్యాలు కథకు పట్టునిస్తాయి. కథలనిండా కావ్యబింబాలు (Poetic images) ఉంటాయి. అయితే అవి కథని అంటుకొని ఉంటాయి. అంటే అవి ఉండడం అక్కడ అవసరం!! వర్ణనలు అంటనివి ఎక్కడా చేస్తే కనిపించవు. ప్రతి వాక్యాన్ని చిత్రిక పట్టడం కనిపిస్తుంది. ఆయన వాక్యం సొగసు దాని పొట్టిదనంలోనూ మాటల ఎంపికలోనూ ఉంటుంది.

చాసో కథల్లో భాష అక్షరాలా పాత్రోచిత భాష. పాత్రలలో ఎంత వైవిధ్యం ఉందో వాళ్లు మాట్లాడే భాషలోనూ అంత వైవిధ్యం ఉంది.

'కర్మసిద్ధాంతం' కథలో బ్రాహ్మణ వితంతువుల భాష, 'ఎంపు' కథలో ముష్టి వాళ్ల భాష, బదిలీలో అమాయకపు అమ్మాయి భాష, ఊహాఊర్వశిలో గోదావరిజిల్లాభాష, వాయులీనంలో మధ్యతరగతివారి భాష ఇలా కథనిబట్టీ పాత్రలని బట్టీ భాష మారుతూ కనపడుతుంది.

చాసో మాండలికాన్ని కథలలో చొప్పించిన రచయిత. మాండలికాన్ని వ్రాస్తున్నప్పుడు రచయిత చెప్పవలసిన వాక్యాలు వచ్చినప్పుడు మాండలికానికి దగ్గరగా ఉంటాయి. కథనానికి వ్యావహారిక భాష వాడి రాసిన కథలతో పాటు కళింగాంధ్ర మాండలికంలో పూర్తిగా కథంతా రాసారు. అదీ 1950-51లో! ఆఁవెఁత కథ. 1988లో రాసిన 'హెఁఅపు' కథ పూర్తిగా మాండలికంలో రాసినదే! శైలీలౌల్యం గాని భాషావైదుష్య ప్రదర్శనగాని చాసోలో వెతికినా ఎక్కడా కనిపించదు. తన సప్తతి పూర్తి సందర్భంగా చాసో తన స్వంతఖర్చుతో, తన సంపాదకత్వంలో కళింగ ప్రాంత కథలను 'కళింగ కథానికలు' పేరుతో సంకలనం వెలువరించారు. ఆ తర్వాతే తదితర ప్రాంతాల నుండి ప్రాంతీయ కథానికా సంకలనాలు ప్రచురించడం జరిగింది.

చాసో కథలు ఎక్కువగా బుద్ధిని తాకుతాయి. హృదయంలో చొచ్చుకు పోవడం తక్కువే అయినా కొన్ని చోట్ల కథ హృదయదఘ్నంగానే ఉంటుంది. అలా రచన చేయడంలోనూ ఆయన సిద్ధహస్తుడే. వాయులీనం, ఎందుకు పారేస్తానునాన్నా! ఆఁవెఁత, పోనీ తిను కథలు ఉదాహరణగా చెప్పొచ్చు.

ఈయన కథలు ఫార్ములాకథలు కావు. అంటే ఖాయంగా ఒకే పద్ధతిలో అన్ని కథలూ పరిణామం చెందాలి. - చివర ఒక నిర్ణయం (resolution) ఉండాలనడం చాసోకథలోని నియమంకాదు. అయితే ఆయన నిర్ణయంగా చెప్పదలిచినప్పుడు దానిని కూడా పటిష్ఠంగానే ఆయన రచించారు.

చాసోకథ ప్రారంభంనుంచి చివరిదాకా ఒకే ఊపుతో నడుస్తుంది. ఎక్కడా బెనగదు. పట్టు సడలదు. ముగింపుకు వస్తుంది. రచనలో సాంద్రతను సాధించిన రచయిత. మొదలూ చివరా మొత్తం అంతటా సాంద్రత ఖాయం. అంతేకాదు, అన్ని కథలూ ఒకే స్థాయి (ఉన్నత

స్థాయి)లో రాయగలిగిన రచయిత చాసో. గొప్ప వైవిధ్యం ఉన్నపాత్రలు, వ్యవహారికభాష, ఉత్తరాంధ్ర మాండలిక భాష, పరిసరాలు, - అంతస్తులు కల్పిస్తూ ఏ కథ ఏ స్థాయి కలిగి ఉండాలో అస్థాయికి (అంటే ఆ ఉన్నత స్థాయికే) కథని తీసుకొని వెళ్లే అసాధారణ నేర్పును సాధించిన గొప్ప రచయిత చాసో. ఇన్ని విశిష్టతలు ఉండడం చేతే ఆయన కథలు అంతర్జాతీయ సాహిత్యంలో దీటుగా నిలువ గలిగిన కథలు అయాయి.

కవిత టెక్నిక్‌లో శ్రీశ్రీలో ఎంత వైశిష్ట్యం వుందో తెలుగు సాహిత్యంలో కథారచనలో చాసోలో అంత వైశిష్ట్యం ఉంది.

చాసో వ్యక్తిగా కూడా విశిష్టుడే. నిలువెత్తు నిజాయితీకి నిదర్శనంగా, హుందాగా, నిరాడంబరంగా, నిప్పులా తన ఆశయాల కోసం చివరవరకూ బతికిన విలక్షణమైన మనిషి. ఆయన అభ్యుదయ రచయితల సంఘవ్యవస్థాపక సభ్యులుగా, అరసం అధ్యక్షులుగా, కార్యవర్గ సభ్యులుగా, అరసం అధ్యక్షవర్గ సభ్యులుగా, ఉద్యమ నిమగ్నతకు పర్యాయపదంగా బాధ్యతతో కృషి చేసారు. వామపక్షాల అనైక్యతను దోపిడీ దారులతో చేతులు కలిపి ఒక వామపక్షం మరొక వామపక్ష పతనానికి దోహదం చేసే వైఖరులను ఖండించారు. కథాశిల్పి చాసోనుంచి స్ఫూర్తి పొందాలని భావించిన విధంగానే నిమగ్నత, నిజాయితీ, నిరాడంబరత్వం, మానవత్వం - నేటి సాహితీవేత్తలూ - ముఖ్యంగా ఉద్యమకారులు చాసో వ్యక్తిత్వం నుంచి నేర్చుకొని స్ఫూర్తిపొందవలసిన అంశాలుగా గుర్తించడం జరిగింది.

చాసో, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ ముగ్గురు మిత్రులు మద్రాసులోనే కన్ను మూసారు. నాలుగోమిత్రుడు రోణంకి టెక్కలిలో మరణించారు.

చాసో భౌతికవాది. నిరీశ్వరవాది. తన మరణానంతరం తన పార్థివ శరీరాన్ని శాస్త్ర పరిశోధన నిమిత్తం అందచేయాలని కళ్లను అంధులకు అమర్చాలని కోరారు.

1994 జనవరి 2వ తేదీన మద్రాసులో చాసోకన్ను మూసాక, ఆయన కోరిక ప్రకారం కుటుంబసభ్యులు ఆయన పార్థివ శరీరాన్ని రామచంద్ర మెడికల్ కాలేజీకి అప్పచెప్పారు. ఆయన కళ్లను భద్రపరిచి అంధులకు దృష్టిని కలగచేసారు.

ఈ కథలను చదివి నేటి తరం స్ఫూర్తి పొంది చైతన్యవంతమవాలన్నది అరసం ఆకాంక్ష. యువతరం ఈ ఆకాంక్షను వమ్ముచేయదన్నది నా నమ్మకం.

- చాగంటి తులసి

విజయనగరం
14-11-2014

❈

కథా సూచిక

కర్మ సిద్ధాంతం

మంచి నీళ్లకి బిందెతో పుల్లమ్మా, ప్రాతః స్నానానికి రాగిజారీతో పేరక్కా తెల్లవారు ఝూమున నీళ్లాటిరేవులో కలిశారు. పేరక్క అడిగింది.

"అయితే పుల్లా! నాకన్నా పదిహేనేళ్లు పెద్దదానివి. నెత్తిమీద కరవై ఏళ్లొచ్చాయి. ఇంకా నీ కెప్పుడొస్తుందే జ్ఞానం? వెధవ సంసారంతో ఎప్పుడూ జలగలాగ కొట్టుకుచస్తే ఎలాగ? ముందుదారి చూసుకో అక్కర్లేదుటే?"

"ముక్తి మార్గాన్ని పడితే మంచిదే! అయితే అదెంతటివాళ్లకక్కా! తీరిక ఉంటేనా? ఎంత చీకటితో లేచినా తెమలవు పనులు. ఇంట్లో పాచి, వీధిలో పాచి, మంచి నీళ్లు, పిల్లలకు చద్దెన్నాలు, ఇన్నీ పూర్తిచేసి పెడా పొయ్యి మీద దబ్బుని అవుతుంది కదా అని వొండుతాను. పదీ కొట్టగానే పీటెక్కి పీక మీద కూచుంటాడు నా కొడుకు. ఉమ్మగిల్లని అన్నం, ముక్కలుడకని పులుసు, పాపం!, తిని ఆఫీసుకి పోతాడు. ఏ మాట కామాట అనాలి కదూ, నా కొడుకే పల్లెత్తుమాటాడడు. ఇహను మధ్యాహ్నం నడ్డివాల్చుదానిక్కాదు సరేకదా కోడికునుక్కైనా ఆనరాలేదు. పప్పులు బాగు చేసుకోడమో, పిండి విసురు కోడమో ఏదో ఆ వేళకి పని ఉంటూనే ఉంటుంది. వ్యవధిలేదు!" అని బాదరాబందీ చెప్పుకుంది పుల్లమ్మ.

"చాకిరీ! వెధవచాకిరీ! చేస్తే ఎంతేనా ఉంది సంసారానికి. సంసారమే పుల్లా! ఇదంతా సంసారమే! ఏమన్నాడు? కౌపీన సంరక్షణార్థాయ అయం పటాటోపః అన్నాడు. కోడళ్లు వచ్చేకా ప్రాణానికి సుఖం లేకపోతే ఇంకా ఎప్పుడు? మొగుడు చచ్చినా, పిల్లలు ప్రాజ్ఞులైనా కూడా యీషణత్రయాలు కట్టికి వొదలకపోతే ఇంకా ఎప్పుడే?" అనడిగింది పేరక్క. సమర్థురాలు కాబట్టి అడిగింది.

పేరక్క మహావేదాంతి. ఇంట్లో కోడళ్లకి పని పాటలో పూతికపుల్ల సాయం చెయ్యదు. కాళ్లు జాపుక్కూర్చుని అడ్డమైన చాకిరీ చేయించుకొంటుంది. మనమణ్ణి తెల్లారగట్ల లేపి పొరుగింటి వాళ్లింట్లో దేవకాంచనం పువ్వులు దొంగతనంగా కోయించుతుంది. బియ్యం పెట్టి సజ్జడు పువ్వులు వాడికగా కొంటుంది. ఇంట్లో నందివర్ధనం పువ్వులు బుట్టడు ఏరుతుంది. దర్భాసనమెక్కి సహస్రనామావళి పూజ భోజనం వేళ వరకూ చేస్తుంది.

లక్షవొత్తులవ్రతం, ఋషిపంచమి నోము వగైరాలన్నీ ఉద్యాపనలు చేసింది. కాశీ వోమాటూ, రామేశ్వరం రెండు సార్లూ వెళ్లింది. శ్రీశైలం, బదరీనారాయణం సేవించి చిల్లర మల్లర యాత్రలన్నీ చేసింది.

ఎవర్నిపడితే వాళ్లని వేదాంత విషయాల్లో టకాయిస్తుంది. వాటిలో సంస్కృతిగల ఘనాపాటీ. భారత, భాగవతాది పురాణాలన్నీ తెలును. శ్రీసూక్తం, పురుషసూక్తం వగైరాలన్నీ నాలిక చివరున్నాయి. భజ గోవిందం, శివానందలహరి, శ్రీకృష్ణకర్ణామృతం, యక్షగానాలు, తత్త్వాలు, శివకీర్తనలు, విష్ణు కీర్తనలు వందలూ వేలు కంఠతా. హేమా హేమీల్లో నిలబడి మాట్లాడగల వక్త.

"ఈషణత్రయాలు కట్టెకి వదలకపోతే ఇంకా ఎప్పుడే?" అనడిగింది. పుల్లమ్మ కదంతా బోధపడక పిచ్చి పుల్లమ్మలాగా చూసింది. అవిడ సాయానికి ఇరుగమ్మ వొచ్చింది. ఇంత ఘనాపాటి పేరక్కకీ ఇరుగమ్మంటే హడలు.

"పేరక్కా! నువ్వు వెయ్యి చెప్పు, నూరు చెప్పు, జనక మహారాజులాగా సంసారంలో ఉండే సాధించవచ్చు. నువ్వు చెయ్యడమే కాకుండా, ఊరందరినీ ఏ వ్రతాలో చెయ్యమని బాధ పెట్టకు!" అన్నాది ఇరుగమ్మ. అవిడ సత్సంగి. అవిడకి తీర్థయాత్రాభిగమనం, వ్రతాదులూ చేసి వెధవ్వాళ్లు సంసారాలని గుల్ల చెయ్యడం ఇష్టం లేదు. పేరక్క ఎవరింటికెళ్లినా ఎవరితో ప్రసంగించినా ముప్పువొస్తుంది. ప్రతి ఆడదానికీ వొక వ్రతం పిచ్చి పెడుతుంది.

"ఛాల్లే నువ్వు మాట్లాడకు. నీకూ మా తెలిసినట్టు!" అన్నాది పేరక్క

"ఆc! నీబోడి వేదాంతం నాకూ తెలును. పుల్లమ్మా! వెనకటికి ఆచంట దేముడికథ విన్నావూ?" అనడిగింది ఇరుగమ్మ. ఆచంటలో పుల్లమ్మ కొడుకు కొన్నాళ్లు ఉద్యోగం చేశాడు. అంచేత ఆ కథ తెలును.

"పరమశివుడు మహా శివరాత్రి పూటా సానింటి కెళ్ళిన వాడికిచ్చేడు మోక్షం. నువ్వు పుల్లా! సంసార తాపత్రయం పడ్డమే మంచిది. ఈ పిచ్చలకి పోకు!" అని ఇరుగమ్మ సలహా ఇచ్చింది.

"తేగా తేగా మంచి సామ్యం తెచ్చావు. బూతుసామ్యం!" అని కుల్లి కుల్లి నవ్వి చచ్చింది పుల్లమ్మ.

"పుల్లా! ఏమీ ఎరగని నీకు ఏకాశిచావూ, అన్నీ తెలుసునని విర్రవీగే పేరక్కకి మురికి చావూ తప్పవు. తెలిసిందా?" అంటూ బిందె బుజాన్నేసుకొని వెళ్లిపోతోంది ఇరుగమ్మ.

"నిలబడు! నిలబడి వాదనలోకి దిగి నిలబడు, వెళ్లిపోవడంకాదు!" అని సవాలు చేసింది పేరక్క

"ఈషణత్రయాలూ నీ మొహమున్నూ! అంత వేదాంతివైతే ఉన్నలొడ్డూ లొస్కూ నలుగురికీ పంచిపెట్టి, కాషాయగుడ్డలు కట్టుకొని సాధువమ్మవైపో. నీతో వాదిస్తే నాకేం ముక్తిరాదు. నోటితుంపర్లు దండగ. ఇంటికెళ్లి పిల్లలకింత అన్నం పెట్టి ఒకరికింత ఉపకారం చేస్తే ఉన్నాది. వెళ్లు. వెళ్లు!" అని వెళ్లిపోయింది ఇరుగమ్మ. అవిడ దగ్గర పేరక్క నోరు లేచింది కాదు.

"వెధవముండ ఎక్కడేనా దొరకదా? అప్పుడఱుస్తాను దీనిగ్రా. దీనికెలాగా పుట్టగతుల్లేవు. నానోటితోటెందుకనాలి? దీనికి పోగాలం. కాశీ గుమ్మంలోంచి దయాల్బాగు వెళ్ళింది. విశ్వనాథుడి

దర్శనం చేసింది కాదు. కాశీవిశ్వనాథుడు కూడా దీని దెయ్యాలబాగుకి తక్కువేట!" అన్నాది పేరక్క

"పేరక్కా! నిజంగానే కాశీ వెళ్లడం మానేసిందీ?" అనడిగింది పుల్లమ్మ.

"అయ్యో నిజం! రేపు దాన్నే అడుగు, అదో గొప్పలాగ గుండాడిస్తూ చెప్పు కుంటుంది."

పుల్లమ్మకది పెద్ద పాతకంలాగే కనబడ్డాది. కాశీకన్నా ప్రపంచంలో గొప్ప వున్నాయంటే ఆవిడ ఎలాగ నమ్ముతుంది?

పేరక్క పుల్లమ్మదగ్గర వంద శ్లోకాలూ పద్యాలు చదివి, ఇరుగమ్మని తిట్టి "ముందుదారి" గురించి బోధ చేసింది. కాని పుల్లమ్మ కేం బోధ పళ్లేదు. ఆఖరికి పేరక్కతో మధ్యాహ్నం శివాలయంలో మహాభారత పురాణశ్రవణానికి మాత్రం తెరిపిచేసుకుని వెళ్లడానికొప్పుకుంది. పేరక్క మందలోంచి దారి తప్పి అంధకారంలో పడిపోయిన గొర్రెని మందకుక్కలాగ మళ్లీ తోవలో పెట్టడానికి పూనుకుంది.

పుట్టి పురుషుడు యజ్ఞం చేసేడని పుల్లమ్మ పురాణానికెళ్లింది. కోలాహలంగా ఉంది శివాలయం. మంటపం తోరణాలతో అలంకరించారు. దాని మీద కూర్చుని అట్ట హాసంగా తయారై కాశ్మీరశాలువా కప్పుకొని ఉర్లాం పండితుడు భారత పురాణం చెపుతున్నాడు. గుడి నిండిపోయింది.

పేరక్క పుల్లమ్మతో రావడం ఆలస్యమైనా జనాన్ని తోసుకొని, అందర్నీ నెట్టేస్తూ, మంటపం ముందుకెళ్లి పండితుడికీ వ్యాసపీఠానికి నమస్కారాలు చేసి అందరి మధ్యా ఇరికింది. పుల్మమ్మనీ ఇరికించి కూచోపెట్టింది. పక్క బోడెమ్మలంతా పళ్లు కొరుక్కుని మెటికలు విరిచారు.

"వెనకంత చోటుంది. ఇక్కడే దూరాలా?" అన్నాది సాహసించి ఒక్కర్తె.

"అర్థం చేసుకోగలను గదా అని ముందు కూర్చున్నాను. మీలాంటి దాన్నే అయితే వెనక్కే పోదును!" అన్నాది పేరక్క, తేలుకొండిలా నాలికాడిస్తూ. ఆ గోరోజనం జవాబుకీ, ఆ బాబాక్రమానికి ఎవరూ ఎదుర్కోలేకపోయారు. అంతట్లో పండితుడే పేరక్క పక్షం మాట్లాడేరు.

"కూర్చోండి పేరక్కగారూ! కూర్చోండి. జాగా చెయ్యండమ్మా పేరక్క లాంటి వేదాంతులు నలుగురొస్తేనే సభ. ఇప్పుడెంతో నిండువొచ్చింది. 'రెడ్డివొచ్చేదు మొదలెట్టండి' అన్నారుట. అలాగ్గా మళ్లా ప్రారంభిద్దాము" అని ప్రారంభించిన కథావిధానం మొదటినుంచీ మళ్ళా ప్రారంభించారు పండితులు.

"ఒసేపుల్లా! చూశావా! ఈ వెధవలంతా నేను ఉఫ్ అని ఊత్తే ఎగిరిపోతారు" అని అప్పుడు పేరక్క సభానదులందర్నీ విజయంతో సింహావలోకనం చేసింది. పేరక్క చాలా గొప్పదనుకొంది పుల్లమ్మ.

శాస్త్రులుగారు మకరకుండలాలాడించుకొంటూ సింహతలాటం మురుగులతో హస్త విన్యాసాలు చేస్తూ శలవిచ్చారు.

"గాంధారి మహాపతివ్రత. నూరుగురు కొడుకుల్ని కన్నాది. దుర్యోధన సంపత్తి ఆర్యావర్తమంతా పేరు పడ్డాది. అలాంటి కౌరవులంతా సమరంలో నమిసిపోయారు. గాంధారి నూరుగుర్ని కన్నా పుత్రశోకం తప్పిందికాదు. చూశారా?

కర్మ తప్పించుకోవడం బ్రహ్మతరం కాదు. శ్రీరామచంద్రుడికి అరణ్యవాసం, భార్యా వియోగం తప్పేయికావు. శ్రీనాధుడంతటి మహా కవీశ్వరుడికి తిలపిష్టం వెల్లుల్లితో విశ్వస్థ వడ్డించగా తిండం తప్పింది కాదు.

పుణ్యపాపాలు రెండూ ఒక్కటే. పాపం చేసుకొన్న వాళ్లు దేహులై వారి వారి కర్మల ననుసరించి పుడతారు. పుణ్యం చేసుకోడం అంటే స్వర్గలోకానికి టిక్కెట్టు కొనుక్కోవడం. అక్కడికెళ్లిన తరువాత పుణ్యం క్షీణించగానే మళ్లా మర్త్యలోకం సంప్రాప్తిస్తుంది.

అంచేత పుణ్యపాపాలు రెంటికీ ఆశించకుండా భగవంతుడ్ని కొల్చిన వాడికే జన్మరాహిత్యం లభిస్తున్నాది.

కర్మ తెలిసి చేసినా తెలియక చేసినా అనుభవించక తప్పదు. అగ్ని హోత్రంలో చెయ్యి ప్రమాదాన్ని పెట్టినా కాలుతుంది. కందుకాన్ని కొడితే మీదికి త్రుళ్లుతుంది. చేతిలోంచి జారి క్రిందపడ్డా త్రుళ్లుతుంది."

"చూడే పుల్లా! ఘటానికెన్ని ఉన్నాయో?" అన్నాది పేరక్క

"అదేమిటో అంతా గోలగా ఉందే! బోధ పళ్లేదు". అని తల గోక్కుంది పుల్లమ్మ.

"అజ్ఞానికి బోధపడదు. అయితే ఏం చెప్పేదు? చదివిన, వినిన, పఠించిన అన్నాదు. విన్నా కొంత ముక్తి ఉన్నాది" అని చెప్పింది పేరక్క. "పోనీ నాకూ కొంత ఉందికదా!" అనుకుంది పుల్లమ్మ.

గాంధారి పుత్రశోకానికి కారణం శాస్త్రులు వారు శలవిచ్చారు. విశ్వ రహస్యాన్ని సాధించేమన్న వేదాంతోత్తములు ఈ మాత్రం కారణం చెప్పలేరూ?

గాంధారి తొలిజన్మలో గంజి కన్నంలోకి వార్చింది. అది ఎలక్కన్నం. సళసళ ఉడుకుతున్న గంజిపడి కన్నంలో నూరు ఎలకపిల్లలు కుతకుత ఉడికి చచ్చాయి. తెలియక చేసినా ఆ పాపం ఈ జన్మలో అనుభవించక తప్పిందికాదు.

"అయితే పేరక్కా! ఎలక నూరు పిల్లల్ని పెడుతుందా?" అనడిగింది పుల్లమ్మ .

"బాగానే ఉన్నాయి వెధవ ప్రశ్నలు!" అన్నాది పేరక్క.

"నాకు తెలియక అడిగానే!"

"ఇహ నువ్వు విననివ్వవులాగుంది."

"ఇల్లు నేస్తూ ఉంటే ఎలకగూట్లో ఎనిమిది పిల్లల్ని చూశానే. ఎలక ఒక్కమాటు నూరుపిల్లల్ని కంటుందా!"

"వెధవ ప్రశ్నలు! గాంధారి నూరుగుర్ని కన్నాది. నువ్వెక్కడేనా ఎరుగుదువా? ద్రౌపదికి ఐదుగురు మొగుళ్ళు. నీకున్నారా?"

"ఆc, పది మంది మొగుళ్ళని పెట్టుకొని తిరుగుతున్న ద్రౌపదిని నేనెరుగుదును." అన్నాది సమయం కోసం కనిపెట్టుకుని ఉన్న ఒకావిడ.

"అనండి, అనండి, ఇలాంటివే నవ్వుతూ చెయ్యడం, ఏడుస్తూ అనుభవించడం! ఈ సంచితార్థం ఊరికే పోదులెండి" అని శాపనాకారాలు పెట్టింది పేరక్క. గాంధారి నూరుగుర్ని కన్నాదన్నా, ఎలక కన్నాదన్నా ఆశ్చర్యంగానే ఉన్నాది. కాని, పుల్లమ్మ 'అవును కాబోలు నాకు తెలియదు'. అనుకొన్నాది.

సాయంకాలం ఐదుగంటలదాకా పురాణం చెప్తుతారు పండితులు. ఆ తరువాత కూడా ఉండి ధర్మసందేహాలన్నీ అడిగి తెలుసుకొని పేరక్క పండితునితో కలిసి ఇంటికి బయలుదేరుతుంది. ఆవేళ మూడు గంటలకల్లా గాలీ, మేఘం ముంచుకొచ్చేయి. ఇళ్లకి చాలా మంది తోవతీశారు.

"పేరక్కోయ్ మేఘ మెత్తింది!" అన్నాది పుల్లమ్మ.

"ఇంటికన్నా గుడి పదిలం. వెచ్చగా కూర్చో. వెలిశాకే వెళదాము." అన్నాది పేరక్క

"ఆవకాయే!"

"కోడలుతొత్తు ఎత్తదూ?"

"ఇంకానయం. నిండు చూలాలు. తొత్తులంజా, అవేమిటే ఆ మాటలు?"

"అయితే ఏమంటావు?"

"పోదాం!"

"వెధవ సంతలాగే ఉంది. నిన్ను తీసుకురావడం తప్పు. తెద్దెక్కడికెళ్ళినా ఏగాణియే! వెళ్తే నువ్వెళ్లు. నే(రాను!" అని చెప్పేసింది.

పుణ్యానికిపోతే పులెత్తుకు పోయిందిట. రూపాయిలు దొంతులకి దొంతులు పెట్టి పెట్టుకొన్న ఆవకాయ. సంవత్సరం తినవలసిన వస్తువు. పుణ్యం పురుషార్థం నాకెందుకని పుల్లమ్మ వెళ్లిపోయింది.

పరుగు పరుగున పోయి తలుపు తట్టింది. తలుపు మనమడు తీశాడు. పెరట్లోకి వెళ్లింది. దొడ్లో ఆవకాయ లేదు. అరుగుమీద జుత్తారబెట్టుకొంటోంది కోడలు.

"నెత్తివాయించా! స్నానం చేసి ఆవకాయ ఎత్తేవా? నిండుచూలాలివి!" అన్నాది.

"ఇంకా నయం వెళ్లక వెళ్లక పురాణానికెళ్లారు!" అని అభిమానం చూపించింది కోడలు.

వానా లేదు. వొంగడూ లేదు. గాల్తో కొట్టుకుపోయింది.

రాత్రి భోజనాలయాయి. పుల్లమ్మ తిండితిని ఎంగిలాకుతో వీధిలో కొచ్చింది. గుమ్మంలో వీధి పెట్రోమేక్సులైటు వెలుగుతోంది. చేతిలో ఎంగిలాకుని ఎగిరి అందుకోవడాని కొచ్చింది ఊరకుక్క. "ఛీ ఛీ ఛీ! వెధవముండా! నీ నెత్తి వాయించిరిగదే!" అని కుక్కని కసిరి కొట్టి దూరంగా రోడ్డువారకి ఎంగిలాకుని పారేసింది. కీచుకీచంటూ పందిపిల్ల వొచ్చి ఎంగి లాకులో మామిడి టెంకని కరచుకొని కొరకడానికి స్వాధీనం కాక తిప్పలు పడుతున్నాది. దాని మీద

ఊరకుక్క 'బొంయ్యి'ని పడి పీక కరిచింది. మెడ దగ్గర తెగిపోయి రక్తం బొటబొట కారుతూ, ఏడుస్తూ పడిపోయింది పందిపిల్ల. దొడ్లోంచి తల్లిపంది మదుంకంపు కొడుతూ "ఘర్ ఘర్" మని కుక్క మీదికి యుద్ధానికొచ్చింది. దానివెంట వొచ్చాయి దాని పది పిల్లలూ సాలక్కి సాలగ. పక్క వీధిలోంచి రేచుకుక్క చప్పుడు కాకుండా వొచ్చిపడ్డాది. ప్లీడరుగారి పెంపుడు కుక్క "ఒలీవ్యా" ఒచ్చింది. కుక్కలు మూడు ఏకమై పందుల్ని వెంట పెట్టేయి. కాలభైరవుడి దగ్గర వరహావతారం పరారీ అయిపోయింది. పందిపిల్ల మూలిగి, మూలిగి చచ్చింది.

రేచుకుక్క విస్తర్నంతా తన స్వాధీనం చేసుకొంది. ఊరకుక్క మూతి పెట్టబోయింది. రేచుకుక్క నిప్పులు కక్కుతూ చూసి "య్యాం" అని కరవడానికి పళ్ళిగిలించింది. "కుయ్యో" అంటూ ఊరకుక్క దూరంగా పోయి తోక ముడుచుకొని చూస్తూ నిలబడ్డాది. "ఒలీవ్యా" ఒచ్చి విస్తర్ని లాగింది. రేచుకుక్క దాన్నేమనలేదు. "ఒలీవ్యా" ఆడకుక్క

పుల్లమ్మంతా చూసింది. పందుల మీద జాలి. కుక్కల మీద కోపం వొచ్చింది. కింది రాయినితీసి ఫైట్టని కొట్టింది. ఇంత రేచుకుక్కా అన్ని కుక్కల్లాగే "కయ్యో కయ్యో" మని కుంటుకుంటూ పారిపోయింది.

పుల్లమ్మ సంతుష్టిపడి ఇంట్లోకెళ్లి పనులు చక్కబెట్టుకొని పక్కవేసింది. కాని నిద్ర పట్టలేదు. ఆవిడ జన్మలో ఏ విషయం మీద బుర్రతో ఆలోచించి ఎరగదు. ఆవిడ బతుక్కి ఆలోచించవలసిన అవసరం కాని, విషయాలు కాని లేవు. ఆ రాత్రి మాత్రం ఎక్కళ్లేని దీర్ఘాలోచనా పట్టుకుంది.

గాంధారికథంతా తనలో తాను పూసగుచ్చి చెప్పుకుంది. తెలిసి చేసినా తెలియక చేసినా కర్మ అనుభవించక తప్పదన్నాడు శాస్త్రులు. సబబుగానే కనబడ్డాది కర్మవాదం. పురాణంలో వాళ్ళని పేరక్క ఏమన్నాది? "నవ్వుతూ చెయ్యడం ఏడుస్తూ అనుభవించడం". ఆలోచించగా ఆలోచించగా వెర్రెక్కువైపోయింది. ఎంగిలాకు పారేస్తే జరిగిన కుక్క జట్టీ జ్ఞాపకం వొచ్చింది. పుల్లమ్మ తల వేడెక్కింది. ముచ్చమట్లు పోశాయి. గుండె గడగడ లాడిపోయింది.

ఆ కుక్క జట్టీకి తనే కారణం! బద్ధకించకుండా తనేకాని నాలుగడుగులు వేసి డొక్కులో ఎంగిలాకు పారేస్తే ఆ జట్టీ రాకపోను! పందిపిల్ల ప్రాణాలు దాని మూలంగా పోయాయి! కుక్కల సిద్ధాన్నం రాయితో కొట్టిపాడు చేసింది. వాటన్నిటికీ బ్రహ్మదేముడేం శిక్షలు విధిస్తాడో? చచ్చిపోతున్న పందిపిల్ల కళ్లకి కట్టింది.

"హమ్మో!" అన్నాది పుల్లమ్మ. పందిపిల్ల మూలుగుతూ, గింజకుంటూ, నీలుగుతూ కనబడ్డాది.

"హమ్మో!" అని మళ్ళా గట్టిగా కేకేసింది పుల్లమ్మ. ఆమె తలగ్రిరని తిరిగిపోయింది. పంచ ప్రాణాలు ఎగిరిపోయాయి. పెరటితలుపు భడీమని తీసింది. అవతల కెళ్లింది. తులసికోటకి సాష్టాంగపడిపోయి గట్టిగా వెంకటరమణమూర్తి పూనిన వాళ్ళలాగ అరచింది.

"శ్రీమన్నారాయణమూర్తీ! తండ్రీ! మహాప్రభో! వరప్రసాదీ! నువ్విచ్చిన కొడుకు నాకొక్కడే తండ్రీ! నేను తెలియక చేసిన పాపాలు మన్నించు నాయనా! పందిపిల్ల చచ్చిపోయిందని ఆ

పాపం నానెత్తిని రుద్దకు బాబో! నా కొడుకు ప్రాణాలు కాపాడు. వాడి చేతిమీదుగా నా ప్రాణాలు తీసుకుపో శ్రీమన్నారాయణమూర్తీ." అంటూ దండకంలాగ ప్రారంభించింది.

ఆ గోలకి కొడుకూ, కోడలూ, పిల్లలు లేచివొచ్చేరు.

"ఏమిటే అమ్మా?" అని కొట్టి కొడుకు అడిగాడు.

"ఇంకేమిటి కావాలి నాయనా? నీ పీకమీదికి తీసుకొచ్చేను. ఆ పందిపిల్ల నా మూలాన్ని చచ్చిపోయింది. గాంధారికి వేసినట్టే ఆ శిక్ష నాక్కూడా వెయ్యొద్దని దేముణ్ణి ప్రార్థిస్తున్నాను!" అన్నాది పుల్లమ్మ.

"పీడకలొచ్చింది". అన్నాది కోడలు.

"పీడకల కాదర్రా, పీకెండిపోతున్నాది. మంచి నీళ్లుతెండి. చెపతాను". అన్నాది.

నీళ్ళు తాగి, తాపీగా ప్రాణాలుపోతున్నట్టు హీనస్వరంతో చెప్పింది. పేరక్క ముక్తిమార్గం చూచుకోమనడం, పురాణానికి వెళ్లడం, గాంధారి కథ, కౌరవుల చావు, తన మూలాన్ని ఎంగిలాకు పారేస్తే కుక్క జట్టీ, పందిపిల్ల చావూ.

"ఒస్సిదిటే! నా ప్రాణాలకేమి భయంలేదు. కావలిస్తే రోజుకో జంతువుని చంపు. నీకేం తఖరులేదు. పోయిపడుకో!" అన్నాడు కొడుకు.

"లేదురా, అలాగ జరుగుతాయటరా. తెలిసి చేసినా తెలియక చేసినా పాపకర్మం అనుభవించక తప్పదుటరా!" అన్నాది పుల్లమ్మ.

"పేరక్కపాటి, ఆ పండితుడుపాటి నాకూ తెలుసు. ఈ ప్రపంచంలో పాపం చేసినవాడికి భగవంతుడు శిక్షవెయ్యడం లేదు. ఖూనీలు చేసిన వాళ్లు, కొంపలు కూల్చిన వాళ్లు బాగానే ఉన్నారు; దేముడు శిక్ష వేస్తున్నది అమాయకత్వాన్ని, తెలివి తక్కువ తనాన్ని".

"ఇంతకీ మూలం పేరక్కకదా? దాని నంగతి తెలుసా? దానికీ ఆ ఉర్లాం పండి తుడికీ..." అంది కోడలు.

"ఏమిటేమిటీ?" అన్నాది పుల్లమ్మ.

"దాని ధైర్యం మీదే ఇన్నాళ్లు ఇక్కడ తిష్టవేశాడు."

"నిజమే!"

"అబద్ధమనుకున్నా వేమిటి?"

"నలభై ఏళ్లు దాటిన మనిషి, జ్ఞాని..."

"నలభై ఏళ్లు దాటినా నీ కోడలుకన్నా అదే గట్టిగా ఉంది. జ్ఞాని కనకే యీ పనులు!"

"కొడుకులున్నారు. ఊరుకొంటున్నారా?"

"ఊరుకోక ఉరెట్టుకుంటారటే అమ్మా? దాని దగ్గర డబ్బుంది. దెబ్బలాడితే అది పట్టుకొని లేచిపోతుంది. పండితుడితో కాశీకి పారిపోతే పుణ్యం పురుషార్థం కూడా దక్కుతాయి!"

"అలాగ చెప్పు. అందుకే అంతా పేరక్కని యీనడిస్తూ వొచ్చేరు.ఇదేనా బోడిద్రౌపది? ఇంకెవరో అనుకొన్నాను!"

"ఇహ వెళ్లు."

"అయితే ఫరవాలేదంటావు?"

"నీ మొహం, వెళ్లు!" అని కొడుకు ఒక్కకనురు కసిరేడు. అప్పుడు పుల్లమ్మ కుదటపడ్డాది.

కాలచక్రం తిరగడంలో పాపపుణ్యాల పర్యవసానం మరిచిపోయింది పుల్లమ్మ. మళ్లా పనసపండులాంటి మనుమణ్ణెత్తింది. బారసాల పీటల మీద కొడుకూ, కోడలూ కలకల్లాడుతూ కూచున్నారు. బారసాల వంటంతా బ్రాహ్మణ్ణి పెట్టకుండా పుల్లమ్మే వండింది. తిన్న వాళ్లంతా పాకం మా బాగుందన్నారు. వచ్చిన వాళ్లంతా "కడుపుచలవ పుల్లమ్మ" దన్నారు.

"వాళ్లు చల్లగా పదికాలాలు వుండడమే నాక్కావలసింది. ఇహన్నేనెలాగా వెళ్ళిపోవలసిందాన్నే. మనుమడికి వొక జంధ్యం పడేస్తే ఆ బూరెముక్క తిని చచ్చిపోతాను!" అన్నాది పుల్లమ్మ.

❀

ఆంధ్రపత్రిక, 28-4-1942

కుంకుడాకు

అప్పలనాయుడు కూతురు పారమ్మ. చినదేముడు కూతురు గవిరి. ఊళ్లోంచి పొలాల్లోకి పోతున్నారు. అప్పలనాయుడు మోతుబరి రైతు. చినదేముడు గోచిపాతరాయుడు. అంచేత పారమ్మ చింకి పరికిణీ కట్టుకుంది. గావంచా పైటేసుకుంది. గవిరి గోచీ పెట్టుకుంది. కంపకట్టా, తట్టా పట్టుకుంది. పారమ్మమెళ్లో పగడాలున్నాయి. చేతులకీ కాళ్లకీ సిల్వరు కడియాలున్నాయి. గవిరి ముక్కు గోక్కుంది. దాని ముక్కులో రాగికాడలున్నాయి. పారమ్మ ముక్కుకీ చెవులకీ బంగారపు కాడలున్నాయి.

"సెద్ద రుసిగా వుంది"! అన్నాది పారమ్మ.

"ఏటి?" అనడిగింది గవిరి.

"ఊరగాయ."

"ఎక్కిడిది?"

"మాయయ్యకి బుగతగోరిచ్చారు."

వాళ్లయ్య అప్పలనాయుడు. అంచేత బుగతలు ఊరగాయ అడిగినా ఇస్తారు. కూర అడిగినా ఇస్తారు.

"నాను రెయ్యిలు నంచుకొన్నాను" అన్నాది గవిరి. అబద్ధమాడింది. గొప్పకి అబద్ధమాడింది. పారమ్మ చింకిపరికిణీని మచ్చరంతో చూసి తన గోచీని తడువుకొంది.

"ముండాగొప్ప! ఎవిడికీ తెల్దనుకున్నావు గావాలి, గింజలునేక రేత్రి మీరగ్గేసుకోనేదు. మాయయ్య సెప్పినాడు. తాగడానికి దప్పికనేదు. రెయ్యిలు నంచుకొంది! రెయ్యిలు!" అని పారమ్మ కిందికీ, మీదికీ చేతులు ఎగరేస్తూ ఎత్తిపొడిచింది.

"నిన్న రేతిరి మీకూ కూడునేదు!" అన్నాది గవిరి. మాటకి మాట అన్నాది.

"నిన్న రేతిరి మాకు కూడు నేదూ? ఓసి లమిడీ! ఎవిడు సెప్పినాడు? మాయమ్మనడుగు. రేత్రి మునేళం సేపలపులుసు, వొరన్నం తిన్నాం." అన్నాది పారమ్మ. వాళ్లయ్య ఊళ్లోకి పెద్దనాయుడు. నంతకెల్లి పులుసులోకి మునేళం, ఇగురికి చందువాలు తెచ్చాడు.

చిన్నబోయి గవిరి కళ్లాలవేపు తిరిగింది. పారమ్మ కూడా చేతులూపుకుంటూ వెంబడించింది. ఊళ్లో బడిపిల్లలు ప్రార్థన మొదలెట్టారు.

"తల్లీ నిన్ను దలంచి!" అని మేష్టారందిస్తున్నారు.

"తల్లీ నిన్నుదలంచి!" అని పిల్లలంతా ఒక్కమాటు వూరెగరగొడుతున్నారు.

పారమ్మా, గవిరి గోర్జలోకెళ్లారు. తోవచూచుకుంటూ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గోర్జవార వేళ్లూ, వూడలూ దించి మొగలి పెండి ఉన్నాది.

"నాను మంగళారం బడికెళతాను. ఆయేల మంచిరోజు. మేష్టరు గోరు పంపమంటే మాయయ్య పంపుతానన్నాడు" అన్నాది పారమ్మ.

"ఎందుకూ ముష్టి సదువూ?" అన్నాది గవిరి.

"సదువెందుకా? ఇను ఇను! ఎనాగ పాడుతున్నారో!"

"మాయయ్యనీ మేష్టరుగోరడిగినారు. కూలిసేసుకొనే వోళ్లకి సదువెందుకన్నాడు మాయయ్య."

"అవును. మీయయ్య కూలోడు. మాయయ్య నాయుడు".

గవిరికి గొంతుకలోకి ఏడుపూను, కళ్లలోకి నీళ్లు తోసుకొచ్చాయి.

బలుసుతుప్పలో ఊసరవిల్లి పెద్దచప్పుడు చేసింది. కోరడిలో పచ్చగన్నేరు నిండా పువ్వులు పూసి గోర్జనిండా సగం రాల్చింది. పార నాలుగు పువ్వులు ఏరి తల్లో దోపుకుంది. గవిరి కూడా ఏరుకుని తురుముకుంది. దాని చేతికి ముంతంత ముచ్చటిముడి తగిలింది.

"ఒలే పారా! సూడు, నాకు ముంతంత కొప్పున్నాది. నీ బుఱ్ఱమీద ఎంౘ్రుకలే నేవు" అన్నాది. పారమ్మ చూసింది.

"కొబ్బరిపీచు నాగెందుకు? నా తల సూడు, ఎంత నూన రానుకున్నానో, నీ తలకి నూనే నేదు!" అన్నాది పార.

బడిపిల్లలింకా గొంతుక చించుకుంటూ ప్రార్థిస్తున్నారు. పార కూనిరాగం తీసింది.

"సరస్వతీ!" అన్నారు బడిపిల్లలు.

"సరస్పతీ!" అన్నాది పార.

"నమస్తుభ్యం!" అన్నారు బడిపిల్లలు.

"నమత్తుబ్బెం!" అన్నాది పార.

"నువ్వు పాడుకుంటూ కూకో, నాను కంపలేరుకోవాలి" అని గవిరి కళ్లాలకి తోవతీసింది. పార వెంటపడ్డాది. గవిరి ప్రాయం ఎనిమిదేళ్లు. కాని దాని నెత్తిమీద కొండంత సంసారభారం వున్నాది. చిన్న దాక నెత్తి మీద పెట్టుకొని కోనేటికిపోయి ఇంటికిపడే నీళ్లలో సగం అదే మొయ్యాలి. తట్ట పట్టుకొని పెండిలంటా, తోటలంటా పోయి ఆకూ అలమా, కఱ్ఱా కంపా ఏరి ఇంటికి ఒక పూటకి సరిపడే వంటచెరుకు తేవాలి. ఆ బాధ్యతలని గవిరి మోసివున్నాది.

పక్క పొలాల్లో పెసరకాయలు గుత్తులు గుత్తులున్నాయి. పారమ్మ నాలుగు మొక్కలు పీకి కాయలేరుకు తింటున్నాది. గవిరి కడుపులో కాల్తున్నాది. దానికి ఆవేళ దప్పికలేదు. అంతకు ముందు రాత్రికూడా తిండిలేదు.

"ఓలమ్మ ఆకలేవ్!" అంటూ రాత్రెంతో ఏడ్చింది.

"ఓ లేదవకే, ఇంట్లో ఏటీనేదు!" అని ఓదార్చింది వాళ్లమ్మ. ఏడ్చి ఏడ్చి ఆఖరికి ఆకలినిద్ర పట్టిపోయింది.

గవిరి కూలివాడి కూతురు. పొలాల్లోపడి దొంగతనంగా తినడాన్కి ధైర్యం చాలదు. నాదారులు ఆ రకం చిన్న దొంగతనాలు చేస్తే పెద్ద నేరాలు అవుతాయి. ఉన్నవాళ్లు చేస్తే కమ్ముకుపోతుంది. పారమ్మ చెట్లు పీకి తోవకడాకూ తింటున్నాది. దానికి నిర్భయం.

"ఆళ్లు నూస్తే టెంకి మాడుతుందిలే!" అన్నాది గవిరి.

"నూసినోడెవడు? నూసినా నానప్పలనాయుడు బొట్టిని. ఆళ్ల మొకం ఏటంటారు?" అన్నాది పార. గవిరి కడుపులో కరకరలాడుతోంది. దాని కళ్లకి సత్తుగిన్నెతో నిండా గిన్నెడు గంజి, నంచుకోడాన్కి ఎండుమిరపకాయ కనపడ్డాయి. ఎక్కణ్ణుంచి వస్తాయి? వాళ్ళయ్య చినదేముడు కూలి ఏమైనా తెస్తే రాత్రికి తిండి, లేకపోతే ఆ రోజు పస్తుపడుకోవలసినదే. గవిరి కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

కుంకుడుచెట్టు తోవనిండా ఆకులు రాల్చింది. కుంకుడాకుల్ని చూచి గవిరి ఆకలి మర్చిపోయింది. అన్ని ఆకుల్లోకి కుంకుడాకులు చాలా దళసరివి. నాలుగాకులు ఏరితే తట్ట నిండుతుంది. ఆకులన్నీ తుడిచి తట్టలోకెత్తి నొక్కి కుక్కింది. దాని బాధ్యత ఆ పూటకి అయిపోయింది. తట్ట బరువుగా నిండింది. దాని గుండె తేలికైంది. ఇద్దరూ ఇంటికి తోవతీశారు. పారమ్మ పొలికేకలేస్తూ బయలుదేరింది. కాంభుక్తగారి కళ్లాం చేరుకున్నారు. కళ్లాం వారనుంచి చింతకింద పడిపోతున్నారు. వాళ్ల ముందు టప్పని ఏదో పడ్డాది.

"ఓలమ్మో తేలు!" అని తుళ్ళిపడి కేకేసింది పార.

"తేలు కాదు పీత!" అన్నాది గవిరి.

ఏ కొంగనోట్లోంచి పడ్డాదో! గవిరి చింతలలోకి చూచింది. చింతల శిఖరాలు కొంగలతో నిండివున్నాయి. చింతలు తెల్లతామరలని పూసినట్టున్నాయి.

"ఎన్ని సింతకాయలో!" అంది గవిరి. పారమ్మ తలెత్తి చూసింది. దాని నోరూరింది రాళ్ళు తీసి కొట్టింది. మూడు కాయలు రాలాయి. ఒక కాయ కొరుక్కుని రెండుకాయలు చింకి పరికిణీలో దోపుకొంది.

"ఒలే పారా! నాకో కాయెట్టవు?" అనడిగింది గవిరి.

"నువ్వూ కావలిస్తే కొట్టుకో!" అన్నాది పార.

"ఒలే! ఒలే!" అని గవిరి ప్రాధేయపడ్డాది.

"అయేటి రాళ్లు!" అని పారమ్మ తోవతీసింది. తలెత్తి చూచింది గవిరి. కొడవళ్ళలాగ ఊగుతూ కాయలు వేళ్లాడుతున్నాయి. గవిరి భయపడుతూ ఒక రాయి విసిరింది. ఆ రాయి దబ్బున కిందపడ్డాది. ఆ చప్పుడికి మరింత భయపడిపోయి నాలుగు పక్కలా చూసింది. పారమ్మ మళ్లా

పెనరకాయలకి పొలాల్లో పడ్డాది. గవిరి మరోరాయి విసిరింది. కాయలు రాలకపోయినా పెద్ద ఎండుకొమ్మ చెట్టుమీంచి గలగల మని జారి కిందపడ్డాది.

గవిరి చంకలు కొట్టుకుంది. "అయిదెబ్బ!" అని ఆ కంపమీదికి ఒక్క పిల్లిగంతు వేసింది. కొమ్మని చితుకులుగా విరిచి తట్టమీద పెట్టుకొంది.

"ఎవరక్కడ?" అని కళ్లంలోంచి కేక వచ్చింది. గవిరికా కేక పిడుగులాగ వినపడ్డాది. కళ్లంలోకి చూసింది. ఎదురుగుండా కాంభుక్తగారు నిలబడి ఉన్నారు. ఓచేత్తో నెత్తి గోక్కుంటూ, రెండో చేతినేమి చేయడమో తెలియక గవిరి వింటిల్లిబద్దలాగ వొంగిపోయింది. భుక్తగారు చింతనిప్పులు రాలుస్తూ చూస్తున్నారు.

"పొయినోకి" అని వొణుకుతూ గవిరి చెప్పింది.

భుక్తగారు మీదకెళ్ళాడు. తట్టలో కుంకుడాకు, మీదకి చింతకంపా కనపడ్డాయి. అతను పాంకోడిమీద కాలు ఎత్తాడు. తట్టని సత్తువపూరా "కిక్కు" తన్నేడు. తట్టా ఆకు ఎగిరిపోయాయి. గవిరి గడగడ లాడుతూ తట్ట తీసుకుంది. మళ్లా ఆకు నొర్లుకోపోయింది.

"లమ్డీకానా! ఇంకా ఎత్తుతున్నా?" అని ఉరిమాడు. గవిరి ఏరిన ఆ చెత్తకి ఎంత విలువ ఉన్నాదో అతనికి తెలియదు. చిన దేముడి సంసారానికి కూతురు గవిరి తెచ్చిపెట్టే ఆ చెత్తకి ఆర్థికంగా ఎంతయినా విలువ ఉన్నాది. ఆ చెత్త ఒక పూట పొయ్యిలోకి చాలు. ఆ సంగతి గవిరికి తెలును. ఎనిమిదేళ్ళదే అయినా ఆ బాధ్యతను గవిరి ఎరిగి ఉన్నాది. ఆ చెత్తకోసం దాని ప్రాణం తహతహ లాడిపోయింది.

"బాబుగోరూ! మరెప్పుడూ రాను" అని ప్రాధేయపడ్డాది. భుక్తగారు చుట్టూ చూశారు. ఆయనకి ఆచోకీ దొరికింది.

"ఏమిటీ! ఆ తుప్పవార దాచేవ్?" అనడిగాడు.

"నానేటీ దాచనేదు". అతను చేతికర్రతో తుప్పనెత్తాడు. దానివార తట్టెడు పేడ బైటపడ్డాది. దొంగతనం బైటపడిపోయింది. చేతికర్రతోటొక్కటి వెన్నుమీద వేసి "ఏమిటే అది?" అనడిగాడు.

"అమ్మోయ్! సచ్చిపోనాను. నానుకాదు బాబోయి!" అంటూ ఏడుపు మొదలెట్టింది.

"ఇంకెవరే లంజకానా?" అని మరొక్కటేశాడు. గవిరికి బోధపడలేదు. తనుకాదని చెప్పినా భుక్త తంతున్నాడు. అతనికి చెప్తే తెలియదేమో అని నివ్వెరపడ్డాది.

ఏడుపులోంచి పౌరుష మొచ్చింది. అది దొంగ కాదు. అంచేత ధైర్యమొచ్చింది. ఏడుపు మాని కళ్లెర్రజేసి, "నానుకాదు నా తట్టా సేతులూ సూదు" అన్నాది. దాని తట్టనీ చేతులనీ పేడమరకలు లేవు. కళ్ళంలో పాలేర్లే ఆ పని చేశారు. కాని భుక్తగారి బుద్ధి వికసించలేదు. కర్రతో మరొక్కటేశాడు. అది వక్కాణించి చెప్పినా కొట్టాడు.

"ఓర్నంజకొడుకో! నానుకాదు. ఓలమ్మో నానుకాదు. ఓర్నంజ కొడుకో!" అంటూ గవిరి తిట్లు ప్రారంభించి బూతుల్లోపడ్డాది. మహా మహా వాళ్లని పాతీసిన భుక్తగారిని గవిరిగుంట బూతులు తిట్టడం మొదలెట్టింది.

భుక్తగారు పాంకోడు తీసిపెట్టి విసిరాడు. దాని పిక్కమీద ఎమికెకి ఖట్టని తగిలింది. అది బోర్లాపడి మన్ను కరచుకొంది. పీక తెగ్గోసిన కోడి లాగ గిలగిల కొట్టుకొని చుట్టుకు పోయింది. దాంతోటిక భుక్తగారు సంతృప్తి పడి వెళ్లిపోయారు.

ఏడ్చి ఏడ్చి గవిరి కళ్లు తెరచింది. పొద్దు లేచిపోతోంది. బడిలో పిల్లలు ఎక్కాలు వల్లేవేస్తున్నారు.

"మూడేళ్లిరవైయ్యొకటీ!" అంటూ అంతా అరుస్తున్నారు. ఎక్కాలు పాడుతూ వల్లేవేస్తున్నారు.

గవిరి కళ్లాంలోకి చూసింది. ఎవరూ లేరు. కిందని విరజిమ్మివున్న కుంకుడాకుని కూడతీసింది. ఆకు వొదిలితే పొయ్యిలోకి సాధనంలేదు. తల్లీ తండ్రీ పొయ్యిమీదికి తేగలిగినా, తేలేకపోయినా గవిరి పొయ్యిలోకి తెచ్చితీరాలి.

"లమిడీ కొడకా! నీ సింతకంపలెవిడికీ అక్కరనేదు!" అని చింతకంపలు వొదిలేసింది. తట్ట నెత్తిన పెట్టుకొంది. కాలు మండిపోతోంది. అప్పుడు వొంగి దెబ్బని చూసుకొంది. ఎమికమీద పాంకోడు దెబ్బ పెద్ద బొప్పికట్టింది. బొప్పిమీద చిట్లి ఎర్రగా వుంది.

"ఓలమ్మో!" అంటూ మళ్లా ఉక్కిరిబిక్కిరిగా ఏడ్చుకుంటూ గోర్జలోకెళ్లింది. బడిపిల్లలింకా ఎక్కాలు పాడుతున్నారు.

"పదహారార్లు తొంభైయారు!" అని ఒకరు అరుస్తున్నారు.

"పదహారార్లు తొంభైయారు!" అని అంతా కలిసి పాడుతున్నారు.

❊

అరసం ప్రత్యేక సంచిక, 1943

దుమ్ములగొండె

చెడ్డ తొందరగా అడుగులు పడ్డాయి. సైనికుల్లాగ చకచక నడుస్తున్నాము. కంకర ఎక్కపెట్టిన రోడ్డుమీద 'మణ్యం' ఆకుజోళ్లు టపకా టపకా ఎగురుతున్నాయి. గిరిరావు బూట్లు ఇనపనాళ్ల నాదంతో మెట్లంగి రాళ్లని మోగిస్తున్నాయి. నాకు జోళ్లు లేవు. నా అరికాళ్లు చెప్పుజోళ్లకన్నా బలమైనవి. వేళ్లకి దెబ్బలు తగలకుండా నిపుణతతో అడుగులు వెయ్యడం నా కాళ్లకి తెలును. ఎక్కపెట్టిన రాళ్లని నాకాళ్లు కళ్లున్నట్టు తప్పించుకోగలవు. ఎంత కర్కశంగా మార్గమున్నా కాళ్లకి ఇబ్బందిలేదు. మిట్ట మధ్యాహ్నపు తారురోడ్డు దోసెలరేకులాగ వేడెక్కి నూనె కక్కుతూ ఆవిరులొస్తున్నా నా అరికాళ్లు భరిస్తాయి. నా నడక తొందరకి భూమి అదురుతున్నాది.

ముగ్గురం ఒక్కలాగ అడుగులు వేస్తూ ఒక్క బిగిని ఒకరికి ఒకరం తీసిపోకుండా నడుస్తున్నాం. బూట్లనాదం మద్దెలమోత లాగుంది. ఆకు జోళ్లు తాళం వేస్తున్నట్టున్నాయి. నా కాళ్లు నన్ని శ్రుతిలాగ పడుతున్నాయి. మూడూ ఒక్క శ్రుతిలో మిళితం అవుతున్నాయి.

మాట్లాడకుండా ఊపిరి బిగపెడుతూ నడుస్తున్నాము. అర్ధరాత్రి కోటలో గంట ఠంగుమని కొండల మధ్యకొచ్చి మారుమోగింది. వెన్నెల కర్పూరంలాగ వెలుగుతున్నాది. సాయంకాలం పెద్ద వర్షం కురవడాన్ని ఆకాశం నిర్మలంగా ఉన్నాది. మచ్చకొండా సూదికొండా దుప్పులకొండా అభ్యంగనం చేసుకుని నీటుగా లేడీల్లాగ మఠాలు వేసుక్కూమున్నాయి.

కుమిలి ఘాటీకి మా అర్ధరాత్రి షికారు. ఘాటీమీద నూతికి దిగే మెట్లమీద కూర్చుంటే కోనాడ సముద్రతీరందాకా కనపడే విశాల దృశ్యాన్ని వెన్నెట్లో చూస్తూ ముగ్గురం కుచ్చిటప్పాలతో జాగరం చేస్తాం. భయంకరమైన ఏకాంత సీమలో సుందర జాగరం. నల్లని నీడలో గోతిడు నీళ్ళు వెన్నెలపడి తెల్లగా చెంగల్వ పువ్వులాగ వికసించాయి. రోడ్డువార కాలువలో నక్షత్రాలు మా కన్నా వడిగా పరిగెడుతున్నాయి. గుండ్రపటి గోతినీట్లో నక్షత్రాలు గోతినిండా గడ్డి పువ్వుల్లాగ ఉన్నాయి. గెడ్డలో నీళ్లు పారడంలేదు. కాని వర్షానికి నాని గెడ్డలో ఇసుక జిమజిమలాడుతున్నాది. చెమ్మమీద చంద్రకాంతి పడి గెడ్డ జిగ్గని తెల్లని జరీ చీరలాగ మెరిసిపోయింది. చుట్టూ కొండలు వలయంగా చుట్టేశాయి. ఆ మధ్యనున్న భూస్థలం గంగాళం లాగున్నాది. కప్పలరుస్తున్నాయి. ఎన్ని కప్పలరుస్తున్నాయి! అర్బుదాలు నిర్బుదాలు అరుస్తున్నాయి. దగ్గరలోనున్న కప్ప టాంకు టాంకు మంటున్నాది. మా నడక తొందరకది వెనకపడిపోయింది. మా ముందు ఇంకొక కప్ప అరుస్తున్నాది. అన్ని కప్పలకన్నా దాని అరుపులో ఏదో ప్రత్యేకత గోచరమౌతున్నాది. కాని అది

మేళంతో కలసి ఎంతోసేపు పాడలేదు. అకస్మాత్తుగా ఊరుకుంది. కప్పల ఆర్కెస్ట్రా మొత్తంమీద ఉధృతంచేస్తున్న 'హార్మోనీ' వింటూ నడుస్తున్నాను. గంగాళంలాంటి భూవలయంలో కళపెళ ఎసరు ఉడుకుతున్నట్టు కప్పలు మోత పెడుతున్నాయి. దిగంతాల్లోంచి ఏదో తొణికిపోతున్నట్టు కప్పలమోత తిరుగబడు తున్నాది.

తుల్లిపడి వెనక్కు చూశాను. ఒళ్లంతా పులకరించింది. నా చెవులకి స్పష్టంగా గాజుల నిక్వాణం వినబడ్డాది. నర్తకి గుల్ల కడియాల్లో రాళ్ల గుణగుణ వినబడ్డాది. మా వెనకాతల ఏ అప్సరసలూ రావడంలేదు. ఆ భ్రమని కలిగించింది కీటకగానం. కీటకాలు కోటానుకోట్లు తంత్రీ స్వరాలు మీటుతున్నాయి. కప్పల మోత గంభీరంగా వినబడుతున్నాది. కీటకగానం వీణా నిక్వణాల్లాగ సహస్ర తంత్రులమీంచి వినబడుతున్నాది. మా నడకకి కప్పలమోత మిలటరీ బేండు. కీటకాలమోత నా హృదయంలో మధుర రసాన్ని ఊరిస్తూ అప్సరసల్ని కళ్లెదటికి తీసుకొస్తున్నాది. నా కెదురుగా దెయ్యాల్లాగ జుత్తును విరబోసుకొని ఈతలు నడుచుకొస్తున్నాయి. కాని నా ఎదుట రంగస్థలం విద్యుద్దీపాలతో ఉజ్వలిస్తున్నాది. దాంట్లో నటీ నటులు మధురరస ప్రధానమైన భారత నాటిక నటిస్తున్నారు. మువ్వలు మోత పెడుతున్నాయి. వెండిమువ్వలు, గాజులు గలగల్లాడుతున్నాయి. గోటులూ, దిల్‌రుబాలూ, సారంగులూ, చితారులూ సహస్ర తంత్రులతో మోగుతున్నాయి. గట్టిగా పాడ్డానికి ప్రారంభించాను.

"గోపీ పీనపయోధర..."

"షటప్!" అన్నాడు గిరిరావు.

"నేను పాడుకుంటే నీకేం?" అన్నాను.

"ఘాటీ ఎక్కేదాకా నోరు కదపడానికి వీలులేదనుకొన్నాము" అన్నాడు మణ్యం.

నిజమే.

"మీతో సరిగ్గా అడుగు వెయ్యలేకపోతే కదా!" అన్నాను.

"నో!" అన్నాడు గిరిరావు

కొండలలోంచి ధీరసమీరం శీతలంగా వీచడం ఆరంభించింది. చెట్లలోంచి ముత్యాలు రాలుతున్నాయి. వనమాలిని ఉద్దేశించి హాయిగా పాడుకోనిచ్చారు కాదు.

నా గొంతుకలో పాట ఆగిపోయింది. నా నుదురుమీంచి, ముక్కుమీదికి జారి ఘర్మసలిలం ఉప్పగా పడ్డాది. తడిసిపోయిన చొక్కాలోంచి సమీరం వెళ్లి నా త్వగింద్రియానికి చల్లగా చక్కిలిగింత పెడుతున్నాది. నా కళ్లెదుట రంగస్థలం, నాట్యమండలి మాయమై పోయాయి.

మాకు దగ్గరలోనే నిలబడి నక్క చూస్తున్నాది. నక్క నిలబడి నిర్భయంగా చూస్తుంది. ప్రమాదం దగ్గర కొచ్చిందంటేనే తోక ముడిచి పరిగెడుతుంది. లేకపోతే మనల్ని నిబ్బరంగా నిలబడి మోరెత్తి చూస్తూ "నువ్వేమి చేస్తావు" అని ప్రశ్నిస్తుంది. నక్కని చూస్తే నాకు కుమిలి ఘాటీ కథ వొకటి జ్ఞాపకమొచ్చింది. ఆ కథ గిరిరావుకి తెలుసు.

"మణ్యం, అదుగో దుమ్ములగొండె!" అన్నాను.

"నీ తలకాయ!" అన్నాడు మణ్యం.

"అదిగో చూడు!" అని చూపించాను.

"నక్క"! అన్నాడు గిరిరావు.

"ఇంకోటి కూడా వెనకాతల ఉన్నాది!" అన్నాడు మణ్యం.

నక్క దంపతులు వ్యాహ్యాళి కొచ్చారు.

"దాసు వీటిని చూచేకాబోలు పారుకొన్నాడు" అన్నాను.

"అంతే అయి ఉంటుంది" అన్నాడు గిరిరావు.

"ఏ దాసు?" అనడిగాడు మణ్యం.

"దుక్కణ్ణి ఎరగవూ? కాళిదాసు" అన్నాను.

"వాడా! ఎందుకు పారుకున్నాడు?" అనడిగాడు మణ్యం.

"ఇక్కడే సైకిలుమీద కొండవొద్దు దాకా షైరు వెళ్లేట్ట. సాయంకాలం దుమ్ములగొండె కనబడ్డాదట. అక్కడనుంచి సైకిలు వెనక్కి తిప్పి యింటికి వచ్చి చతికిల్లాపడ్డాడు. వాడికి ప్రాణాలు లేవు" అన్నాను.

"పిరికివాడన్నమాట!" అన్నాడు మణ్యం.

"పట్టపగలు దెయ్యమంటే జడుసుకుంటాడు!" అన్నాడు గిరిరావు.

"రామరామ!" అన్నాడు మణ్యం.

"అదేమన్న మాటలే. ఇక్కడ చిరతపులులు లేకపోయినా పెద్ద నక్క, దుమ్ములగొండె ఉన్నమాట వాస్తవం" అన్నాను.

"లేవురా" అన్నాడు గిరిరావు.

"మంచివాడివి. దాసన్నపేట గొల్లవాళ్లనడుగు. దుమ్ములగొండె పెయ్యని ఎత్తుకు పోయిందో లేదో! ఎప్పుడూ ఈ కొండని ఉండదుకాని వెలగాడ కొండమీంచి అప్పుడప్పుడు వొస్తూ ఉంటుంది" అన్నాను.

"నలుగురుంటే ఏం చేస్తుందిలే!" అన్నాడు గిరిరావు. మణ్యం నవ్వేడు. గట్టిగా హేళనగా నవ్వేడు. మణ్యంది విజయనగరం కాదు. మా కొండలని ఏ జంతువూ లేదనే వాడి నిబ్బరం. కాని దుమ్ములగొండె ఉందనే, నేనెప్పుడూ చూడకపోయినా అంతా అంటారు.

నాకు బితుకు పట్టుకుంది. బండరాళ్ళన్నీ దుమ్ములగొండెల్లాగ కనబడ్డం మొదలెట్టేయి. మా నడకజోరు తగ్గలేదు. రాళ్ళన్నీ జంతువుల్లాగ కదుల్తున్నాయి. ఒకరాయిని చూచి జంతువనే నిర్ధారణ చేసుకున్నాను. దాని నడ్డీ మూతీ గాడిదాకారంలోనే కనిపించాయి. తేరిపారచూస్తే మహా వికృతమైన దుమ్ములగొండె స్వరూపం కనబడ్డాది. ఒక్కడుగు ఆగి చూస్తే రెండు బండ రాళ్ళు కనబడ్డాయి. కాని రాళ్లన్నీ దుమ్ములగొండెల్లాగ కనబడుతున్నాయి.

నా పిరికితనానికి నాకే నవ్వొచ్చింది. ఇదివరకెన్నిసార్లు ఘాటీకి వెన్నెల రాత్రుళ్లలో వెళ్లలేదు? చిన్నప్పట్నుంచీ అవకతవక స్థలానికి స్నేహితులతో షైర్లుపోయిన నక్తంచరుడ్నే!

అదేదో వృక్షం పేరు మరచిపోయాను, కనబడ్డాది. బగ్గిలు బగ్గిలుగా మెరుస్తూ తెల్లని బెరడుతో ఆ మానుకొమ్మలు వెన్నెట్లోకి భయంకరంగా లేచివున్నాయి. ఆ వృక్షంకింద నలమహారాజుకి శనిదేవత ఆవహించిందిట. ఆ కారణంచేత ఆ చెట్టుకిందకి మనం వెళ్లకూడదని నిషేధం ఉన్నాది. పిచ్చి నిషేధం!

మామిడితోట్లో కెళ్లాము. చీకటిగా ఉన్నాది. రోడ్డునిండా మామిడి చెట్లు ఆవరించి ఉన్నాయి. అంచేత రోడ్డంతా తివాసీలు పరచినట్లు నీడలున్నాయి. నీడల అందాన్ని చూచి నేను ముగ్ధుడనౌతాను. మా వీధిమెట్ల మీద కూచుని వాకిట్లో పెద్దపువ్వులాగపడ్డ కొబ్బరిచెట్టు నీడనీ, గోడమీద రంగవల్లికల్లాగ ఏర్పాటు అయిన తుప్పల నీడలనీ చూసి ఆనందిస్తూ రాత్రి రెండు మూడు గంటలదాకా సిగరెట్లు కాలుస్తూ కూర్చున్న రోజులున్నాయి. కానీ మామిడి తోటలో రోడ్డుమీద నీడలన్నీ మచ్చలమెకాల్లాగున్నాయి. గుండెకొట్టుకుంది. కింకిణీస్వనం లంకిణీదేవి గుర్రులాగుంది. కప్పల ఆర్కెస్ట్రా కొండదేవత బలికి నరులని తీసుకుపోతున్న కిరాతుల డోలు వాయిద్యమై పోయింది.

నా మీద దెయ్యంలాగ భయం ఆవహిస్తూంది. మేకపోతు గాంభీర్యంతో ముందుకు అడుగులు వేస్తున్నాను. కాని గుండె జారిపోతున్నాది. శరీరంలో రక్తం, మాంసం, ఎముకలూ మాయమై పోతున్నాయి. శరీరం గుల్లతేరిపోయి ఆ ఖాళీనిండా భయం నిండిపోతున్నాది.

మణ్యంకి పిసరు భయం కలగలేదు. చెక్కుచెదరకుండా అడుగులు వేస్తున్నాడు. నా అడుగులు తడబడుతున్నాయి. శనివృక్షం కిందికి వచ్చాము. తెల్లని పొలుసులు పేలిన బెరడుతో దాని కొమ్మలు ఆకాశంలో తలలెత్తి కనబడ్డాయి.

ఘాటీనందు చీకటిగా కబంధుడి అంగుడులాగుంది. ఘాటీమీదకి తోవతీసుకు పోతున్నాది. సూదికొండ కబంధుడి అంగుట్లో కొండనాలికలాగుంది. లోపలికి వెళుతున్నకొద్దీ కబంధుడు బారలుచాచి నోట్లోకి మమ్మల్ని లాక్కుపోతున్నట్లున్నాది.

"ఒరే గిరిరావ్, ఇప్పుడు ఈ గోతుల్లో నీళ్లు తాగడానికి దుమ్ములగొండె నిజంగా వొస్తే మనమేమి చెయ్యగలం?" అని ప్రశ్నించాను. గిరిరావు స్థలజ్ఞుడు. ఆ ప్రశ్నతో అతనికీ నా భయం అంటువ్యాధిలాగ తగులుకొన్నాది.

"ఏమిటి చేస్తాం?" అని తిరిగి ప్రశ్నించాడు గిరిరావు.

"మన దగ్గర కర్రయినా లేదుకదా, మీదికొస్తే ఏమి చెయ్యగలం?" అని తిరిగి ప్రశ్నించాను.

"కలియబడదాం" అన్నాడు మణ్యం. అతనికి నవ్వుతాలుగా ఉన్నాది. నాకు నవనాళ్లూ తోడుకుపోతున్నాయి.

"హాస్యం కాదురోయ్. ఈ స్థలాలు మంచివికావు. ఏమి చెయ్యగలం?" అని గట్టిగా ప్రశ్నించాను.

"గట్టిగా కేకేస్తే హడలెత్తి పారిపోతుంది. దాన్ని చూస్తే మనకెంత భయమో అదీ మనల్ని చూచి అంతా భయపడుతుంది" అన్నాడు మణ్యం. వాడికింకా నవ్వుతాలుగా ఉన్నాది. గిరిరావు ఆలోచనలో పడ్డాడు. రాళ్ల రోడ్డు ఘాటీమీదకి లేస్తున్నాది. శరీరాన్ని ఎత్తుకి మోసుకొని వెళ్లడానికి కాళ్లు లొటలొట లాడుతున్నాయి. గిరిరావు అడుగువెయ్యటం మానేశాడు. నేనూ నిలబడిపోయాను.

"ఘాటీకి వెళ్లడం ప్రమాదమే" అన్నాను.

"ప్రమాదమే" అన్నాడు గిరిరావు.

నన్ను భయం పూర్తిగా వశం చేసుకొంది. శరీరాన్నంతా ఆవహించింది. భయం శరీరాన్నంతా ఆవహించడం అందరి అనుభవంలోనూ ఉండదు. సాధారణంగా భయం గుండెల్లో ఒక భాగాన్ని మాత్రమే పట్టుకొంటుంది. ఇంకో భాగం ధైర్యాన్ని ఉపాసనచేసి భయపిశాచిని గెంటేస్తుంది. పిచికని పట్టుకొని పావుగంట చేతుల్లో ఉంచి చూడండి అది చచ్చి ఊరుకుంటుంది. దాని గుండెలు భయంచేత ఆగిపోతాయి. భయం అంటే అదీ. అదీ నన్ను ఆవహించింది!

"వెనక్కి పోదాం" అన్నాను. ఈ భయం అంటువ్యాధి. ఈ వ్యాధి క్రిమిసంపర్కం లేకుండానే పక్కవాడికి కూడా వ్యాపిస్తుంది.

"పోదాం" అన్నాడు గిరిరావు.

కాళ్లు ముందుకు పడలేదు. కాళ్లకి శిలలు కట్టినట్టు నిలబడ్డచోట నిలబడిపోయాయి. శరీరం ఏనుగంత బరువెక్కిపోయింది. శరీరం నిండా నిండి వేలకొద్దీ టన్నుల బరువుతో భయం ఆవహించి ఉన్నాది.

"నా కాలు మరి ముందుకు పడ్డంలేదు" అన్నాను.

"నాదీనీ" అన్నాడు గిరిరావు.

"నిజంగా?" అన్నాడు మణ్యం.

"నిజంరా బాబూ, పదా" అన్నాను.

మణ్యాన్ని కూడా భయం పట్టుకుంది. వాడికి భయం మామ్మూలుగా పట్టుకోలేదు. "అమ్మో" అని పెద్ద కేకవేసి వెనక్కి తిరిగాడు. తారకమంటుకొంది.

"ఎందుకేనా మంచిది. రాళ్లు పట్టుకోండి" అన్నాడు గిరిరావు. రెండు చేతులా ముగ్గురం రాళ్లేరి పట్టుకొన్నాం.

భయం గెంటీడం మొదలెట్టింది. కాళ్లు ఎంత తొందరగా పడుతున్నాయో తెలియదు. ఘాటీమీంచి దిగడానికేముంది? అంతా దిగుడు. ఐదు నిమిషాలైనా అయిందో లేదో సీతాఫలంతోటా, దాని మధ్య నుండి పోయే కొండవాగులో ఇసకా చేరుకొన్నాం. తోటలో రెల్లివాళ్ల పాకా, దూరంగా కళ్లాలు కనబడ్డాయి. మనుషుల అలికిడి, పశువుల సవ్వడి అయింది.

"ఛ ఛ"! అన్నాను. నామీద నాకు అసహ్యం వేసింది. అంత పిరికితనం పట్టుకుందేం? లజ్జ వేసింది.

బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. కాని ధీరసమీరం ఇంకా వీస్తున్నాది. చంక తిమ్మిరెక్కింది. అప్పుడు నాకు జ్ఞాపకానికొచ్చింది. చంకలో అణిచిపెట్టి టీ ఫ్లాస్కు ఉన్నాది.

"టీ తాగుదాం" అన్నాను.

"చల్లబడనీ" అన్నాడు గిరిరావు.

నల్లచెరువు మెట్లలో బండరాయి ఎక్కి చతికిల్లాపడ్డాం. టీ తాగి రాత్రి అక్కడే పడుకొన్నాం. తెల్లవారుఝామున నక్కల అరుపులతో లేచాము. అరుణోదయమౌతున్నాది. కాని కుమిలి కొండలు అరుణోదయాన్ని అడ్డేస్తున్నాయి.

ఇంకా ధీరసమీరం వీస్తున్నాది. కాని యమునాతీరం, వనమాలీ, చంచల కరద్వయం ఆనాడు మరి కనబడలేదు. కుమిలీఘాటీ మీది ఏకాంతంలో సోపానాలు, వెన్నెట్లో మనోజ్ఞంగా కోనాడ సముద్ర తీరందాకా కనబడే విశాల దృశ్యం, సర్పంలాగ మెలికలు తిరిగి మెరిసిపోతూ కనబడే చంపావతీనదీ చూసి అనుభవానికి తెచ్చుకునే అవకాశం ఆ రాత్రి లేకపోయింది. కాని ఆనాటి దుమ్ములగొండె అనుభవం జీవితంలో ఘనమైన భ్రాంతిమదలంకారము.

❁

భారతి, జులై 1943

బొందు మల్లెలు

ఊళ్లో పువ్వులకి మంచి ధర ఉన్నాది. ఊరికేవుంది మా వెనక పెరడు. మంచి లాభం వస్తుందని మల్లె పెరడు వెయ్యడానికి నిశ్చయించాను.

మల్లెలమ్మి డబ్బు చెయ్యడంలో కొంత ప్రపంచాన్ని దోపిడీ చెయ్యడముంది. అయినా ఆ దోపిడీ న్యాయంగా కనబడ్డాది. ధనికులే, అనగా ప్రజలని దోపిడీ చేసి ఐశ్వర్యవంతులయిన వాళ్లే నా మల్లెలు కొంటారు. అంచేత నేను దోపిడీ చేస్తున్న వాళ్లని మల్లెలతో దోపిడీ చేస్తాను.

పెరట్లో గోతులు తవ్వడానికి ఒక కూలివాడి అవసరం పడ్డాది. నాలుగు రోడ్ల మధ్య కెళితే పొట్టవెన్నుకంటుకుపోయిన ముసలివాడు యెదురుగా వచ్చాడు.

"పనుందా బాబూ?" అనడిగేడు.

"నువ్వు చెయ్యలేవు" అన్నాను. రెండేసి మూళ్లు లోతుని గోతులు గునపంతో తవ్వాలి. మన్నూ మశానం వాటిలో కెత్తి బొందుమల్లె కుదపలు పాతాలి.

"ఏం పని బాబూ?" అన్నాడు.

"గునపంతో తవ్వాలి."

"తవ్వేస్తాను బాబూ" అన్నాడు. తాత తరమా? ముష్కరమైన వాడైతే అయిదు రోజులు చేస్తాడు. తాత పదిరోజులకైనా చెయ్యలేడు. అతణ్ణి తీసికెళ్లడం శుద్ధ దండుగ.

"పోనిస్తూ" అన్నాను.

"పని యేటో సూడనీయండి. మొత్తాన్ని సేసుకుంటాను. తమకి తోసింది ఇయ్యండి" అన్నాడు. అతని జాలికరమైన మొహంలోకి చూడగానే, యిష్టం లేకపోయినా కాదనలేక పోయాను.

"సరే" అన్నాను. వెంటపడ్డాడు. పని చూసుకొన్నాడు. పాపం చాలా తక్కువే అడిగాడు. బలమైనవాడికి ఐదురోజుల పని. అంతకు ఎక్కువే ఇవ్వొచ్చు.

బాగా తగ్గించి అడిగాను.

"కష్టం చూడండి బాబయ్యా" అన్నాడు.

"నాతో ఇన్ని బేరాలు లేవు".

"సరే తమసిత్తం. మద్దేన్నంవేలా తమరు ఇడిచిపెట్టేది, ఇంత గెంజి పొయ్యండి" అని ప్రాధేయపడ్డాడు.

"పోస్తానులే" అన్నాది నా పెళ్లాం. చవకగా కుదిరేదని గ్రహించింది కాబట్టే ఆ అభిమానం! ఇంట్లో రోజూ సేరు గంజి వారుతుంది. వీధి కాలువలోకి వొదిలిపెడుతున్నదే. తాతకి పోసినందువల్ల నష్టం లేదు. సారవంతమైన గంజిని కాలువపాలు చేసి పిప్పిని "అన్నం" అనుకొని నాగరికులం తింటాం.

తాత పదకొండు రోజులకిగాని పని పూర్తి చెయ్యలేకపోయాడు. తాతకి నోరూ వావీలేదు. ఎలాగచెపితే అలాగ తవ్వేడు. అనుకొన్న ప్రకారం డబ్బు యిచ్చేను. ఎక్కువ అడుగుతాడను కున్నాను. గునుస్తాడనుకున్నాను. అల్లరి చేస్తాడనుకున్నాను. ఏమీ లేదు. నోరు కదపకుండా పట్టుకుపోయాడు. కాని మర్నాడే "పని సెప్పరా?" అంటూ వొచ్చాడు.

"మొక్కలకు నీళ్లు పోస్తావా?" అనడిగాను.

"పోస్తాను" అన్నాడు. నూతులో నీళ్లు తోడాలి. మోసుకెళ్లిపోయాలి.

"నెలకేమివ్వమన్నావు?"

"తమ సిత్తం."

నెల కింత అని చెప్పేను.

"సిత్తం" అని ఇంకేదో చెప్పబోయాడు.

"ఏంటి తాతా?"

"... ఏటడుగుతాను?.... తమ రొగ్గేసినది" అని నసికినసికి, "గెంజి నీళ్లు" అన్నాడు.

తాత కుదురుకున్నాడు. మాకు తేరగా దొరికేడు. తాతకి నోరూ వావీ లేదు. ఏం చెప్పినా చేసేవాడు. చీకటితోటొచ్చేవాడు. చీకటి పడుతుంటే వెళ్లేవాడు. పగలల్లా ఏదో పని చేస్తూనే వుండేవాడు. మధ్యాహ్నం గంజి పోసేవాళ్లం.

తాత గంజిలోకి పిల్లలు దిగవిడిచిన అన్నం కెరళ్లూ కూడా వెళ్లేవి. తాతనంజు కోడానికి విస్తళ్లలో దిగబెట్టిన కూరలు, పాచిపట్టిన పచ్చళ్లు వెళ్లేవి.

నెల జీతం అందుకొన్న మరునాడు తాత మొహం పరమానందంగా ఉంది.

"నా దినం తీరుతాది బాబూ" అని నాతో చెప్పేడు.

"ఏంటి విశేషం తాతా?"

"తమరిచ్చిన జీతం సేతిలెట్టాను. రేత్రి నా కూతురు పట్టెడన్నం పెట్టింది."

"రోజూ పెట్టడం లేదూ?"

"నేదు బాబూ, తమ పాదాలసాచ్చి. తమరింట్లో గెంజి మెతుకులు తప్ప కడుపు కింకేటి నేదు."

నా వొళ్లు కంపించింది.

"తాతా! నీ కూతురు దగ్గరా ఉన్నావు?"

"సిత్తం".

"కొడుకుల్లేరూ?"

"కొడుకుండేవాడు, సచ్చిపోనాడు. నా సద్దానమైపోనాను. కోడలు ఏరే కాపురం చూసుకుంది."

"కూతురు తిండి పెట్టింది కాదేం?"

"కూడెట్టిందికాదు, డబ్బు సెద్దపాపిస్టి. తల్లీ పిల్లల ఆశలు నంపుతాది. రేత్రి జీతమంతా సేతిలెట్టినాను. పట్టెడన్నం పెట్టింది. ఇంక దినం తీరుతాది" అన్నాడు.

ఆ రోజు నుంచి తాత మా యింట్లో మనిషి అయిపోయాడు. తాత మీద ఇంటిల్లిపాదికి జాలి కలిగింది. ఇంత అన్నం కూడా వేసి ఆదరిస్తున్నారు.

మల్లెలు మొగ్గలు తొడిగేయి. మొగ్గలు అమ్మడం ఆరంభించేము. మధ్యాహ్నం బుట్టలో పట్టుకెల్లి తాతే అమ్ముకొచ్చేవాడు. సోలడు మొగ్గలు యింతా అని. బుట్టెడు మొగ్గలయేవి.

మల్లెలు రెండు విడతలు పూశాయి. తోటవల్ల మూడు వందల రూపాయలు లాభం వచ్చింది. దాగరంత దొడ్డికి తాత జీతం పోను ఆ లాభం వచ్చింది. నేను చవగ్గా మొగ్గల మ్మేశాను. బొండు మల్లెలు సోల అణా ఏం? బేడన్నా కొందురు. అణాన్నరైనా చేయవలసింది. తెలిసింది కాదు.

వృద్ధి అయిన తరువాత మల్లెతోట ఎంతో సరదా వేసింది. నా మల్లెలు ఎంతో మంది యువతులు ధరించేరు, ఆనందించేరు. నేను రసజీవిని. అంచేత యువతుల వాల్జడలో బొండు మల్లెలు వికసించటం నా కెంతో మక్కువ.

తొలకరికి మరి తాత పనిలోకి రాలేదు. తాత భోగట్టా చెప్పేవారెవరూ లేకపోయారు. అన్నాళ్లు పని చేసేడు కాని, అతని ఇల్లెక్కడో మేము కనుక్కోలేదు. తాత తాత అండమే తప్ప మాయింట్లో యెవరికీ అతని పేరు తెలియదు. అంతచిత్రంగా ఉంటాయి మన సంబంధ బాంధవ్యాలు.

చాలాకాలమైన తరువాత, వంకాయలమ్మే మనిషి "మీ దొడ్లో మల్లె మొక్కలు బాగున్నాయా?" అని అడిగింది. మల్లె మొక్కలున్నట్లు నీకెలాగ తెలుసనడిగేను.

"మీ దొడ్లో తాత పని చేసేవోడుకాదా?"

"తాత నెరుగుదువా?"

"ఆళ్ళది మాయిాదే".

"తాత బాగున్నాడా?"

"సచ్చిపోనాడు. మీకు తెల్దా?"

"చచ్చిపోయాడా! ఎప్పుడు?"

"అబ్బో శాన్నాళ్లయింది. ఇంకా బతుకును బాబూ! జబ్బు చేసి నిమ్మళించింది. తరవాత కూతురు నూసిందికాదు. డాక్టేరుగారు పళ్లూ జావలు ఎట్టమన్నారు. నాకాడెక్కడదని వొగ్గేసింది. సచ్చిపోనాడు. ఆ కూతురు సెద్ద ఘటుకురాలు" అన్నాది.

కూతురిని అనవలసిన పనిలేదు. దానికోటి వుందో లేదో?

ఎంత తండ్రి అయినా పెట్టడాని కుండాలా? లేమి ఎంతటి వాళ్లలోనైనా మాన వత్వాన్ని చంపి అమానుషత్వాన్ని పెంచుతుంది. వృద్ధులకి పెన్షనులైనా ప్రభుత్వం ఇస్తే బావుణ్ణు. జీవితభీమా ఉన్నా బావుణ్ణు.

తాత వృత్తాంతం ఆలోచించినకొద్దీ నేను ద్రోహం చేసినట్టు బాధపడ్డాను. బొండు మల్లెలు వేసింది, పెంచింది, డబ్బుచేసింది తాతే! వచ్చిన ఫలితం నేను చల్లగా జేబులో వేసుకొన్నాను. ఆ డబ్బంతా తాత ఆర్జనకాదూ? ఆ డబ్బే తాతదైతే ఎంత సుఖపడును! అవసానకాలంలో జరక్కపోనా? దోపిడి చేస్తున్న వాళ్లకి బొండుమల్లెలమ్మి దోపిడీ చేస్తున్నాననుకొన్నాను కాని, తాతని పెద్ద దోపిడీ నేనే చేసేను. నెలకి నాలుగు రాళ్లు జీతం ఇచ్చి రోజుకిన్ని గంజినీళ్లు పోసి సాగనంపాను. దొడ్డి నాది. ఫలితం కష్టపడ్డ వాడికి కాకుండా పోయింది.

❋

ప్రజాశక్తి, 15-9-1943

"ఎందుకు పారేస్తాను నాన్నా?"

చెల్లిని వొళ్లో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెపుతున్నాడు. వాళ్ల నాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బులిచ్చేడు.

కృష్ణుడు వీధి ముఖం చూడకుండా, మొగుడు చచ్చిన విధవలాగ ఇంట్లో దూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలుదాటి చుట్టల దుకాణానికెళ్లాలి. మేష్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడికి రోడ్డెక్కటమే నామోషిగా ఉంది. బడిపక్క నుంచి ఎలాగ వెళ్లడమని గింజుకుంటూ బయలుదేరేడు.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నాది. బడిపెట్టేవేళ. వీధి చివర నుంచే బడిగోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడిపక్క నుంచి వెళ్ళక తప్పదు. రాకతప్పదు.

బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లల గందరగోళంతో కలకల్లాడుతున్నాది. వరండాలు, గదులు, చుట్టూరోడ్లూ, విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగా ఉంది. రోడ్డువారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

"కృష్ణా!" అని స్కూలు వరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగి చూడక తప్పిందికాదు. నరిసింహం పరిగెట్టుకొచ్చి వాడి భుజం మీద చెయ్యేసి–

"ఏంరా, నువ్వు బళ్లోకి రావడం లేదు?" అనడిగేడు.

"సోమవారం చేరుతాను" అని కృష్ణుడు చెప్పేడు.

"పుస్తకాలు కొన్నావా?"

"ఇంకా లేదు".

"వేగిరం కొనుక్కో మళ్లా అయిపోతాయి. ఎక్సరుసైజు పుస్తకాలు షాపుల్లో కొనకేం. స్టోర్సులో చవగ్గావున్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగిపోయాయిరా!"

నరిసింహం డబుల్ కప్పు చొక్కా, హనావాపేంటూ, జోళ్లూ తొడుక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడికి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు. ఉన్నాయంటే ఉన్నాయి. ఒకనిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా భుజం చిరిగి జారిపోతే, వాళ్లమ్మ ఎత్తికుట్టింది. చెయ్యి బుట్టలాగా లేచిపోయింది. రేవుకో జత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్టఎక్కువ పడుతుంది. బట్టఎక్కువైతే డబ్బు ఎక్కువవుతుందని వాడికి తెలుసు. మరి రెండు జతలు కుట్టించమని బతిమాలుకున్నాడు. కాళ్లావేళ్లాపడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేకపోయింది.

నరిసింహం చంకలో కృష్ణుడికి కొత్త పుస్తకం కనబడ్డాది.

"ఏం పుస్తకంరా అదీ?" అనడిగాడు.

"ఇంగ్లీషు పుస్తకం. నేనన్ని పుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీ పుస్తకమే కొనలేదు. జాగ్రఫీ పుస్తకాలింకా స్టోర్సువాళ్ళకి రాలేదు. చూడు పుస్తకం" అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒక విధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకంలోకి మొహంపెట్టి వాసన చూశాడు.

"కొత్తపుస్తకం వాసన బాగుంటుందికదరా?" అన్నాడు నరిసింహం

"కమ్మగా ఉంటుంది. నా కెంతో యిష్టం" అన్నాడు కృష్ణుడు.

"నీ కింగ్లీషులో ఫస్టుమార్కురాలేదు. కదరా".

"నాలుగు మార్కుల్లో పోయింది."

"ఎవరి కొచ్చిందిరా?"

"శకుంతల కొట్టేసింది."

"నిజమే! నేన్నమ్మలేదు. దాని కెన్నొచ్చాయి?"

"నా కరవై నాలుగు, దాని కరవై ఎనిమిది."

"ఆడపిల్లని మేష్టరు వేసీనుంటాడు."

"నీ మొహం! అది తెలివైంది."

"తస్సాచెక్కా! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!"

కృష్ణుడు మార్కుల గొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్లు గుడ్డలని చూసి అంతా దూరంగా ఉండే వాళ్లే. వాడికి బడిపక్కని నిలబడడం, బడికెళుతున్న నరిసింహాన్ని చూడడం చాలా కష్టంగా ఉంది. ఎంచేతంటే కృష్ణుడు బడికెళ్లి చదువుకొనే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్లనాన్న ఈ యేడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

"ఎక్కడేనా చదువు మాన్పించుతారండి? ఋణమో పణమో చేసి ముక్క చెప్పించకపోతే కుఱ్ఱాడెందుకేనా పనికొస్తాడా? చదువుకునే ఈడులో బడి మానిపించి, ఇంట్లో కూచోబెడితే తరవాత గాడిదలని కాయడానికేనా పనికిరాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి" అని వాళ్లమ్మ శతపోరి చెప్పుకొంస్తున్నాది.

"బళ్లో వెయ్యగానే సంబరమా? వాడు చదివేది ఫోర్తుఫారమ్. జీతమెక్కువ. నెల నెలా ఎంత కట్టాలో తెలుసా? తూగ్గలనా? ప్రవేశ పెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది ఏభై రూపాయలు. దస్తాకాగితాలు రూపాయి, అర్ధణా పెనసలు అరణాలు! ఎక్కణ్ణుంచి తేవడం? మొహాన్ని వాడికి లేందే! వాడి ప్రారబ్ధం. మన ప్రారబ్ధం! వారంవారం ఎక్కడలేని డబ్బూ బియ్యానికి ముడుపు చెల్లించడానికే తలప్రాణం తోక్కొస్తున్నాది. మాటలా?" అని వాళ్ల నాన్న చెప్పుకొంస్తున్నాడు.

తల్లి మాటే నెగ్గుతుందో, తండ్రిమాటే నెగ్గుతుందో ఇంకా తేలలేదు. కృష్ణుడికి మాత్రం సందిగ్ధం లేదు. వాడు తలిదండ్రులని బాగా ఎరుగును. తల్లి ప్రతి విషయంలోనూ బడబడ లాడడమే కాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూ ఉంటుంది. అంచేత చదువుకి స్వస్తి చెప్పడమే ఖాయమని నిర్ధారణ చేసుకుని నామర్దాతో కృష్ణుడు కుళ్లిపోతున్నాడు.

కృష్ణుడికి కొత్త ఇంగ్లీషు పుస్తకం పేజీలు తిరగేసిన కొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్ల మీద ఈర్ష్యా, తనకి చదువు లేకుండా పోయిందన్న దుఃఖము – రెండూ రెండు లేడిక పాములై అతని బుర్రని కరకర లాడిస్తున్నాయి.

"కృష్ణా, వేగం చేరరా! డివిజన్లు పెట్టేశారు. నేను 'జే' డివిజన్‌లో పడ్డాను. మన బేచివాళ్లంతా 'జే' డివిజన్‌లోనే పడ్డారు" అన్నాడు నరిసింహం.

"అమ్మ బాబో! 'జే' డివిజనుదాకా పిల్లలున్నారా!" అని ఆశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

"'జే'తో ఐపోలేదు. 'కే' డివిజను కూడా ఉన్నాది."

ఏ, బి, సి, డి, అని లెక్కబెట్టి "పదకొండు డివిజన్లే!" అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందలమంది విద్యార్థులున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకాన్నిచ్చేసి "నేను చుట్టలకెళ్ళాలి. పోతా" నన్నాడు.

"ఈ బొమ్మ చూశావట్రా?" అని నరిసింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్నచేలు కోస్తున్నారు. జొన్న రేకులని కూడదీసి కట్టుకొన్న పిట్టగూడు గుడ్లతోటే జారిపోతున్నాది. చేల మీద రెండు పిట్టలు ముక్కులు విప్పి ఎగురుతున్నాయి. కోతల వాళ్లు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అదీ త్రివర్ణ చిత్రం!

హైస్కూలు మొదటిబెల్లు ఖంగుఖంగుమంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్డు, వరండాలు, గదులూ విద్యార్థులతో, విద్యార్థినులతో, ఉపాధ్యాయులతో కలకల్లాడుతున్నాయి.

పుస్తకాలు పట్టుకుని సరస్వతీదేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్నపిల్ల. పదకొండేళ్లది. నూది ముక్కు, నూది గెడ్డాం, ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంటుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్లు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

"కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!" అని వొస్తూనే ఉడికించింది.

"ఒక్క ఇంగ్లీషులోనే కదా! నాకు మూడింట్లో ఫస్టుమార్కులొచ్చాయి, లెఖ్ఖల్లో నూటికి నూరు!" అన్నాడు కృష్ణుడు.

"ఇంగ్లీషు ముఖ్యమైందండీ!" అన్నాది శకుంతల.

"లెఖ్ఖలంతకన్నానండి. ఆ మాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టుమార్కెవరిదండి?"

"ఇంగ్లీషే ముఖ్యమండి. ఎవరి నడుగుతావో అడుగు!"

"తెనుగేనండి. బియ్యేవాళ్లక్కూడా ఇంగ్లీషులో మానేసి లెక్కలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి!"

"నువ్వు మహా పేపరు చదివి ఏడిశావు!"

"నే నాంధ్రపత్రిక రోజూ చదువుతాను. మాయింటి దగ్గర వాళ్లకొస్తుంది."

రెండోబెల్లు ఖంగుఖంగుమని ప్రారంభమైంది.

నరిసింహానికి శకుంతల మొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూ సంధ్యారాని దద్దమ్మ. వాళ్లతో పాటు సంభాషించడానికి తాహతు లేక తల వాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హనావా పంట్లాము ధగధగలాడుతున్నా, కృష్ణుడి కుళ్లు నిక్కరు కనబడుతున్నా వాడికి తక్కువ తనం పట్టుకుంది. రెండో బెల్లు కాగానే చల్లగా బడిలోకి జారిపోయాడు.

"బెల్లయింది. బళ్లోకిరా!" అన్నాది శకుంతల.

"నేను సోమవారం నుంచి వస్తాను" అన్నాడు.

"ఫోర్తుఫారమ్‌లో నీ పని చెపతాను. ఒక్క ఫస్టుమార్కు రానివ్వను."

"ఇహనన్ని ఫస్టుమార్కులూ నీవేలే!"

"ఏం?"

"ఏమీలేదు."

"నువ్వు మా ఇంటికి రావడం మానేశావేంరా? మా అమ్మా, నాన్నా కృష్ణుడు రాలేదేమా అని రోజూ అంటారు."

"ఏమీలేదు."

"నేను బళ్లోకి పోవాలి బాబూ!" అని పరిగెట్టింది.

"శకుంతలా!" అని పిలిచాడు.

"ఏం?" అని ఆగింది.

ఎందుకు పిలిచాడు? ఆమెతో నిజం చెప్పేసి దుఃఖోపశమనం చేసుకుందుకా? ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

"ఏమీలేదు" అన్నాడు.

శకుంతల వెళ్లిపోయింది. ఇద్దరూ ఒక్క ఈడువాళ్లు. క్లాసుకి వాళ్లిద్దరే అందరికన్నా తెలివైనవాళ్లు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకుంటూ స్నేహంగా వుండేవాళ్లు. పంతంతో చదివే వాళ్లు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతంగా ఉండేది. శకుంతల దస్తూరీ కృష్ణుడికి జ్ఞాపకమొచ్చింది. ఆమె దస్తూరీ మంచిదికాదు. కొక్కిరిబిక్కిరిగా రాస్తుంది. అతనిది ముత్యాలకోవ.

శకుంతల బడిలోకి పరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తూ నిలబడి పోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగిపోయింది. వరండాలన్నీ ఖాళీ అయిపోయాయి. మేష్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కులుమీద వాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడి దగ్గర నుంచి కృష్ణుడు కదలలేకపోయాడు. తన చదువు పోయింది కదా అని కుమిలిపోతున్నాడు. స్కూలు వరండాలో కెళ్లాడు.

"నే నిక్కణ్ణుంచి కదలను" అనుకొని స్తంభానికి జేరబడ్డాడు.

"నే నింటికి వెళ్లను" అని నిశ్చయించుకొన్నాడు.

నాలుగోక్లాసు దగ్గర నుంచి బడిలో తను చదివిన ఐదేళ్ళ సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికి వొచ్చేయి.

ఐదవక్లాసు చదువుతుండగా ఒక పిల్లడు కృష్ణుడు మీద మేష్టరుతో చాడీలు చెప్పేడు. మేష్టరు నమ్మక అబద్ధాలు చెప్పేడని వాణ్ణే చితకతన్నేడు.

మూడవఫారంలో తెలుగు మాస్టరు "గాంధారపతి" అంటే అర్థం చెప్పమన్నాడు. అంతా నేలచూసి, ఇంటికప్పుచూసి, ధృతరాష్ట్రుడనిచెప్పేరు. తనొక్కడే "గాంధార దేశపు రాజు" అని చెప్పేడు.

రెండవఫారం చదువుతుండగా దసరా తరువాత ఒక కుర్రవాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరును రోజూ పిలిచి మేష్టరు అబ్సెంటు వేస్తూ ఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశాడని తెలిసింది. ఆవేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి మేస్టరు "డిస్కంటిన్యూడ్" అని రాసి ఆ ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పాడు. ఆనాటి నుండి కృష్ణుడు "డిస్కంటిన్యూ" అన్న మాటకి అర్థం మరచిపోలేదు. ఆ పదం జ్ఞాపకం రాగానే అతనికి దుఃఖం పొర్లుకుంటూ వొచ్చింది.

"నే నింటికే వెళ్లను" అని పునఃనిశ్చయించుకొన్నాడు.

"నేను భోజనానికే వెళ్లను" అనుకొన్నాడు.

అతని మొహం గాలికొట్టిన కొత్త ఫుట్‌బాలులాగ దుఃఖంతో పొంగి కందగడ్డ అయిపోయింది. ముక్కు నీటితో బరువెక్కి దిబ్బడేసి పోయింది. ముక్కు ఎగబీల్చుకుంటూ పొంగుకొస్తున్న దుఃఖానికి ఆనకట్టలుకట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడి పోయాడు.

మొదటి పీరిడైపోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ల నాన్న బజారుకు బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

"ఓరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగమారేవేం?" అన్నాడు.

"చూడు!" అన్నాడు కృష్ణుడు.

"ఏమిట్రా చూడ్డం?" అన్నాడు తండ్రి.

"పాపం. కనబడదు!"

"ఏమిటిరా నీ శ్రాద్ధం?"

"నాశ్రాద్ధమే!"

"ఏమిటిరా?"

"వాళ్లంతా బడికెళ్లారు!"

అప్పుడు తండ్రికి కొడుకు మొహంలో విచార రేఖలన్నీ కనబడ్డాయి.

"వెర్రి నాగమ్మా అదిరా!" అన్నాడు. కృష్ణుడికి ఆనకట్టలు తెగ్గొట్టుకొని దుఃఖం కొట్టుకొచ్చింది. వెక్కి వెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకు బాధంతా తండ్రికి బోధపడ్డాది. కొడుకు బాధంతా తండ్రి పడ్డాడు.

"చదువు మానిపించానని అంత బాధపడుతున్నావా? బడి వరండాలు పట్టుకుని దేవుళ్లాడుతున్నావా నాయనా? పద ఇంటికి" అన్నాడు.

"నే న్రాను!" అని భూమి బద్దలైపోయినంత గట్టిగా అరిచేడు.

"ఏం చేస్తావురా?"

"గోడకేసి బుర్ర బద్దలుకొట్టుకుంటాను!" అని ఇంకా గట్టిగా అరిచేడు. అంతపనీ చేస్తాడేమోనని వెళ్లి తండ్రి కౌగలించుకొన్నాడు.

"పద నాయనా ఇంటికి" అన్నాడు.

"బడి నాది!" అని గట్టిగా కేకేశాడు.

"నీదేనురా బాబు!"

"బడిలోకి తీసుకెళ్లు మరి".

"తల తాకట్టుపెట్టుకునేనా బళ్లో వేస్తాను. ఇంటికి పద."

"ఇప్పుడే వెయ్యి!"

"డబ్బు చూసి వేస్తాను".

"ఇంటికివెళ్లి లేదంటావు".

"అన్ను రా!"

"ఐతే పుస్తకాలు ముందు కొను!"

"వెర్రినాయినా! వాటికి మాత్రం డబ్బొద్దూ?"

"ఒక్క పుస్తకం కొను".

"ఏ పుస్తకం కొనమన్నావు?"

"ఇంగ్లీషు పుస్తకం కొను".

"కొందాం, పద. ఏడవకునాయినా, నే చచ్చిపోయాను ఏడవకు!" అన్నాడు తండ్రి. తండ్రి చెయ్యిని చంకలో పెట్టుకుని గిలగిల కొట్టుకొని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవతీశాడు.

తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. చుట్టలు మానేద్దామనుకొన్నాడు. ఎంత మానుదామనుకొన్నా మానలేక పోతున్నాడు. చుట్టలు మానేస్తే కృష్ణుడి జీతానికి సరిపోతుంది. ఇంకో విధంగా పాలుపోలేదు.

"ఇందాకా చుట్టలకిచ్చాను. డబ్బులున్నాయా పారేశావా?" అనడిగేడు కొడుకుని. "ప...ప్ప...ప్పారీలేదు. జేబులో ఉన్నాయి. ఎందుకు పారేస్తాను నాన్నా?" అన్నాడు కృష్ణుడు.

❋

భారతి, మే 1944

లేడీ కరుణాకరం

పండుగకి కరుణాకరం అత్తవారి ఊరు వెళ్లాడు. కూలివాడి నెత్తి మీద పెట్టెనుంచి అత్తవారి వీధిలో కొచ్చాడు. అతనిముందు నడుస్తున్న కొక్కిరాయి కుర్రాళ్లు అతని అత్తారింటిని చూస్తూ ముదరమాటలు మొదలెట్టారు.

“మేష్టరు అరుగులకి సిమ్మెంటు చేయిస్తున్నాడురోయ్!”

“వాడికేం? తురుఫాసులాంటి కూతురుంది. అది కాపరానికెళ్లే లోపల బంగారపు గోడలు పెట్టిస్తాడు”.

“ఈ రోజుల్లో నలుగురు కూతుళ్లని కనుక్కొన్న వాడిదదృష్టం”

“జగద్దోద్ధారణా...”

కరుణాకరం మొహమెర్రబడ్డాది. తనని చూసి, తన మామమీద, పెళ్లాంమీద కారుకూతలు ప్రారంభించారు కాబోలు. వాళ్లతో నోరుచేసుకొని ప్రయోజనంలేదు. లేక వాళ్ల మాటల్లో కించిత్ సత్యముందేమో! అనుమానానికి హేతువైంది.

కూలివాడు వీధరుగుమీద పెట్టి దించబోతున్నాడు.

“అఁ. అక్కడ దించకు కొత్త గచ్చు” అంటూ కిటికీలోంచి చూసి తలుపు తీసింది అత్తగారు.

“రా నాయనా, రా. కాకి కావుకావుకావుమంటే ఇవాళ వస్తావనే అనుకొంటున్నాము. సావిట్లో కూర్చో. మామగారు వచ్చే వేళైంది” అని అల్లుడ్ని పలకరించి ఇంట్లోకెళ్లి “ఏమర్రోయ్ పిల్లలూ బావ వచ్చాడు!” అని పెరట్లో ఆడుకొంటున్న పిల్లల్ని కేకేసింది.

మరుదులు, మరదళ్లు సాలగకిసాలగా “ఏం బావా!” అంటూ వొచ్చి పడ్డారు. వాళ్లకి బావ రావడము పండుగ. హాస్యాలకీ, సంతోషాలకీ, కొత్త రకం ప్రేమకీ బావ ఆదరవు.

అత్తగారు లొడలొడ ప్రశ్నలువేసి “వస్తాను మళ్లా. అన్నం చిమిడి పోతుంది” అని లోపలకెళ్లి, తిరిగి సావిట్లోకి వచ్చి అల్లుడుతో ముచ్చటిస్తూ చంటిపిల్లల కళ్లకలక, తనకి నడుంపీకు, ఈమధ్య పడ్డ వడగళ్ల వాన, దూడలపాక కూలిపోవడం, అతని పెళ్లాం పూతికపుల్లయినా ఇంట్లో పనిచెయ్యకపోవడం మొదలైన భోగట్టాలన్నీ అల్లుడితో చెప్పడము, వంట పూర్తి చేయటమూ ఒక్కసారి చేసింది.

కరుణాకరానికి భార్యా సందర్శనం కలుగలేదు. కాని పెరటి వరండాలోంచి గాజులు గల్లుగల్లు వినబడుతూ వుండడాన్ని అతని వొళ్లు గగుర్పొడుస్తూవచ్చింది. ఇంతలో “సుందరీ!”

అనే కేక పెరట్లోనుంచి వినవచ్చింది. అది అతని పెళ్లాం గొంతుకే. పెద్దమరదలు సుందరి పెరట్లో కెళ్లి కప్పుతో కాఫీ తెచ్చి బావకిచ్చింది.

మామగారొచ్చారు. అల్లుణ్ణి ఎంతో అభిమానంతో చేరదీసుకున్నాడు. కరుణాకరం చెన్నపట్నంలో ఎఫ్ఫే చదువుతున్నాడు. మామగారు నెల నెలా ముప్పయిరూపాయిలు పంపుతున్నాడు.

మరుదులు, మరదళ్ల అభిమానం, మామగారి మంచి, అత్తగారి అవస్థ, పెళ్లాం కాచిపంపిన కాఫీ, పెళ్లాంమీద కలిగిన అనుమానానికి అవకాశమిచ్చాయి కావు.

రాత్రి భోజనం కాగానే బడలికచేత పడుకున్నాడు. కాని నిద్రతిన్నగా పట్టలేదు. పక్కింటివాళ్ల గడియారం అరగంట కొట్టింది. పదకొండున్నరో, పన్నెండున్నరో. వీధితలుపు తట్టినట్టయింది.

"ఇవాళ వద్దని కబురు పంపలేదూ?" అని మామగారు పెళ్లాంతో మెల్లగా అన్నాడు.

"వెళ్లేవాళ్లు లేకపోయారు" అని అత్తగారు చెప్పింది.

మెల్లిగా వూపిరితో చెప్పుకొన్నా, కీచురాళ్ల అరుపులోంచి స్పష్టంగా కరుణాకరం విన్నాడు. మామగారు వీధి తలుపు తీశాడు. కరుణాకరం తలుపు కన్నంలో కళ్లు పెట్టి చూశాడు.

అత్తగారు మంచంమీద కూచునుంది. పెళ్లాం కళ్లు నులుముకుంటూ పక్కగదిలో కెళ్లుతున్నాది. దానివెనకే సరసుడు వెళ్లుతున్నాడు. సరసుడు సరసుడులాగే వున్నాడు. వాడైనా కరుణాకరం ఎరగనివాడు కాడు. పక్క వీధినున్న నాయుడు.

కరుణాకరం వీరావేశంతో తలుపు తియ్యబోయాడు. తలుపు అవతల గొళ్లెం పెట్టి ఉంది. తలుపు చితక తన్నాడు. ఆఖరికి మామగారు తలుపు తీశాడు. పెళ్లాం పక్కలో పడుకుని నిద్ర నటిస్తున్నాది.

"నీ పెద్ద మరదలు గొళ్లెం పెట్టింది. వెధవ హాస్యాలూ ఇదీనీ!" అన్నాది అత్తగారు.

"ఔను. నే నెరుగుదును. ఏడీ ఆ వెధవ?" అన్నాడు కరుణాకరం.

"ఎవడు?"

"నాయుడు లక్ష్మీ కొడుకు!"

అత్తమామలు నిర్ఘాంతపోయారు.

"ఇక్కడెవరూ లేరే. కలొచ్చింది కాబోలు!" అన్నాది అత్తగారు.

"చాలా దూరం వెళ్లివుంటాడు. సరే!" అన్నాడు. ఖూనీలు చేద్దామని తలుపుకొట్టాడు. ఇవతలికి రాగానే కూలిపోయాడు. వాళ్లేమి చెయ్యడానికి తోచక గదిలో పెట్టి తీసి బయలుదేరాడు.

"ఎక్కడికి నాయనా ప్రయాణం?" అంది అత్తగారు.

"మీ కూతుర్ని నాకు పెళ్లిచేశారు. నాయుడుతో పునస్సంధానం చేశారు. ఇహ చౌదరితో కాపరానికి పంపండి" అని వెళ్లిపోతున్నాడు.

మామగారు అడ్డుపడ్డారు.

"మా మాట విని తరువాత అను. నిజమే. తప్పుపనే చేశాము. నిన్ను మభ్యపెట్టినా నీ యోగక్షేమమాలోచించే చేశాము. నీ చదువుకి డబ్బు పంపుతున్నాను. పిల్లలవాణ్ణి ఎక్కణ్ణుంచి తేగలను. నువ్వు చదువుకుని పెద్ద వాడివయి మా అందరికీ ఆదరువు అవుతావనే చేశాము. పిల్ల అమాయకురాలు. దాని గొంతుకొయ్యకు. మమ్మల్ని ఎంతైనా అను. పడతాము" అని నడ్డిపట్టుకున్నాడు.

"కల్తీ వెధవల్లారా! ఈయేడు సిమ్మెంటుగచ్చు చేయించారు. వచ్చేయేడు రెండంతస్తుల మేడ కట్టించుకోండి. వదులు" అని మామని దుళ్లగొట్టేశాడు.

"నాకొంప కూల్చేశార(్రోయ్... నా కుపకారమన్నార(్రోయ్... నాచేత్తో నావీక కోసీశార(్రోయ్!" అంటూ శారద శోకాలుతీస్తూ వచ్చి కరుణాకరం కాళ్లమీద పడ్డాది. ఏడుస్తూ శారద నిర్దోషిలా కనపడ్డాది. తుమ్మెదలలాంటి దాని కళ్లు నీళ్లతో నిండి ఏడుస్తూ ఉంటే తట్టుకోలేకపోయాడు.

"సరేపదా. ఇక్కణ్ణుంచి నిన్ను తీసుకుపోతాను" అన్నాడు.

"పదండి" అన్నాది.

దానిరెక్క పట్టుకుని వీధిలోకి తీసుకెళ్లాడు.

"తెల్లారితే పండగ. నలుగుర్లో పడిపోతాము. రేపుండి అలాగే వెళ్లండి" అన్నాది అత్తగారు.

"నలుగుర్లో కాదు. నలభైమందిలో పడండి" అని పెళ్లాన్ని తీసుకుపోయాడు. మామ కిక్కురు మనలేదు. శారద కట్టుగుడ్డతో మొగుడివెంట వెళ్లిపోయింది.

చదువు మానేసి కరుణాకరం చెన్నపట్నంలో గుమస్తాగా కుదురుకున్నాడు. రవ్వారొస్టూ లేకుండా ఎంతో హాయిగా, సుఖంగా కాపరం చేస్తున్నాడు. ఆరేడుమాసాలైంది. కరుణాకరానికి ఒకనాడు వాళ్లవీధిలోంచి పోతూ నాయుడు కనపడ్డాడు. అనుమానం కలిగింది. మర్నాడు ఆఫీసుకెళ్లక తప్పిందికాదు. కాని మూడు గంటలకి తెరిపిచేసికొని వీధిలోకెళ్లి మాటు వేశాడు. వాళ్లింట్లోంచి నాలుగుగంటలకల్లా నాయుడు వెళ్లిపోతున్నాడు. గుండె లటుక్కుమంది. ఇంట్లో కెళ్లాడు. పెళ్లాం మంచంమీద కళ్లు మూసుకుని పరిమళిస్తూ పడుకున్నాది. దాని గుండెల మీంచి కిందికి వేళ్లాడుతూ పడివుంది మూడు మూళ్లజడ. ఏ పురుషుణ్ణయినా ఉరిపొయ్య డానికది చాలు.

కరుణాకరం చడికావడంతోనే కళ్లు విప్పింది. చెంపకి చేరడేసి కళ్లు. నిండుగా మొగుణ్ణి చూచి చటాలున లేచి మొగుడిమీద వాలి పోయింది.

"సానిపాపవి. ఎన్ని లబ్జులైనా చేస్తావు. దూరంగా ఫో దగుల్బాజీ ముండా!" అని దాన్ని విదిలించుకొన్నాడు.

"ఎందుకలా మండిపడతారు?" అంది.

"మళ్లీ ఈ వ్యవహారం ఎన్నాళ్లాయి?"

"ఏ వ్యవహారం?"

"గుడిసేటుదానా! నాయుడు రావడంలేదూ?"

"మీరు చూశారా?"

"చూశానుగనకే".

"చూడ్డం మీది తప్పు".

"నువ్వు తిరగడం తప్పా. నేను చూడ్డం తప్పా? అమ్మ!"

"ఇహ నోరు తిన్నగా రానీ, రోజూ వస్తున్నాడు. నా కోసం మెద్రాసు నా వెనకే వచ్చాడు. సందేహం తీరిపోయిందీ? ఇంతకీ మీకేం ద్రోహం చేశాను?"

"మరెవరికీ ద్రోహం?"

"నాయుడు డబ్బుపెట్టి చదువుకొన్నావు. అందుకే ఈ వెధవ ఉద్యోగమైనా చేస్తున్నావు. అతనన్నమే తిని అతని బట్టే కడుతున్నావు. నేనేంద్రోహం నీకు చేశాను? వాణ్ణిదోచి నీకు పెడుతున్నాను, పుస్తె ముడి వేసిన మొగుడివి కదా అని! నాకే ద్రోహబుద్ధి ఉంటే వాడితో లేచిపోనూ? నన్ను కనకపు సింహాసనం మీద కూర్చోపెడతాడే!

పేరూ ప్రతిష్టాలేకుండా వెధవ ఉద్యోగం చేస్తున్నావు. నీకు చెవుదామనే అనుకొన్నాను. నువ్వే వెళ్లిపడ్డావు" అని ఉపన్యాసమిచ్చి లోపలకెళ్లి తన చందుగుపెట్టి తీసికొచ్చి, పుస్తెల్లో తాళంతో తీసి, సొరుగు అరతీసి చూపించింది.

అందులో ఉన్నాయి విరజిమ్మి లెక్క తెలియనన్ని పది రూపాయల నోట్లు, కట్టలకి కట్టలు, చందుగు తలుపుమీది అద్దంలో ప్రతిబింబిస్తూ రెండు రెట్లుగా కనబడుతున్నాయి.

"వచ్చినప్పుడల్లా రెండేసి మూడేసి నోట్లు ఇస్తున్నాడు. కక్కుర్తి పడ్డా కడుపు నిండుతున్నాది. చెడ్డదాన్ని ఇదివరకే చెడ్డాను. అప్పుడు పనికొచ్చినదాన్ని ఇప్పుడూ పనికొస్తాను" అన్నాది.

"నీ మొహం చూడకూడదు. వెళ్లు అవతలకి" అన్నాడు.

"ఓహో మహాజోరుగా ఉందే! నువ్వే వెళ్లు అవతలకి. ఏమిటో అనుకుంటున్నావు. నా వల్ల నువ్వీపాటి వాడివైనా అయావు. నువ్వే ఇంట్లోంచి నడువు. నువ్వేం నాకు పెట్టి పోషించనక్కరలేదు" అన్నాది.

ఆ మాటలతో అతనికి చలి జ్వరంలాగా కుదుపు పట్టుకుంది. ఏమిటి చెయ్యడం? అది చెప్పినట్లు వొప్పుకోవడమా లేక సిద్ధాన్నాన్ని, అందమైన పెళ్లాన్ని వదిలి వెళ్లిపోవడమా?

"జరిగింది జరిగింది. ఇకనైనా తిన్నగా ఉంటావా?"

"పిచ్చి! పిచ్చి పిచ్చి!" అతని బుగ్గను పట్టుకుని సాగతీసింది.

"చాలు శృంగార చేష్టలు! ఇవి చూసే మోసపోయాను."

"ఏం కొంప మునిగిపోయింది? వెధవచేదస్తాలు పెట్టుకోకండి. అంత డబ్బు పెట్టుతున్న వాణ్ణి ఎలాగ పొమ్మంటావు? ఈ చేస్తున్న వెధవ ఉద్యోగం మానీయండి. ఎంతవరకు చదవాలంటే

అంతవరకూ చదవండి. అప్పుడు మనకు లోటు ఉండదు." అని సలహానిచ్చి చందుగులో నోట్లు చేతితో చేతిడు పిసికి పట్టుకుని "ఇందండి" అన్నాది.

అతనికేం పాలుపోలేదు. జన్మలో నాలుగు పదిరూపాయల నోట్లు ఒక్కసారి పట్టుకొని ఎరగడు. నోట్లు కళ్లు మణిగిపోతూ చందుగునిండా ఉన్నాయి. అతని కళ్ళమ్మడి నీళ్లుకారాయి. అప్రయత్నంగా అతని కేడుపొచ్చింది.

"ఛా! ఏమిటండీ అదీ? డబ్బులేనివాళ్లు గవ్వకి మారుతారా? ఇందండి. ఈ డబ్బంతా మీదే. డబ్బేనా? నేనూ మీదాన్నే. కోపంపోయిందా? కాలేజీలో చేరండి. ఉద్యోగం మానేయండి" అని సముదాయించింది. సమాధానపరిచింది.

కరుణాకరం తెలివైనవాడు. లేనిపోని గొడవలకి పోక చెవికి తాడు కట్టుకుని చదవడం ప్రారంభించాడు. విశ్వవిద్యాలయానికి మొదటితరగతి వాళ్లలో మొదటివాడుగా ఎమ్మేలో ఉత్తీర్ణుడయ్యాడు. అర్థికశాస్త్రం అతని ప్రత్యేక కృషి. పేసవగానే బేంకిలో ఉన్నతోద్యోగము వచ్చింది.

శారద పిల్లలతల్లి అవుతూ చెన్నపట్నం మీదికి విజృంభించింది. దానిది శ్రీకృష్ణదేవ రాయల వారి విజయయాత్ర. రవ్వల ఆభరణాలు, చీని చీనాంబరాలు, పళ్ళరసాలు, మత్తు పానీయాలు, పట్టుపాన్పులు అనుభవానికి వచ్చాయి.

కనకాభిషేకం చేస్తూ, అమె తనులతాసౌష్టవాన్ని సహస్రనామార్చనచేస్తూ విటకోటి సీమకుక్కల్లాగ చేరవచ్చారు.

కరుణాకరం బుద్ధికుశాగ్రమైనది. కొద్దికాలానికే విదేశీబేంకిలో ఇంకా ఉన్నతోద్యోగి అయిపోయాడు. శారద సంతోషానికి మేరలేదు. మొగుణ్ణి తీసుకువెళ్ళి ఫోర్డుకారు కొని బహుమానం చేసింది. ఇంకేంకావాలి కరుణాకరానికి!

బడిపిల్లల పోటీల్లో శారద అధ్యక్షత వహించి పిల్లకాయలకి పుస్తకాలు పంచిపెట్టింది. మిసెస్ కరుణాకరం అని అమె ఫోటో పేపర్లలో అచ్చుపడ్డాది. ఇంకేం కావాలి!

పిల్లలంతా కరుణాకరం మీదికి 'నాన్నా నాన్నా' అంటూ ఎగబాకుతారు. వాళ్లందరికీ తనెక్కడి నాన్న? పెద్దవాడు నాయుడు కొడుకు, రెండో ఆడపిల్ల లాయరు పోలిక, తరువాత జయంతుడు శారద ప్రతిబింబం.

అరుగురు పిల్లలని పరాయి దేవతలకి కన్న కుంతీదేవి పతివ్రతే అన్నారు. భర్త అనుమతి ఇస్తే తప్పులేదన్నారు ధర్మశాస్త్రజ్ఞులు. ఎవడి అనుమతిలేకుండా "టెస్టుకేసు" కింద కర్ణుణ్ణి కని దరిదాపు భ్రూణహత్య చెయ్యబోయింది కుంతీకన్య! కుంతి పతివ్రతైతే శారదా పతివ్రతే. ధర్మజాదులని "పాండవుల"న్నారు. వాళ్లు పాండునందనులైతే వీళ్లు కరుణాకర సంతానమే!

పిల్లలు లేనివాళ్లు పరాయిపిల్లలని తెచ్చి పెంచుకుంటారు. కరుణాకరం సమాధాన పడ్డాడు. అనేక విషయాలలో సమాధానాలు పడుతూ వుంటేనే జీవితం ఎవరికైనా గడుస్తుంది. పెళ్లాం కనిపెట్టిన పిల్లలను కరుణాకరం పెంచుకుంటూ తన వాళ్లని చేసుకొన్నాడు.

ఆఫీసు నుంచి ఫోర్డుకారులో ఇంటికిరాగానే పిల్లలు మీదికొచ్చారు. కరుణాకరం పెళ్లాం దగ్గరికి వెళ్లాడు.

"నీవల్ల ఇంతవాణ్ణయాను. నువ్వు శారదవి. విద్యాదానం చేశావు. శారద వెయ్యిమందిని వరిస్తుంది. దానికి దోషంలేదు. అడ్డుపెట్టినా బ్రహ్మదేముడికి చెల్లదు" అని భార్యాస్తవం ప్రారంభించాడు.

"ఏమిటి సంగతి?" అన్నాది శారద.

"నీకు తీరిక వుందా?"

"ఎందుకూ?"

"నీ విలాసాలన్నీ అయిన తరవాతవాణ్ణి. చిన్నవిషయం" అని చేతికందిచ్చాడు కవరు.

అతనికి ప్రయివేటుగా ఇంటిమేషను వచ్చింది. సాయంకాలం పేపరులో ఎలాగా వచ్చేస్తుంది. మర్నాటికి దేశమన్నిమూలలా వార్త పాకిపోతుంది. శారద చదివి ఉద్రేకం పట్టలేకపోయింది.

"సర్ బిరుదమే! నైట్ హుడ్డే! ఇన్నాళ్ళకి జన్మ సాఫల్యం అయింది. నేను నైటుగారి సతీమణిని. రేపణ్ణుంచి నేను గవర్నరు సతితో విందులకెళతాను. ఐయామ్ లేడీ కరుణాకరం! ఏమంటారు?" అన్నాది.

"యస్! మై డార్లింగ్!" అన్నాడు కరుణాకరం.

శారద మహాపతివ్రత!

❋

ఢంకా, మార్చి 1945

ఊహా ఊర్వశి

వెళ్లేను పెళ్లికి వాళ్లందరితోటీ. పడవనిండా కిక్కిరిసి కూర్చున్నాము. పదిహేను మైళ్లు గోదావరిలో ప్రయాణం. ఎక్కింది ఏరువాక పడవ, పొంగుతూ తోసుకొచ్చింది సముద్రపు పోటు, తాటిచెట్టంత కెరటాలనెత్తి తిరగేస్తూ లేచింది గాలి. తెరచాపలు రెండూ బిగిసి పూరిస్తే కొయ్యలు కీచులు పెట్టాయి. ఎత్తి కుదేస్తూ ఇనపనాగలిలాగా పడవ నీళ్లని దున్నుతున్నాది.

పడవ హోరెగరగొడుతూ పెళ్లివారు గొడవ చేస్తున్నారు. వినవలసిన విషయాలే. మామూలు మానవుల మురికి జీవితం అంతా వాళ్ల సంభాషణలో విమర్శ కొస్తోంది. రంకులు, రోగాలు, కుతంత్రాలు, కృత్రిమాలు, పెళ్లిళ్లు, పురుళ్లు, అప్పొన్తులు – సర్వం వాళ్ల పిచ్చాపాటికి కీలకం అవుతున్నాది. జీవితాన్ని సారస్వతంలోకి ఎక్కించి విమర్శించ దలుచుకున్న సాహిత్యపరులకి అదంతా చాలా ఖరీదైన ముడిపదార్థం.

పదహారేళ్ల నా పెళ్లాం వాళ్ల మధ్య పెద్దా పేరక్కలా పేలాపన లోకి దిగింది. పదహారేళ్లదైతే యేం? ఇద్దరు పిల్లల్ని కని, అబ్బో, 'అమ్మ' అయిపోయింది. అమ్మలక్కలతో సరిగ్గా మాట్లాడుతోంది.

ప్రసాదరావు పెళ్లి, ఆఖరి కెలాగైతేనేం, అవుతోంది. అదృష్టవంతుడు. వేలకొద్దీ కట్నం దావుకొట్టున్నాడు. పద్దెనిమిదేళ్ల పిల్లని పెళ్లాడుతున్నాడు. పుస్తె ముడేస్తే చాలు రెక్కట్టుకొని అదే గదిలోకి లాక్కెడుతుంది.

పెళ్లి ప్రయాణంలో, పుచ్చపువ్వు లాంటి వెన్నెల్లో, నిండు గోదావరి మీద హెత్తారీ లేక పోయింది. పడవలో కళ్లని కదుపుతూ, ఒక్క పడుచు పిల్ల ఉంటే పడవలాగే మనస్సూ ప్రయాణం చేసును. గుండెలు పాడుకున్ను. ఆడాళ్ల జనాభా ఎక్కువగానే ఉన్నాది. కాని అందమైంది లేకపోతే అట్టేపోయే. పడుచుపిల్లకి కరవైపోయింది. అందుకే యీ దంప్పు.

వెళ్లేను పెళ్లికి. లగ్న సమయం. శుభ్రమైన పెళ్లికొడుకు ఎమ్మే చదివేస్తున్నాడు. పెళ్లి కూతురు గుట్టంలాంటి కొండముచ్చు. వొంటినిండా నగలు, జరీచీర, తలనిండా పువ్వులు ధరించింది. అంచేత ఆమె నిడదవోలు స్టేషన్లో మనం చూసే వలీముఖం కాదు. సర్కసు ఎరీనాలోకి అలంకరించి తీసుకొచ్చే ఆడకోతి.

మూడు ముళ్లూ పడ్డాయి. తలంబ్రాలు పోసుకొన్నారు. పెద్దాళ్లకి కన్నుల వైభవంగా ఉన్నాది కల్యాణం.

నాకేం వెర్రా! ఎందుకొచ్చా నీ పెళ్లికి? ఈ మనుష్యుల మధ్యకి? మొగాళ్లంతా గాడిదలు. విజ్ఞాన దరిద్రులు. ఆడాళ్లంతా పందులు. వాళ్ల మొహాలు పిడతలు. మొగాళ్లంతా తండ్రులు (పితృదేవో భవ). ఆడాళ్లంతా తల్లులు (మాతృదేవోభవ). ఆడాళ్ల చంకల్లోనూ, మొగాళ్ల తొడల మీదా, పందిరిరాటల కెగబాకుతూ బిలబిల్లాడుతున్నారు పిల్లలు.

మంగళహారతి పళ్లెం పట్టుకుని నలుగురమ్మాయిలు పాట ప్రారంభించారు. భ్రాంతి అనుకున్నాను. కాని సరిగ్గా చూస్తే సత్యమే. అందులో చిట్టి ఉన్నాది.

చిట్టి పంథొమ్మిదేళ్లది. నా పెళ్లాంకన్నా మూడేళ్లు పెద్ద. నా పెళ్లాం పిల్లలతల్లి. చిట్టింకా అవివాహిత. పదివేలమంది పడుచులను చూస్తాము. అంతా నముద్రపు ఇసకలో అడుగుల్లాగ మనస్సులోంచి మాయమైపోతారు. చిట్టి రూపం చూచామంటే చెరక్కుండా మనస్సులో శాశ్వతంగా నిలిచిపోతుంది. "ఎందెందు" వెతికిచూస్తే "అందందు" దేముడు కనబడుతాడు. కాని 'అందం' ఒక్క చిట్టిలోనే కనబడుతుంది.

ఒక్కొక స్త్రీ మనస్సులో బాగా ముద్ర పడిపోతుంది. పదేపదే జ్ఞాపకానికి వొస్తుంది. ఒక్కొక్క స్త్రీ ఒక్కొక్క రసాన్ని హృదయంలో ద్రవింపచేస్తుంది.

మాలక్షమ్మ జ్ఞాపకానికొస్తే కరుణతో కళ్లు నానిపోతాయి. అంబాయమ్మ జ్ఞాపకానికొస్తే వొళ్లు గంగవెర్రులెత్తుతుంది. ఆవిణ్ణి గుమ్మంలోంచి 'ఛీఛీపో' అనాలి. వాళ్ల లచ్చి జ్ఞాపకానికొస్తే ఇంత నా బౌద్ధుని గుండెకాయ కసాయివాడిదై పోతుంది. లచ్చిని కొరతవెయ్యాలి. లేకపోతే పంజాబు పతాలానికి 'బాల్' చెయ్యాలి. చిట్టి జ్ఞాపకానికొస్తే? సింహాసనం వేసి కూర్చోబెట్టి ఆరాధన చెయ్యడానికి మనస్సు ఆయత్తమౌతుంది. అందుకు కావలసిన పూజా ద్రవ్యాలు అమర్చుకొంటుంది!!

"ఏం చిట్టీ?" పలకరించాను. ఎంతో తహతహలాడి అవకాశం చిక్కించుకొన్నాను.

"రాత్రి నిన్ను చూశాను" అన్నాది చిట్టి.

"ఐతే పలకరించావు కావు!"

"ఎక్కడో మొగాళ్ల మధ్యనున్నావు. ఉంటావా?"

"మధ్యాన్నం పోవాలి."

"మావూరు రా."

"తప్పకుండా?"

అంతటితో సంభాషణ అంతమైపోయింది. చిట్టిని నేనూ ఆకర్షించాను. అది మాత్రం ఖాయం. కనబడ్డప్పుడల్లా ఎగాదిగా చూడందీ ఒదిలిపెట్టదు. చిట్టి నా మనస్సుని దెయ్యంలా పట్టుకుంది. ఒంటరిగా పడక కుర్చీలో కూర్చుంటే, ఎదురుగా నవ్వుతూ నిలబడుతుంది. కాఫీ తాగుతూ ఉంటే పీల్పు పీల్పుకీ దాని అధరం మీద కళ్లు వాల్తాయి. నిద్రలో కలకాదు. జాగ్రదావస్థలో ఉండగా చిట్టి లీల – నిజమైన చిట్టిలాగే వెచ్చగా బరువుగా మీదికొస్తుంది.

చిట్టి తండ్రి కృష్ణారావు ప్లీడరు. రోజు కూలి పావలా అయినా తెస్తున్నాడో లేదో, పెళ్ళంటే మాటలా! కట్నాలు పొయ్యాలి. ఈ జన్మకతగాడు పెళ్లి చెయ్యలేడు. చిట్టికి పంథొమ్మిదో యేడు! నాకు పెద్ద ఆశ పట్టుకున్నాది. చెరువులో తామరలా ఆశ బుర్రంతా చుట్టుకుంది. నా ఆశకల్లా హేతువు నా పెళ్లాం మళ్లా కడుపుతోటుంది.

ఆడదానికి ప్రసవమంటే పెద్ద గండం. తల్లీ పిల్లా ఏర్పాటు అయీ వరకూ ప్రాణాలు పిడికిట్లో పట్టుకోవలసిందే. ఈ మాటు ప్రసవంతో నా పెళ్లాం విధిగా చచ్చిపోతుందని నిశ్చయించుకొన్నాను. పెళ్లాం చావు కోరడం చాలా జాలికరమైన విషయం. ఆమెతో తృప్తి పొందకపోతే పై తిరుగుళ్లు తిరగొచ్చు. తిరిగినా నా పెళ్లాం ప్రతిఘటించదు. అందవికారి అయిన పెళ్లానికి ఆరోగ్యం, అడకువ, మొగుడంటే వెర్రి వ్యామోహం, ఏ వంక పెట్టి తిడదామన్నా అవకాశమివ్వని ప్రవర్తనా వుంటే ఎలాగ చావడం? దాని చావు కోరడం ఘోరాతి ఘోరం. కాని నా చిటికిన వేలుకింద పెళ్లాల రేఖలు రెండున్నాయి. ద్వితీయం ఎలాగూ తప్పదు. పెళ్లాం చచ్చిపోవడం, చిట్టిని పెళ్లాడ్డం ఖాయం.

"రెండో పెళ్లి వాడికిస్తారా" అని సందేహించడానికి నా విషయంలో భయం లేదు. చిన్నప్పుడే పెళ్లయింది కాబట్టి పిల్లలు కలిగారు. పట్టున పాతికేళ్లు లేవు. నా పెళ్లాంకన్నా చిట్టే మూడేళ్లు పెద్ద! నేను కట్నం అడుగుతానేమో అని వాళ్లే భయపడాలి. రెండో పెళ్లికి కట్నాలు కూడా ఎక్కడ అందానికి నా విషయంలో వీల్లేదు. నేను తండ్రికొక్క కొడుకుని. నాలుగు డబ్బులున్నవాణ్ణి. నాలుగు డబ్బులు తెస్తున్న వాణ్ణి. ఇలాగ పెళ్లాం చచ్చిపోతే అలాగ చిట్టితో పెళ్లి అయిపోతుంది.

ఈ మాటు నా వివాహం ఆదర్శప్రాయంగా జరగాలి. నా చిత్త సంస్కారం ఊరికే పోకూడదు. పూర్వం పెళ్లి ఐదురోజులు. పెళ్లివారి ప్రాణాలు తీస్తూ పీకల మీద కూర్చునేవారు. ఇప్పుడు పెళ్లంటే వో రాత్రి. మర్నాడంతా మర్యాదగా వెళ్లిపోవలసిందే. ఏకరాత్రి వివాహం సంస్కరణ రీత్యా ముందడుగే!

నా సంస్కరణ మరీ విపరీతం. పెళ్లంటే ఇద్దరు వ్యక్తుల వ్యవహారం. ఇద్దరు సాక్షులూ, రిజిష్టారు అవసరం. ఆజ్యహోమాలు, పురోహిత సంభావనలు, డిన్నరు పార్టీలూ, అన్న శాంతులూ పనికిరావు. కాణీకట్నం పుచ్చుకోను. పెళ్లానికి పసుపూ, కుంకం పెట్టనక్కర్లేదు. పెళ్లి సంతకాలు కాగానే చకోరదంపతులమైపోతాము. వెన్నెల్లో కెగిరిపోతాము.

మా యిల్లంతా పాడు పాడుగా ఉన్నాది. ముందు డాబామీద మేడ వెయ్యాలి. స్ప్రింగు మంచంకొని పట్టుపరుపు కుట్టించాలి. బెంగుళూరు వేసంగి కెళ్లి రెండు కుక్కలిని తేవాలి. ఇదంతా చిట్టి పెళ్లామైతే మాట. లేకపోతే ఏముంది? చిలకలు చెక్కిన మా తాతయ్య పందిరి మంచం, అట్టలు కట్టిన మా నాన్న పరుపు, ఉచ్చకంపుకొడుతూ నా పెళ్లాం నులక కుక్కి కలిస్తే నా పడగ్గది! చెప్పేదేమిటి? అవన్నీ నా పెళ్లాంతో మాయమైపోయి, చిట్టితో నా ఇల్లు మొగలాయి మహలై పోవాలి.

హమ్మయ్య! కాకినాడెళ్లేను, చిట్టి పిలిచిందని, నా పెళ్లాం ఎలాగా చచ్చిపోతుందని. పెళ్లికూతురు చూపుల కెళ్లేను. రామారావు పేటలో కృష్ణారావు గారింటికెళ్లేను.

"ఏం వోయ్, జ్ఞాపకమున్నాం? ప్రసాదం పెళ్లిలో కాబోలు చూశాం. కూర్చో. మరేమిటయ్యా మీ వూరి విశేషాలూ? మీ రాజుగారి పిల్ల లెక్కడున్నారు?" అంటూ కృష్ణారావుగారడిగారు.

"అక్కడే ఉన్నారండి."

"ఎప్పుడేనా కనబడతారా?"

"అప్పటప్పట."

"మనం కోట్లో కెళ్లొచ్చా?"

"ఖిలేదారుగారి నడిగి."

"రావాలోయ్ విజయనగరం. మీ మహారాజకుమార్ కూడా గట్టివాడే. ఈ మధ్య ఆయన స్టేటుమెంట్లు చెడ్డ ఘాటుగా ఉంటున్నాయి."

ప్లీడరుగారు విశాఖపట్నం హార్బరు మీద, వాల్తేరు విశ్వవిద్యాలయం మీద అరగంట హస్కు కొట్టేరు. ఇంతట్లో ప్లీడరు గారి పెళ్లాం, చిట్టీ నీళ్ల బిందెల్తో కొళాయి కెళుతూ కనబడ్డారు. చిట్టిని చూడ్డం అయింది. ప్లీడరుగారి పెళ్లాం కుశల ప్రశ్నలు వేసింది.

"ఏం వోయ్ ఎక్కణ్ణుంచేవిఁట?. పురుటొద్దులు కాబోలు! నీ పెళ్లాం అటూ ఇటూ తేలిగ్గా తిరుగుతున్నాదా?"

"కులాసాగానే ఉన్నాదండి."

"ఇక్కడా పుట్టింటా?"

"మా యింటే!"

"సరిసరి! అన్నట్టు మూడో పురుడుకదూ... భోజనానికుండేం" అన్నాది. ఆ మాట ప్లీడరుగారనలేకపోయారు.

"ఉంటానులెండి."

"ఒస్తూ పోతూ ఉంటేనే చుట్టరికం. ఏవండీ! విశాఖపట్నంవాళ్ల మాట ఇతనితో చెప్పేరూ?" అని మొగుణ్ణడిగింది.

"ఔనేవ్! మరిచిపోయాను!" అన్నాడతను.

"సరిసరి! అలాగే ఉంటుంది మన వ్యవహారం. ఇంకెప్పుడు చేస్తారండీ పెళ్లి? కన్యాదానమంటే గోదానమా? ఇద్దరు పిల్లలుపుట్టేకా, వో చెంప నెరిసేకా?"

"చిట్టికేనా పెళ్లి?" అనడిగేను.

"ఇంకెవరికోయ్!"

"తొందరేవిఁటి లెండి!"

"తొందర కాకేమిటోయ్?"

"అంత తొందరైతే నాకు చేసేయండి."

"ఛో!" అన్నాది చిట్టి.

"నా కన్నా మంచివాడు దొరుకుతాడా?"

"అలాగే అయితే అడిగేవ్! అబ్బో. నీ పెళ్లాం జుట్టట్టుకుంటుంది" అన్నాదావిడ.

"పెళ్లాన్నొదిలేస్తాను".

"సరిసరీ! ఆ మూడోపిల్లో పిల్లోడో పుట్టనీ తాపీగా వొదిలేద్దువుగాని. నాయన్నాయన! దేవుడిలాగా వచ్చావు. ఆ సంబంధం గురించి కనుక్కొని భోగట్టా రాసిపెట్టు" అంటూ వీధిలోకి త్రోవతీసింది. తల్లి మాట్లాడుతూ ఉంటే పక్కగా చిట్టి చక్కగా నిలబడ్డాది. చిన్న మాట కలిపింది. నా కోరిక సిద్ధించింది. చిట్టిని నేనూ, నన్ను చిట్టీ తనివితీరా చూసుకొన్నాము. చిట్టి నీళ్లకెళ్లడం నామర్దాగానే కనబడ్డా ఆమె చంకలో రేకు బిందె అందంగానే అమిరింది.

భోజనమైంది. కృష్ణారావుగారు విశాఖపట్నం వెళ్లి వారి ఎడ్రను ఇచ్చి వాళ్ల స్థితిగతులను కనుక్కొని రాయమన్నారు. మంచి ఉద్యోగమే. సావిట్లో ప్లీడరుగారి టేబిల్ మీద 'జాన్ ఓ లండన్' పత్రిక కనబడ్డాది.

"ఇదెక్కడిది!" అనడిగాను.

"ఇంకొక ప్లీడరు గారిది. ఇదే కాదు. క్రైటీరియన్, మెర్క్యురీ, దిబ్బా దిరుగుండం తెప్పిస్తాడు. ఏంటో అతనిలాంటి పత్రికలన్నింటికీ డబ్బు తగలేస్తాడు! శుద్ధ క్రేకు" అన్నాడు కృష్ణారావుగారు.

'జాన్ ఓ లండన్' వగైరాలు తెప్పిస్తున్నవాడు శుద్ధక్రేకు! సంచిక పేజీలు తిరగేస్తే నేటి సారస్వతంమీద ఒక సనాతనుడి విమర్శ కనబడ్డాది. ఒక్క పేరా చదువుకోలేక పోయాను. అవతల గదిలో చిట్టి తిరుగాడుతున్నాది. అంత దగ్గిరలోవున్నా చిట్టికీ నాకు ఎంత ఎడమైనా ఉన్నాది. దాని వెనకాలే తిరిగే భాగ్యం ఉంటే? చిట్టి చిన్న ఘోషా పాటిస్తున్నాది. అంచేత వాళ్లసావిట్లో కూర్చోడం ముళ్లమీద కూర్చున్నట్టు ఉన్నాది.

"వస్తాను" అని లేచాను.

"బాబ్బాబు! ఉత్తరం రాయి. కట్నాలంటే నావల్ల కాదు. లాంఛనాల్లో లోపం చెయ్యను. వొచ్చినవాళ్లకింత అన్నం పెడతాను. ఇంత అన్నం ఉంటే ముడెట్టేస్తాను" అన్నాడు.

"కనుక్కొంటాను" అని బయలుదేరాను.

విశాఖపట్నం వెళ్లి చిట్టికి సంబంధం కుదురుస్తానా? వెడుతూనే ఉత్తరం రాశాను. వాళ్లకప్పుడే బరంపురంపిల్ల నిశ్చయమైపోయిందని. భయం పట్టుకుంది. నాకు తెలియకుండా చటుక్కుని చిట్టికి పెళ్లయిపోతుంది. కాని ఎంత దుస్సాధ్యమైనా సాధ్యంగానే కనబడుతుంది. చిట్టికి పెళ్లే అయితే దాని మొగుడు ఠారని చస్తాడు. అప్పుడు విధవని పెళ్లాడి సధవని చేస్తాను. చిట్టి విధవ అయితేనే మంచిది. నేను ప్రాధేయపడుతూ పెళ్లాడితే నా మీద స్వారీ చెయ్యొచ్చు. విధవ అయితే దీనురాలయి పోతుంది. దీనురాలును పెళ్లాడినవాడు దేముడైపోతాడు.

ఒకనాడర్ధరాత్రి నన్ను మా వాళ్లు లేపి మంత్రసాన్ని తీసుకురమ్మన్నారు. చీకట్లో పడి దేముడా అని వెళ్లేను. మంత్రసాని రాకుండానే నా పెళ్లానికి పురుడొచ్చింది. ఆడపిల్ల పుట్టింది. ఇహ నేను జాగ్రత్తపడక పోతే పెళ్లాం ఏటేటా తేలిగ్గా కని ఇల్లు నింపేస్తుంది. పురుడు దానికి గండం కాదు.

కాని చిట్టిదెయ్యం నన్ను వదిలిపెట్టలేదు. కోర్కెలు అణచివేస్తే మనో వికారాల కింద తేలుతాయి. కోర్కెలు సాఫల్యం చెయ్యడమో లేక జయించడమో మనం చేస్తూ వుండాలి. చిట్టితో కాపురం చెయ్యకపోతే ఇంకేం జన్మ? ఆ కోర్కెతో నేను కుంగిపోవలసిందేనా? లేదు లేదు. వాంఛా నివృత్తికి మార్గాలున్నాయి. లేని ఊర్వశితో కాపురం చెయ్యడాని కవకాశాలు న్నాయి.

ఏటొడ్డుకుపోయి ఇనక తిన్నెక్కి కూర్చో. భావగీతమోటి, నీకభిమానమైనది, కూనిరాగం తియ్యి. భావప్రపంచంలో కెళ్లి మనస్సుని ఊర్వశివైపు మళ్లించి ఊహించు. ఊర్వశి నీ పక్కనుంటుంది. నీ క్కావలసిన సన్నివేశాలు సంప్రాప్తమవుతాయి.

నీ పక్కలో పెళ్లామున్నదా సదవకాశం ఉన్నాది. పెళ్లాన్నే ఊర్వశి అనుకో, మనస్సుతో చూడు, మసిబొగ్గు మాణిక్యమైపోతుంది.

నిజంగా ఊర్వశిని తెచ్చి నీ కప్పచెపితే నువ్వు చాలా చిక్కుల్లో పడిపోతావు. సంసారికి ఊర్వశి దరిద్రదేవతా, దుఃఖకారణమూ అవుతుంది. ఊహాఊర్వశి రాజయోగాన్ని సిద్ధింపిస్తుంది. ఊహాఊర్వశిని పట్టుకొని 'చింబరేజో' అగ్నిపర్వత శిఖరాంచలాలకి షికార్లు పోవొచ్చు. ఆఫ్రికా ఎడారిలో బిడారి ప్రయాణం చేసి తోవలో నువ్వూ, నీ ఊర్వశీ గుడారం వేసుకొని ఉక్కాపీలుస్తూ లొట్టిపిట్టపాలతో కాఫీ పెట్టుకోవొచ్చు.

ఆ విధంగా చిట్టితో 'ఊహా ఊర్వశి' కాపరం చేస్తున్నాను. భావ కవుల ఆవేశం నాకు పట్టుకొందనుకుంటారు కాబోలు! భావకవిత్వం మీద అనాదరణా, కవితలో వాస్తవికత, అతివాస్తవికత అంటే అభిమానం ప్రబలిన తరవాతనే నాయీ మనో జాడ్యం – కాదు – మనో మనోజ్ఞత!

నా భార్య మళ్లా గర్భవతి అయింది. ఇట్టే తిరిగొచ్చేయి నవ మాసాలూ! కొడుకుట్టేడని అత్తవారు శుభలేఖ పంపారు. బారసాల కెళ్లాను. బారసాల్లూ, సత్యనారాయణ వ్రతాలూ ఇష్టంలేనివే. అయితేనేం? శుభ్రమైన చాపూ, పెళ్లానికి చీరా, కొడుక్కి బంగారపు వొత్తులూ మామగారు పెట్టేరు. అంచేత పెళ్లాంతో పీటల మీద కూర్చొని అత్తారిని సంతోష పెట్టేను.

నెల కొక్కరోజు తక్కువచేసి, నడ్డిబిగించి, పెళ్లాం చంటాడితో టింగురంగామని వొచ్చింది. కాని చిట్టికింకా వివాహం కాలేదు. నాకు నలుగురు సంతానం!

చిట్టికి పెళ్లికావడం ఇప్పటికీ నాకిష్టం లేదు. పెళ్లే అయిపోతే జెలసీతో గింజుకుచస్తాను. చాలాకాలం ఎవరిదగ్గరా చిట్టి అన్న అందాలరాణి పెళ్లికున్నాదని మాట వరసకైనా చెప్పలేదు. ఎవడైనా పెళ్లాడేస్తాడేమోనని భయం! ఎంత మంది పెళ్లికొడుకులైనా చిట్టిని చూచారు. అందం

ఎవడిక్కావాలి? గెజిటెడ్ ఆఫీసరుగారి కూతురు కోతైనా సరే తెలుగు ప్రొఫెసర్లు పెళ్లాడతారు. చిట్టికింకా పెళ్లికాకపోవడం, జీర్ణించిపోయి, నాలో దురుద్దేశాలని రేపుతున్నాది. చిట్టికింకా పెళ్లికాకపోవడం తెనుగు యువకుల రసజ్ఞతా దారిద్ర్యాన్ని వెల్లడిస్తున్నాది.

చిట్టికింకా వివాహం కాలేదు. నాకు నలుగురు సంతానం. ఇప్పుడు చిట్టికి ఇరవయ్యొకటో ఏడు నిండిపోయింది. చిట్టి నా పెళ్లాంకన్న మూడేళ్ల పెద్ద!

❄

భారతి, మార్చి – 1945

బూర్జువా కుక్క

నేను రోడ్డంటే పోతున్నాను. నా పక్కగా కారొచ్చి నిలబడ్డాది. కారులో ఆసామీ 'హల్లో' అంటే 'హల్లో' అన్నాను.

కారులో ఆసామీ సామాన్యుడు కాదు. బాగా చదువుకొన్నవాడనీ, ఉన్నతాశయాలు కలవాడనీ, ముఖ్యంగాపెద్ద స్థితిపరుడనీ ప్రతీతి. నాకు చిన్నప్పుడు బాగా స్నేహితుడు. పెద్దయిన తరువాత జీవితాలలో బాటలు వేరు వేరు అయిపోయాయి.

'నాతో నువ్వు రావాలి'. అన్నాడు.

దానికేం భాగ్యం? కారులో కెక్కించుకొని క్లబ్బుకి మోసుకుపోయి అక్కడ చిన్న ఫలహారం తగిలిస్తూ, మామూలు మాటలైనాక అతనో విశేషం చెప్పేడు.

'ఈ మధ్య నీ కథలు కొన్ని చదివేను. కథలు నన్ను కొనదాకా తీసుకెళ్లనూ తీసుకెళ్లాయి. నేను చదవనూ చదివాను. కథలో శిల్పం ఉంది. నేను సర్టిఫికేట్ ఇస్తున్నాను. గోడకి తగిలించుకో.' అన్నాడు.

'గోడకేం? మెడకే తగిలించుకోవాలి.' అన్నాను.

'అదే చెయ్యవలసింది. నా వంటి కల్చర్డు జెంటల్మన్ ఇచ్చిన తాఖీదు సామాన్యమైనది కాదు. నువ్వు నాకు చాలా కృతజ్ఞత చూపవలసివుంది కథలు చదివినందుకు. తరువాత నాకు కలిగిన భావాల మూలంగా నువ్వు కనబడగానే తన్ననందుకు!"

'కథలు ఆగ్రహానికి కారణమయాయా?'

'వొళ్లు మండుకొచ్చింది. ఆ రాతలు నాకు తలనొప్పి. చిన్నప్పుడు నీకెన్నో మధుర భావాలుండేవి. ఏమైనాయి? మధురస్వప్న శాఖగా విస్తరించవలసిన నీ సాహితి తుమ్మ కొయ్యగా చిగుళ్లు పెడుతున్నది. నీలో రొమాన్సు చచ్చింది.'

'రొమాన్సు కర్థం తెలుసా?'

'సరి! ఆంగ్లపదవిన్యాసం పొలరుదొర మన దగ్గర నేర్చుకోవాలి. నువ్వంతా పెడమార్గాన్ని పోతున్నావు. చిన్న సలహా ఇస్తాను."

'బాలాదపి సుభాషితమ్!'

'అప్రాచ్యుడా! నన్ను కుర్రవెధవని చేస్తావ్!"

'అని ఎక్కడన్నాను?'

'ధ్వనించేవు. ఆల్‌రైట్. ఈ మధ్య నీ కథలు కొన్ని చదవవలసి వొచ్చింది.'

'చిక్కే!'

'చిక్కేపడ్డాను. అవి నన్ను లాక్కుపోయాయి. దాంతో మరీ రిమ్మెత్తు కొచ్చింది. వాస్తవం చెపుతున్నాను. కొని కథలు చదివితే ఏడుపొచ్చింది. అనవసరంగా నీ మూలాన్ని మనస్సు పాడైంది. కథావస్తువుని బాగానే పని చేస్తావు. కాని చెప్పేనుగా పెడమార్గం పట్టేవు. కథల్లో ముఖ్యంగా నాకు నచ్చింది నువ్వు సృష్టించే వాతావరణం. నాకు చిన్న ఉపకారం చెయ్యాలి. చేస్తావా?'

'చెప్పు'

'నాకో కథ రాసి పెట్టాలి. జరిగిన విషయమే. నువ్వయితే అందంగా చెపుతావు.'

'చెప్పూ'

'మరేం లేదూ. గత సంవత్సరం 'లూసీ' అన్న తెల్లపిల్లని వెంట పెట్టుకుని ఊటీ వెళ్లేను. నెల్లాళ్లు దాన్ని నేను భరించటానికీ, అది భరించబడడానికి ఏర్పాటు.'

'భార్యా భర్తలుగా నెల్లాళ్లు కాలక్షేపం చెయ్యడానికి.'

'సరిగ్గా చెప్పేవు. డబ్బు మనకి బాగా వొదిలిపోయిందనుకో. అయితేనేం ఊటీ కొండలకి మేఘాలెంతందమో ఊటీ బంగాళాలకి లూసీ అంతందము. లూసీ తనతో 'బొర్జువా' (Borzoi) కుక్కనొకటి వెంట పెట్టుకొచ్చింది.'

'బూర్జువా కుక్కేమిటీ?'

'నీకు కుక్కలజాతులు తెలియవు. ఒఠ్ఠినాటు వెధవ్వి! ఎలాగ తెలుస్తుందిలే! బూర్జువా కాదు, బొర్జువా, అదొక ఐరోపా కుక్క!'

'బూర్జువా దొరసానిగారి బొర్జువా కుక్క'

'బాగానే అన్నావు. దానికేం, ఉంపుడు కత్తె మీద మనకెంత మమకారమో పెంపుడు కుక్కమీద లూసీ కంత మమకారం. నాలుగు రోజులు ఊటీని 'బ్యూటీ' అన్నాము. బొర్జువా కుక్కకూడా మాతోపాటు ఊటీని ఆనందిస్తున్నాది. దానికి కూడా కావలసిన సొసైటీ, రొమాన్సు ఉన్నాయి. ఒకనాడు ఏ పాము కరిచిందో బొర్జువా చచ్చి పడివుంది!"

'లూసీకి చాలా పెద్దదెబ్బే!'

'హృదయానికి పెద్ద గాయం తగిలినట్టు ఏడుపులు మొదలెట్టింది.'

'పాపం!'

'ఆఁ పాపం! దీనేడుపు వినడానికి తీసికెళ్ళానా?'

'ఏం చేశావు?'

'ఇంకొక బొర్జువాని దాని తాతలాంటిదాన్ని కొనిస్తాను. కుక్క కోసం ఏడుపేమిటి? అన్నాను. విరహతాపంలాగ పట్టుకుంది. అంత మమకారమేమిటి? కుక్కపోతే కుక్కరాదూ? నేను చెప్పేశాను. నా ఎదుట ఏడుపులు పనికిరావు. లేకపోతే వచ్చినతోవనే నడువు.' అన్నాను.

డబ్బు భాయ్! విస్కీ వైనులతో నా దగ్గర విచారాన్ని దిగమింగి దాని ఖర్మాన్నది ఒంటరిగా ఉన్నప్పుడు కుక్కకోనమేడ్చేది. నాకేం? నేను హాయిగా పావురాయిపక్షాల మీద ఊటీ విహాయనమంతా వలయగమనాలతో కాలం ఎగరనిచ్చేను.

ఊటీ నాకు కామెడీ. లూసీకి ట్రాజడీ, ఇదీ కథ. దీన్ని నువ్వు ఎలాగ రాస్తావో రసవంతంగా ఉండాలి.'

'తప్పకుండా రాస్తాను'.

'రాస్తావ్?'

'ఊఁ'

'నువ్వు రాయవు'.

నేను రాస్తానన్నా నమ్మలేకపోతున్నాడు! నా కథల మూలంగా నా మతం కొంత బోధపడి ఉంటుంది. అందుచేత రాయనని అనుమానపడుతున్నాడు. బాగా చిన్నప్పటి స్నేహితుడు. సాహిత్యాన్ని బాగా తరచినవాడు. కొన్ని గ్రంథాలకి కృతిపతి, కొన్ని ప్రచురణలకి రాజపోషకుడు, నాకు పెద్ద ఉపన్యాసమిచ్చేడు!

'ఈ మధ్యని కొందరు దరిద్రసంగీతం ప్రారంభించారు. దరిద్ర సంగీతానికి ఆకాశం, భూమి తాళం చిప్పలు చేసి సాహిత్యాన్ని దగ్గం జేస్తున్నారు. వీర శైవులమని బురఖా తొడుక్కొని సాంఘికవాదం ప్రచారం చేస్తున్నారు. మహేశ్వరాస్థానంలో ఐశ్వర్యం బుగ్గి, బూడిదా! అక్కడ పుత్తిలో భిక్షని ఏమి జుఱ్ఱుకోగలం?

మన చుట్టూ ఏముంది? దరిద్రం, దుఃఖము ఉన్నాయి. దానికి మనమా బాధ్యులం? అది వాళ్ల వాళ్ల ఖర్మ. ఎక్కువతక్కువలకి అదే కారణం. పూర్వ జన్మ, పునర్జన్మ నేను నమ్ముతాను. ఆర్యులు చెప్పినది మహా సత్యము. ప్రజాస్వామ్య సాంఘికవాదాలన్నీ బుద్బుదాలు.

మనకేం? మనం పెళ్లి కొడుకులం. పట్టుపరుపు, ద్రాక్షసారా ఎదురుగా వున్నాయి. మన 'భార్య' ఎప్పుడూ తరుణి. రూపవతి. ఇది మన మన పుణ్యం. చుట్టూ అలో లక్షణా అని లక్ష మంది ఏడుస్తూ ఉండొచ్చు. అది వాళ్ల వాళ్ల కర్మ. మనకేం?

నువ్వు నాకు బాగా స్నేహితుడివి. చెడడానికి సిద్ధంగా వున్నావు. ఇప్పుడే సాహిత్యాన్ని దరిద్రులపాలు చేస్తున్నావు. ఇహ నది కట్టిపెట్టు.

కవి ఎలాగుండాలి? పాదుషాలాగుండొద్దూ? కప్పురవువిడెం అందివ్వవలసింది అందివ్వద్దూ? కవిత్వం ఎలా గుండాలి? ఫ్రెంచి వైను లాగ, రంగు, రింగు, గింగురూ ఉండొద్దూ?

అవన్నీ ఉండేటట్టు నా కథ రాయి. ఏమంటావు?' అన్నాడు.

నేను విపరీతమైన నవ్వు నవ్వేను. అతను చెప్పినదానికంతకీ ఆ నవ్వే జవాబు!

ఆ నవ్వుకి నాలుగువేల అంచులున్నాయి. ఇప్పుడు తిరిగి అలాగ నవ్వమంటే నా తరం కాదు. విని విని విన్న దానికి జవాబుగా అప్రయత్నంగా ఆ నవ్వు అతని మీద నయాగరాలాగ విరుచుకుపడ్డాది.

అతని జీవితం మీద, జీవితాశయాల మీద, నమ్మకాల మీద నాకు కలిగిన జుగుప్స, హేళన, ఆగ్రహము, తిరస్కారము – నాలో రేగిన లక్ష భావాలు ఆ వొక్కనవ్వులో వ్యక్తమైనాయి. భాషలో పదజాలానికి అతీతమైన ప్రతిభతో అనేక భావాలని సూక్ష్మంగా ఆ నవ్వు వ్యక్తపర్చింది.

అతను బాగా నొచ్చుకున్నాడు. సాహితీపరులంతా అతని చుట్టూ పరిభ్రమిస్తూ భజన చేస్తూ ఉంటారు. నా తిరస్కారాన్ని సహించగలడా?

'మీరంతా సాహిత్యానికి చీడపురుగులు. నీకు సరియైన మార్గం చెప్పేను. నీలో మారే స్వభావం లేదు. మారకపోతే మనిషికాడు. నేను చెప్పిన కథ నువ్వెక్కడ రాస్తావు? నిన్ను చూసి విచారించవలసి ఉంది. విచారించడం నా స్వభావం కాదు.'

అని అంత్యోపన్యాస మిచ్చి, నెత్తిమీద హేటు బోర్లించుకుని, బిల్లు తనే ఇచ్చేసి, నా మొహమైనా మరి చూడకుండా, కారులో దూరి స్టార్టు చేసుకుపోయాడు.

బోర్జువాకుక్క కథ నేను రాయననుకున్నాడు. అక్కడ నా నవ్వు పొరపాటు అభిప్రాయం అతనిలో కలిగించింది. కథ నేను రాశాను. ఆ వర్గ జీవితాన్ని దులపవలసిన రీతిగా దులిపి దులిపి రాశాను. రాస్తున్నంత సేపూ నా చుట్టూ ఆనందం గువ్వపిట్టలాగ గుబాళించింది.

❀

ఢంకా, ఏప్రిల్ – 1945

ఎంపు

కుంటాడి కావేళ జోలి నిండిపోయింది. అది ఆవేళ వాడి అదృష్టం. జోలితో జోలెడు ముష్టి, అంటే రెండు కుంచాల బియ్యం. రేపటి చింతలేని బతుకైనా తొడకి బరువుగా తగుల్తూ, జోలి వేళాడుతూ ఉంటే కుంటాడి ప్రాణం సంతుష్టితో సుఖపడ్డాది. పది రోజుల గ్రాసం బుజాన్ని దిగ లాగుతూ వేళ్లాడుతున్నాది.

కుంటాడు కాలెగరేస్తూ ఊరవతల తోటల్లో కెళ్లాడు. నెల్లాకు, ఎండుపుల్లలు ఏరుకున్నాడు. మూడు మామిడి పింజలు దొంగిలించాడు. సాయంకాలానికి సత్రపు అరుగులు చేరుకున్నాడు. మూటలో మట్టిపిడత తీశాడు. మూడు రాళ్ల మధ్య నిప్పు చేసి అన్నం ఎసరు పెట్టేడు.

ఎర్రగా పొయ్యి నిండా లేచింది మంట. చలితో చుట్టుకుపోయిన కుంటాడి శరీరం వెచ్చపడ్డాది. చుట్ట ముట్టించి అడ్డపొగ పెట్టేడు. వాడి తొడకానుకొని ఉన్న బియ్యపు జోలిని తణువుకుంటూ తనివితో కళ్లు అరమోడ్చేడు. అన్నం ఉడుకట్టింది.

"ఎర్రీ!" అని కేక పెట్టాడు. సత్రపు అవతలవరండాలో ఎర్రీ, దాని కుష్ఠురోగపు తండ్రి కాపరమున్నారు. ఎర్రి వొచ్చింది.

"పులుసుదాకోపాలి యిద్దూ?" అన్నాడు.

"ఏం పులుసురో?" అన్నాది ఎర్రి.

"ఏం పులుసునే, మామిడికాయ నెల్లాకు!"

ఎర్రి పసికట్టింది. కుంటాడి చంకలోంచి దిగి తొడవార గుండ్రంగా మఠం వేసుకొని ఉన్నాది రెండు కుంచాల బియ్యపు మూట. ఎర్రి బుర్రంతా ఆశతో నిండిపోయింది.

"గింజలు బాగా దొరికినాయిరో! ఎవిడి మొకం నూసినావు?" అన్నాది.

"సీకటితో సలిమంట ఏసినారు. ఎర్రగా నీ మొకమే నూసినాను" అన్నాడు.

"ఉన్ననాడూ తినవా? ఎదవ నెల్లాకు. సేపలైనా కొన్రా! నానైతే మాంసం కొందును."

"అమ్మో గింజలైపోవు? అటితో నాను పదేను రోజులు బతకాలి!"

"రేపు తిరిపెమెత్తవా? జానడు పొట్టకేటోరె? మూడు పిడికిళ్లు దొరికితే సాల్దా? కొన్రా సేపలు!" అని బలవంతపెట్టింది.

దాని మాటలో ఉన్నాది ముష్టివాళ్ల ఆర్థిక రహస్యం. మూడు పిడికిళ్లు దొరికితే చావకుండా బతకొచ్చు! నలుగురమ్మలకి దయగలిగితే పొట్ట నిండిపోతుంది. అదీ ముష్టివాళ్ల ధీమా! సొట్టాడు

లేచాడు. ముసిల్దాని కొట్టుకెళ్లాడు. ముసిల్ది ముష్టి ముసాఫర్లకి కిరాణా సామానులు, కూరలు, కంపకట్టలూ అమ్ముతుంది. సోలడు నూకలు వెలపుచ్చుకొని నాలుగెండు చేపల్తో సహా పులును సామానిచ్చింది. ఎర్రి పులుసుదాక తెచ్చింది.

"ఒరే, నే నోటడుగుతాను" అన్నాది.

"నువ్వడుగుతావని నాకు తెల్సును" అన్నాడు.

"ఏటిరో?"

"బియ్యం!"

"మా యయ్యకి జొరం. మూణ్ణాళ్లయి ముష్టినేదు."

"నా నియ్యను".

"ఓ రియ్యరా!"

"జటకావోణ్ణడుగు. అడంటే నీకు రోకు."

"నీ జిమ్మడ! జటకావోడు నన్నొగ్గేసినాడు."

"నేదు. ఆడు బండీ ఎక్కి కుచ్చుల కమిచీతో ఛలో ఛలో అంటాడు. ఆడి దగ్గర కెళ్ళు!"

"ఆడికి పెళ్లయిపోనాది!"

"ఐతే బైరోగోణ్ణడుగు. బైరోగోడిపాటి సేసినాను కాదు! నా నూకలు కావాలా?"

"ఆ బైరాగోడి సంగతి తెలుసా? వో నా దద్దరేతిరి శిలుం కొట్టి కొట్టి ఒచ్చినాడు. 'ఏటంటావు' అన్నాడు. 'రూపాయి ఇయ్యి' అన్నాను. 'రూపాయి బుర్రా నాది?" అన్నాడు. 'అయితే పోయి శిలుం కొట్టుకో' అన్నాను. అటు సూసినాడు. ఇటు సూసినాడు. మొల్లోంచి తీశాడు. ఇచ్చు రూపాయి. బైరాగోల్లు సెడ్డవోళ్లు. ఆళ్లకాడ డబ్బుంటాది. నువ్వేటిరా ఇచ్చినావు?"

"నాకాడేటుంది?"

"ఉన్నదే!"

"ఉంటే తగువేమి?"

"ఆ బియ్యమన్నీ వొగ్గేస్తావూ?"

"వొట్టికెళ్లు. మాట తిరిగితే వొట్టు."

ఆ రాత్రి చీకట్లో కుంటాడు ఎర్రిని పట్టుకొని చెడ్డ బతిమాలేడు. తనూ వాళ్లతో వుండిపోతాననీ, తనకీ గంజినీళ్లు పోస్తూ ఉండమనీ, తన్ని పెళ్లాడమనీ పెద్ద పట్టుపట్టేడు. ఎర్రి మెత్తబడ్డాది.

మర్నాడు ఎర్రి, సొట్టాడు కలిసి వొండుకుంటున్నారు. ఎర్రి చేపల పులుసు మళ్లా పెట్టింది. క్లైరేతీ సత్రవులో అందరి ముక్కులూ ఎగరగొట్టింది పులుసువాసన. జ్వరంతో పడుకున్న ముసిలాడు లేచాడు.

"ఈ డెవడు?" అనడిగాడు.

"ఇక్కడున్న సొట్టాడే! అన్నాది ఎర్రి.

"ఎందుకొచ్చినాడూ?"

"కలిసి వొండుకుంటున్నాం."

"కలిశా?"

"ఔను మామా, కలోసుకొన్నాం" అన్నాడు సొట్టాడు, ముసిలాడు ఎర్రగా చూశాడు.

"ఎళ్లవతలకి సెత్త ఎదవా!" అన్నాడు ముసిలాడు.

"ఎందుకలా కసురుతావు! నానంత సెడిపోయినోణ్ణి కాను" అన్నాడు సొట్టాడు!

"ఓరెరుగుదునెర్రా, జాత్తక్కువ ఎదవా!"

సొట్టాడు పిచ్చెత్తిపోయాడు.

"నాకా జాత్తక్కువ? నాను కాపోళ్ల కుర్రోణ్ణి. ఏటనుకున్నావో! అ౦ నీ కూతురు గొప్ప యిపోనేదు. జటకావోడితో పోయిన సెటకారీ, ఆ జటకావోడు జొన్న గుడ్డి మాలోడు!" అన్నాడు సొట్టాడు.

ముసిలాడు లేచి పులుసుదాక కాల్తో తన్నేడు. పెద్ద అల్లరి అయిపోయింది. ముష్టివాళ్లంతా మధ్య పడ్డారు. సొట్టాడు కుంటుకుంటూ వెళ్లిపోయాడు.

"ఈ వెదవా దొరికినాడు నీకు? సరియైనవోణ్ణి నానే సూత్తాను" అని ఎర్రికి చెప్పి ఎక్కడికో వెళ్లిపోయాడు. సొట్టాడు మళ్లీవొచ్చేడు.

"నా నేటిసేతును!" అన్నాది ఎర్రి.

"నువ్వు సెయ్యగలిగింది నువ్వు సెయ్యాల!"

"ఏటి సెయ్యమంటావు?"

"నాతోరా!"

"ఎక్కిడికి?"

"ఎక్కిడికేటి? రామేశ్వరం దరినుంచి అద్దుమాలిన రాజ్జం."

"ముసిలాడు?"

"అడేడుపాడేడుస్తాడు!"

"అంటే?"

"వొగ్గేద్దాం!"

"అమ్మ గుండెతీసినోడా! రోగిష్టివోణ్ణి వొగ్గేసి నీతో కులుకుతూ రమ్మంతావూ?"

"నీకిష్టమైతేనే!"

"ఎళ్లెళ్లు" అని కసరి కొట్టింది. ఎర్రి కెదురుగా గోడ మూల గోనె కప్పుకొని గొంగలీ పురుగులాగు చుట్టుకొని సొట్టాడు పడుకున్నాడు. ఎర్రి దాకలో అన్నం గంజి వేసి నంచుకోవడానికి నాలుగు మిరపకాయలు పెట్టి సొట్టాణ్ణి లేపింది.

"తిండి తిన్రా! మళ్లా మా యయ్యొస్తే జట్టీ."

"నాను తిన్ను!" అన్నాడు. ఎర్రి ఎంత బతిమాలినా లేచాడు కాదు.

ముసిలాడు వచ్చేడు. వాడితో పాటు గుడ్డివాణ్ణి ఒకణ్ణి తీసుకొచ్చాడు.

"ఎర్రీ!" అని కేకేశాడు. ఎర్రి పలికింది.

"ఇయాళ నుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్లు ఉడకెయ్యాలి. తెలిసిందా? ఆఁ? ఈ గుడ్డోణ్ణెరగవూ?"

ఎర్రి గుడ్డివాణ్ణి ఎరుగు, వాడితో వాళ్లు శ్రీకూర్మం డోలాయాత్ర కెళ్లారు.

"ఎర్రీ బాగున్నా"? అని కుశలమడిగేడు గుడ్డివాడు.

"ఏం బాగునే? ముసిలోడు మూలపడ్డాడు" అన్నాది ఎర్రి.

"పెద్దోడయ్యాడు" అన్నాడు గుడ్డివాడు.

"అనాగేనే" అన్నాది ఎర్రి.

"ఎర్రీ! ఇయాళ నుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్లు ఉడకెయ్యాలి."

అన్నాడు ముసిలాడు.

ఎర్రికి మతిపోయింది. పెంచి పెద్దదాన్ని చేసిన తండ్రి శుభ్రమైన కుంటాడు దేహీ అని కాళ్ల దగ్గరుంటే గుడ్డివాడికి కట్టి పెట్టడానికి పూనుకొన్నాడు. ఎర్రికి బోధపడ్లేదు. ఏమి లాభం? కాదందానికి వీల్లేదు. తండ్రి చెప్పినట్టు నడుచుకోక తీరదు. సత్రపు పంచమూలని కుక్కలాగ చుట్టుకొని కుంటాడు పడుకున్నాడు. తిండి తిన్నాడు కాదు. వాడు అడుక్కు తెచ్చిన బియ్యం పెట్టి ఎర్రి వంట చేసింది. ఎర్రి దిగాలుపడిపోయింది.

"ఎర్రీ! నువ్వు ఎర్రిదానివి. నిజంగా ఎర్రిదానివి" అన్నాడు ముసిలాడు. ఎర్రికి ఏడుపు వస్తున్నాది.

"ఇనారా ఎర్రీ!" అని ముసిలాడు దాన్ని దూరంగా తీసుకువెళ్లాడు.

"నూసినావా గుడ్డోణ్ణి?" అనడిగాడు. చూడకేం? ఎర్రికి అదివరకే తెలును. నల్లగా రాయిలాంటి వొళ్లు, నుదురు నిండా మెరిసిపోతూ నామం! పేలిన పత్తికాయల్లాగ కిందికి జారిపోతూ గుడ్లు! భయమేస్తూ గుడ్డివాడుంటాడు.

"ఆఁ నూసినాను" అని తొడలు వాయించుకొంది.

"నీకు సోట్టోడి మీదున్నాది!" అని వెక్కిరింపు నవ్వు నవ్వాడు.

"నా కెవిడి మీదా నేదు" అని శూన్యాన్ని చూసింది.

"అనాక్కాదు సెప్పు!"

"నాకు తెల్దు".

"నీకు సొట్టాడు కావాలి!"

"నీ యిష్టమే కానీ."

"అనాగన్నావు బాగుంది. అది నోకం మెచ్చినమాట. నాను సెప్పినాను ఇనుకో!" అన్నాడు ముసిలాడు. ఇనుకోక తప్పుతుందా! నిల్చో అంటే నిల్చోవాలి. వాడితో వెళ్లు అంటే వెళ్లాలి! మనసా ఇష్టంలేని పెళ్లికూడా వొద్దంటానికి అవకాశం లేదు. తిరుగుబాటు చేయడానికి సత్తువలేదు. చావడానికి సిద్ధంగా ఉన్న ముసిలి కుష్టురోగపు తండ్రిలో ఏమున్నాది! పెంచిన తల్లిదండ్రులకి ఆ అధికారం ఒక్కొక్క పిల్లపైని ఉన్నాది. ఉన్నాది ఒక్కొక్క పిల్లకి తల్లిదండ్రుల పైనా గౌరవం.

"ఇనుకోక కాదన్నానా?" అన్నాది ఎర్రి.

"అడికీ ఈడికీ తేడా సెప్పు?" అని అడిగాడు.

"సొట్టోడు నక్కుగున్నాడు; గుడ్డోడు భయమేస్తున్నాడు."

"నాను భయమేస్తూ నేనూ? కుష్టురోగిని, నన్నెలాగనూస్తున్నావు. నాకెలాగ సేస్తున్నావు?"

"బాగుంది తండ్రివి!"

"నాను తండ్రినని ఇష్టపడ్డావా? అదు మొగుడని ఇష్టపడు! సేస్తూ ఓకాడ ఉంటే అదే ఇష్టమౌతుంది. సొట్టాడితో ఇంతకీ దినం ఎళుతుందా?"

"ఎందుకెళ్లదు?"

"మూడు పిడికెళ్ల ముష్టి దొరకదా?"

"అదిగక్కడే నాను సెపుతున్నాను. ఇనుకో!?" అని ముసిలాడు పెద్ద బోధచేశాడు. ముసిలాడి ఉపన్యాసం ముష్టిలోకానికి ఉపనిషత్తు.

"ఈ ముసిలాడు నచ్చీ కాలానికి నన్నద్దానం సేశాడని నువ్వేడవకు. సొట్టాడితో టెల్లినావా. నీకు కూడునేదు. అలకించి యాదన్తుంచుకో! ఇవాళ సెప్పినది మళ్లీ వున్కరానికి నూసుకో! సొట్టాడు ఏ గుమ్మమెక్కినా మొహం మీద భడీమని తలుపు ఏసుకుంటారు. అది మొకంసూస్తే ముష్టి పలకదు. అదు నిన్నట్టుకు బతుకుతాడు. నిన్నాడికీ ఈడికీ కుదిరిసి అదు బతుకుతాడు.

గుడ్డోడు మారాజు. కళ్లులేని కబోది. అడి జనమకదొక్కటే శాన. అణ్ణి నూస్తే జాలిపుడతాది. ఏయమ్మైనా మనసు కరిగి ఇన్ని గింజలేస్తాది.

అదంతా ఎందుకు? అదు అద్దుమాలిన పాటగోడు. అడి కెన్నెన్ని పదాలొచ్చును! అణ్ణి సెయ్యట్టుకుని తీసికెళ్లి నాలుగు రోడ్ల మధ్య నోవార కూకోయెట్టి, అడి ముందల గుడ్డ పరిసి నువ్వెళ్లిపో. అదు సితార పట్టుకుని, సిరతలు వోయిస్తూ పాడినాడంటే రూపాయి డబ్బులికి నాగారాదు. నీకదే దాకలా.

మనిసిని నూసినావా? గునపంనాగున్నాడు. నానాగ పెద్ద రోగం, మొండి సేతులూ నేవు. జిర్రనిసీదడు. ఇంత తెస్తాడు. ఇంత తింటాడు. నీ మీద ఆధారపడి నీ సెప్పు సేతల్లో ఉంటాడు.

నువ్వెక్కిడికి యెళ్లినా అడిగినోడుకాదు. నూడరాదు! నీకు మనునయిందీ, ఇష్టమొచ్చినట్టు తిరుగు. తఖరనేదు. ఏటంటావు?" అనడిగాడు.

"నా నేటంటాను"? అన్నాది ఎర్రి.

"అనాక్కాదు. ఆణ్ణి వొగ్గకు. నాను బతికుండగా సెప్పుతున్నాను."

"సరేనే పద".

" ఈ బైరేగి సిటికి అందరికీ తెల్దు. నన్నడిగితే ముష్టిగుంటలంతా ఎతికి ఎతికి గుడ్డోళ్లనే కట్టుకోవాలి."

"పద." ఇద్దరూ సత్రపు అరుగు మీది కెళ్లారు.

"ఒరే గుడ్డీ! ఎర్రి వొప్పుకుంది. అదింకోమాటందు" అని ముసిలాడు చెప్పేడు. గుడ్డివాడు పొంగిపోయాడు. వాడి జన్మకి ఎర్రిలాంటి గుంట ఆజన్మాంతం దొరకడమే భాగ్యం.

"ఎర్రీ! ఇంద. ఇందునోవి తీసి రేపు కడేలూ, అందెలూ కొనుక్కో!" అని గుడ్డివాడు మొలగుడ్డల్లో పైకి కనబడకుండా దాచుకొన్న ముంతంత డబ్బుల మూట పైకి తీశాడు. కానులు, దమ్మిడీలు ఎన్నాళ్ల బట్టీ కూడబెడుతున్నవో ముంతంత మూటని చేశాడు. అన్ని డబ్బులు ఏ ముష్టివాడి దగ్గరున్నాయి? ఎర్రి కళ్ళు చెదిరిపోయాయి.

"నాకు మెళ్ళోకి ఎర్రపూసలు కావాలి" అన్నాది. ఎర్రికి ఎర్రపూసలు ఎన్నాళ్లనుంచో మనసు.

"అయీ కొనుక్కో! కాని సిలవరు కడేలు, అందెలూ కొను. కడేలూ, గాజులూ నేకపోతే ఆడదానికి, మొగాడికీ ఏటి తేడా? కడేలు సెద్ద అందం" అన్నాడు గుడ్డివాడు. కళ్లు లేని వాడికి కడియాల రవలూ, గాజుల మోతలే కాబోలు కామాన్ని కదుపుతాయి!

"ఇంక నెగండి. కూడుతిని తొంగుందాం" అన్నాడు ముసిలాడు. ఎర్రి ముగ్గురికి కూడు సర్దింది. మూకుడుతో కూడు పెట్టి గంజి నిండా పోసి గుడ్డివాడి కందించింది.

"మా యమ్మకదూ! అద్దిగలాగా ఆడికి దినం ఎళ్లనీ. నీ సేత్తో ఆడికింత ఎట్టు. ఇద్దరూ నా దినం సచ్చేదాకా ఎళ్లనీయండి. ఎర్రీ! నాను బతికుండగా సెపుతున్నాను. గుడ్డోణ్ణి వొగ్గకేం?" అన్నాడు ముసిలాడు.

❋

అరసం ప్రత్యేక సంచిక, సెప్టెంబరు – 1945

అఁవెఁత

పెల్లినాడు ఏం చంబరపడ్డాను! దప్పులు, ఈరనాలు, బజింత్రీలూ బాకాల్తో పాలెం యెగిరిపోయింది. పెల్లి మా వొయిబవంగా అయింది. ఏం చంబరపడ్డా నేం చంబరపడ్డాను!

కొబ్బిరాకుల పందిరేసినారు. పెల్లి పీట అలంకరించినారు. తోరనాలు, గెలల్తో అరిటి సెట్లూ, రంగు కాయితం బుట్టలు - పీర్ల పంజెరం నా గైపోయింది గుడిసె!

పసుపూ పారాయణెట్టుకుని, మెడ నిండా గందాలు పూసుకుని, కొత్త కోకలు కట్టి పేరంటోల్లు, సంకల్లో గొడుగు లెట్టుకుని, సిలుకు కండువాలు తలపాగాలు సుట్టి సాకళ్లూ వొచ్చి పాలెం నిండిపోనారు.

అరవై రూపాయల అఁవిఁతి చేసినాము! గూనల్లో కల్లు నూతి నీల్లలా నింపినాము. గొర్రిపోతుల్ని ఏసినాము! మా వొయిబవంగా అయింది, పెల్లి. ఏంచంబరపడ్డా నేం చంబరపడ్డాను!

మా యయ్య మేనల్లుడు దాలిగోడు. దిక్కు నేకపోతే గంజినీల్లు పోసి మా యయ్యే పెంచినాడు. మా మాఁవాఁ, నీనూ ఒక్కనాగ పెరిగాము! వొక్కసోట పెరిగినాము.

దాలిగోడు తక్కువోడా? ఎంతంత సంగిడీలైనా పొడిచేస్తాడు. బుగ్గ మీసాల రాజులు, ఎఱ్ఱ రోసాల ఎలఁవఁలు నా దాలిగోడి తోటి పంజా కలపడమే?

అడ్డెడు బియ్య వన్నం, కుండెడు గోగాకు పులుసూ ఆడికి సిన్నప్పుడే సాలేది కాదు. పర్వతాల్లాటి గుడ్డల మూటల్ని కావిడేసి పది కోసులైనా ఇసురుకు వొచ్చేవోడు.

ఆడి దండల్నీ, గుండెల్నీ నూసుకొంటూ రేవులో గుడ్డలు గుంజడం మరిసి పోయీదాన్ని.

ఎంత చంబరపడ్డానో అంతా అయింది. పెల్లితోటొచ్చింది పెమాదం. అరవై రూపాయిల అఁవిఁతి. ఎన్నాళ్లు ఎన్ని మురిగ్గుడ్డలు ఉతికితే అరవయి రూపాయిలయేను! అరవయి రూపాయిలు పాపంనా పెరుగుతూ వొడ్డీ కొడ్డీ.

ఎనాగ తీర్సడం? బుఱ్ఱలు బద్దలుకొట్టుకొని మా యయ్య, నా దాలిగోడు ఆలోసించి నారు. ఆకరుకి తెగించినారు. నా దాలిగోణ్ణి రంగం పంపేరు. నన్ను ఒగ్గనేక ఒగ్గనేక రెండు వోరాలు నసికి నసికి ఎల్లిపోనాడు నా దాలిగోడు. గొల్లున ఆనాడే ఏడ్సినాను.

దపదపా డబ్బు పంపుతా నన్నాడు. అప్పుతీరగానే ఇంటికొస్తా నన్నాడు. ఎన్నెన్నో సెప్పినాడు. ఎందుకూ? ఆరు మాసాలయింది. పట్టున పది రూపాయిలు పంపలేదు. ఉత్తరం లేదు, పత్తరం లేదు. చమచ్చరమైపోయింది. అస్తీ గస్తీ నేదు.

గరికిపేట సాకలోడు తిరిగొచ్చి సెప్పినాడు. దాలిగోడు రంగంలో లాండరీ పెట్టినాట్ట. నిజమో, అబద్దమో ఓ బరమా గుంటని మరిగినాట్ట. ఊళ్లో వోల్లంతా ఇంక అడు మనోడు కాడు ఇంకో మనుము సూనుకోయే, అన్నారు!

నన్ను మోసం చేస్తావా, నా దాలిగో - అని ఏడ్సినాను. మొగుడంటే దాలిగోడే. అలాంటి మొగుడుంటే మారు మొగాడి మొకం ఏ యాడదీ సూడదు.

మా గేమంలో నాలు క్కొంపల పనీ సేసుకొంటూ, నాలుగ్గింజలు తెచ్చుకొని గంజినీల్లు తాక్క; నా దాలిగోడు రంగమంట లాండరీ పెట్టి నాకు అనియాయం సేస్తాడా? నా నిక్క డింకో మనుముకి పోనా? బుద్దికి నచ్చనేదు. లోపల బెమ ఉండేది. ఎవ రేమన్నా సెద్ద బెమ ఉండేది.

వోరం వోరం అనుకొనే దాన్ని, వోడలో నా దాలిగోడు దిగుతాడని; నాను రేవులో ఉంటే, రేపు వోర తోవలోంచి రంగు గళ్ల లుంగీ కట్టి, సిలుకు సొక్కా, జోళ్లూ తొడిగి, రంగు బిళ్లల జోడు కళ్లకి తగిలించి, పెద్ద బుట్ట కాపింగుతో నా దాలిగోడు మా కోచం పెద్ద పందిరి మంచం కావిడి పెట్టెలూ పట్టించుకుని, కుండిడు రూపాయ లట్టుకొని వొస్తాడని సెద్ద బెమపడేదాన్ని, సెద్ద ఆసెపడేదాన్ని.

రెండేళ్లానాది. ఆసలు గడియానలానాయి.

ఇంక ఊళ్లో గొడవ. ఎదవ గేమాల్లో రంకుతనం తప్పునేదు! గర్లంట గడ్డికి పోతే ఇదే గోల. పొలాల్లో పనికి పోతే ఇదే సంత. పుట్ట సాటైతే సిక్కు. ఒంటరిగా ఆడదుంటే పెమాదం. ఆడకీ మొగకీ పొద్దత్తమానం రంకు గొడవే; పెద్దలకీ పిన్నలకీ ఇదే పోగాలం.

ఆడాళ్లదీ తప్పే. పొగాకు ముక్కకీ సిద్దమే, సంతనాడు పకోడీ పొట్లాముకీ సిద్దమే. ముండ గేమంలో మనను కట్టుకొన్న మాలచ్చిమి ఒక్కత్తె!

“ఒలే సాకలీ ఏటంటావు?” అని పెతీ ఎదవా అడగడమే. సున్నపు కాయలో నాలుగు డబ్బులున్న పెతీ సెత్త ఎదవా 'సాకలీ' అంటే, “ఓయ్!” అంటాదనుకొంటాడు!

“ఏమంటావు, సాకలీ! ఏమంటావు?”

పెపంచాన్ననాలి.... రోజంతా నడుమొంచి, తొడ నోతు బురదలో దిగడి. ఊడిస్తే బేడ్డబ్బులు కూలికి టొచ్చా వొస్తున్నాది. ఆడది రంకుకి పోతే? నాలుగు పుట్ల నేలున్న నాయుడి తోటో, డబ్బున్న బాపనాళ్లో పట్టి సంతనాడు సెయ్యి జాపితే ఉప్పూ వఱ్ఱా మొఱ్ర తీరుతుంది. పంటనాడు పది కుంచాలు తేరగా దొరుకుతాయి; సిల్లరా మల్లరా సింవాలచ్చిమి అడపా దడపా వొస్తూనే ఉంటుంది. ఆడది వొప్పుకోక ఏం చేస్తాది? సూసీ సూణ్ణట్టు, కడుపు కాలుతున్న మొగుడూరుకోక సస్తాడా? ఎదవ నోకం!

మాయమ్మ నడిగినాడు పెద్ద బుగతగోరి కొడుకు శాత్తిరి. శాత్తిరి కేం? ఎన్ని ఏషాలైనా ఏస్తాడు. ఎయ్యి రూపాయిలు సిస్తు లొస్తాయి, ఐదు గరిసెల సేరీ ఉంది, పెద్ద మావిఁడి తోటుంది. బాబు ఎవారాల్లో నాదారుల్ని దిబ్బసేసి రెండు సేతులా దోస్తున్నాడు. పట్నాలంట

పదేళ్లుండి పెద్ద సదువులు సదువుకొచ్చినాడు. పల్లెటూల్లో పనా పాటా? శాత్తిరికి పడుచు పిల్ల కనబడ్డం తప్పు; రూపాయి అర్ధా మొల్లో దోపి పొద్దస్తమానం తోటలంట, పెండెలంట పుస్తక మోటి సంక నెట్టి షైరులు తిరుగుతాడు, షైరులు!

"నీ కూతుర్ని నాకు కుదుర్సు" అని మాయమ్మ నడిగినాడు శాత్తిరి. ఏం దురన్నాయం!

మాయమ్మ అందట, "నాయినగోరూ, నా కూతురొప్పుకోదు. అదొప్పుకొంటే మా కొంపకిన్ని పాట్లెందుకు ?"

"ఏంటే మీ కష్టాలు?" అనడిగినాట్ట శాత్తిరి.

మా యమ్మ సెప్పుకుంది; నా పెల్లి అయింటి కయిన కరుసు, పీకల మీ దప్పు, వొడ్డీకి వొడ్డీ, దాలిగోడు రంగ మెల్లడం; కస్టం సుకం సెప్పుకుంది.

"ఒస్సింతేటే! మీ యప్పు నూటా పాతిక రూపాయిలూ నే తీరుస్తాను. నీ కూతుర్ని నా క్కుదుర్సు!" అని పట్టు పట్టినాడు.

మాయమ్మ మొకం పెద్దదైపోయింది. అప్పు తీరుతుందంటే మా యమ్మ ఎందుకేనా ఒప్పుకుంటాది. "ముందర డబ్బియ్యి; దాని మెడలొంచుతాను!" అన్నాది. నూటపాతికా పుచ్చుకొంది. అది నాకు సూపుతూ సెప్పింది. వొద్దు గాక వొద్దన్నాను. మూడు రోజులు పట్టు పట్టినాను. సాగింది కాదు!

నా మూలంగా, నా మొగుడి మూలంగా సెడిపోయినారు. కష్టపడుతున్నారు. నా దాలిగోడు అద్దోన్నం సేసినాడు. పీకల మీదప్పు కొంపమీద కొచ్చింది. అందు కొడబడ్డాను!

శనారం మద్దేన్నం. మా సాకిరేవుకి దెగ్గిరగా ఊటగెడ్డవోర శాత్తిరికి మాంవిండి తోటున్నాది. నాకు బాగా యాదస్తుండిపోయింది. సిక్కగా బలిసిన మొగిలిపెండి. జనుము బలిసిన పూబి; అమ్మోరు జుట్టునాగ పొగ నెగుస్తూ సున్నపు బట్టీ. ఆ మూరు మూల మాంవిండి సెట్టు కింద ఇనక నేల. అక్కడి కెల్లాను శాత్తిరి కోనం.

శాత్తిరి పిన్నవోడే. పెల్లయినా కానేదు. కానీ, యెందుకూ!నీ! ముతక మాట అనకూడదు గానీ శాత్తిరి పురుస జనమ మెత్తనేదు. ఉత్త బొమికెల గూడు. పైకి నిండా నలవ బట్ట లేసుకున్నా గాజుకాయ నాగ కనబడతాడు.

కాని సెడ్డ ఏడ్సినాను. ఎయ్యి రూపాయి లిచ్చినా సెడ్డ బతుకు సెడ్డ బతుకే. శీ! దాలిగోడికి అపశారం చేసినాను. ఆడు తిరిగొస్తే?

సమాదానం సేసుకొన్నాను. సిల్లర ఎదవల్తో పోనేదు. అమ్మకీ, అయ్యకీ బాదలు తీరినాయి. బుక్కెడు గంజినీల్లు కలిగినాయి.

శాత్తిరి మా బాగా మరిగినాడు. నూటాపాతిక రూపాయిలు ఇచ్చుకొన్నాడు. వొట్టినే ఇచ్చుకొన్నాడా? మాంవిండితోటలో సాలేయించినాడు; సిన్నసాల, మా యిమ్ముగా ఏయించినాడు. కురిసీలు, బల్ల, మంచం ఎట్టినాడు. కాపీకి మరపొయ్యి ఎట్టేడు. బీరువా నిండా పుస్తకాలు నింపేడు. అక్కడ నన్ను కూకో ఎట్టుకొనేవోడు.

నా సక్కదనం రోజూ వొరిణించేవోడు. సెంపకి సారదేసి బేడిసెల్లా కళ్లు, మొగిలి ముళ్లలా పళ్లు, వోటంగా వొళ్లు, అవయవాలన్నీ యిసిత్తరంగా - సిగ్గు సిగ్గు -వొరిణించేవోడు.

అందం కాకేటి నాకు? నా యీడు వోళ్లంతా ముగ్గురేసి నంతానం కలిగి ముని లోళ్లయిపోనారు. బొట్టెలు నేరు; గట్టిగున్నాను. గుడ్డలు గుంజి, కడుపెక్కా తిని కొవ్వెక్కి ఉన్నాను. అందం కాకేటి నాకు? ముక్కు సొట్టా, మూతి వొంకరా? శాత్తిరి నా వొళ్లు నూస్తూ సీతాకోక రెక్కల్లా కళ్లు ఎగిరించేవోడు.

ఆయేళ శుక్కరవోరం. రేవులో ఉన్నాను. మా యమ్మ; శాత్తిరిగో రొచ్చుంతారు, తోట్లో కెల్లు - అని పొడిచి పొడిచి సెప్పింది. అమ్మ ఎల్లమందూ? అడిగినప్పుడల్లా రూపాయీ, అర్ధా అడిగినంతా ఇచ్చుకొన్తున్నాడు.

కనునూపు మేరలో ఎవరో జట్టు మనుషులొస్తున్నారు. తేరబారి నూసినాను. కంటి కానింది. నిరగాంతపోయి నిలుసున్నాను.

"వొస్తున్నాడు, వొస్తున్నాడు! నా మొగుడు! నా దాలిగోడు, నా దాలిగోడు!" అను కుంటూ నూసినాను. దుక్కంవాగింది గాదు; పున్నానికి సముద్రంలా పొంగిపోయింది. గుండె కుండలో కోడి లాగుడికి పోయింది. నరాలు తోడుకుపోయి, పేగులు పినుక్కుపోయి కుప్పలా కూలబడి నెత్తికి సేతులెట్టుకు ఏడిసినాను.

ఎదవ అప్పు తీరకపోతే ఏం? గంజి నేక పస్తులుంటే ఏం? మూన్నాళ్ల బతుకు తెల్లారకపోనా? నా దాలిగోడి కపశారం చేసినాను. సెడిపోనాను. కన్నీల్లు ఏకదారగా కారినాయి. వొళ్లంతా కరిగి, కన్నీలై, కాలువ గట్టి మాయదారి సాకిరేవుకాడ, ఊటగెడ్డలో కలిసిపోకూడదూ? బండలా మరింత బరువెక్కి బతికినాను బతుకు!

దాలిగోడు దగ్గిరకొచ్చి ఎన్నుమీద సేతులేసి; "ఓ లేడవకే, నా నొచ్చీనాను!" అంటూ లేవదీసినాడు. పాడు మొగం ఎత్తి నూపనేక నూపనేక తలెత్తినాను. మబ్బులు కమ్మిన కళ్లకి మసక మసగ్గా కనబడ్డాడు. కళ్లు నులుముకు నూసినాను. నా దేముడు నా దగ్గిర కొచ్చినాడు; జనమ కేటి గావాల?

మాఁయిఁడి తోటా, మాయదారి సాలా, జనుము బలిసిన పూబీ కళ్లలో యెదురుగా కనబడ్డాయి. నోటిలో తెల్లగా సిగరెట్టు ఎట్టుకొని ఇనక పర్రని పచార్లు చేస్తున్నాడు శాత్తిరి. పొద్దున్నే సికారు కొచ్చాడు. సికారుకి!

ఇంకా తోటనో కొత్తా ననుకుంటున్నాడు గావాల!

ఈడి బుర్ర పడిపోను!

❃

రచనా కాలం : 1951

ఆఁవెఁత కథ మాండలికాల అర్థ వివరణ

ఆమెత : విందు, రంగం : రంగూన్ (బర్మా)లో కూలి పని దొరకడమే కాక బాగా గిట్టుబాటుగా ఉండేది అప్పట్లో. రంగమంట : రంగూన్‌లో. గుంటని మరిగినాట్ట : స్త్రీతో అక్రమ సంబంధం ఏర్పరచుకొన్నాడట : గర్లంట : (గరువు లంట) మెరక భూముల్లో, సున్నపుకాయ : ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు చిల్లర ఖర్చుల కోసం నాణాలు దాచి తీసుకెళ్లే భరిణె. ఊడిస్తే : ఊడ్పు - నాట్లు (వరి వగైరా). ఉప్పూ వర్రా మొర్ర : ఆకలి సమస్య. నా దారుల్ని : సన్నకారు జనాన్ని. దిబ్బచేసి : అణగదొక్కి పెండె : ఇవతల ఏం జరుగుతోందో అవతలికి కనపడనంత దట్టంగా ఉండే చెట్ల వరుస (ముఖ్యంగా తాటి, ఈత). ఊటగెడ్డ వోర : సెలయేటి ఒడ్డున.

వాయులీనం

రాజ్యానికి వొంటిమీద స్పృహ పూర్తిగా తప్పిపోయింది. అది ఈ ప్రపంచంలో లేదు. వెంకటప్పయ్య ప్రాణాలు ఎక్కడివక్కడ ఎగిరి పోయాయి. పరీక్షగా పెళ్లాం మొహంలోకి చూశాడు.

రాజ్యం పెదిమలు కదులుతున్నాయి. ఏవో మాటలు అంటున్నట్టుంది. మాటలు పైకి రాకపోయినా మనస్సులో ఏదో అనుకొంటున్నాది.

"వొసే రాజ్యం!" అని ఆదుర్దాగా పిలిచాడు. అది పలకలేదు. అది ఈ ప్రపంచంలో లేదు. మనోహరమైన తోడిరాగాన్ని తోడుపుచ్చుకొని అంబరవీధుల్లో విహరిస్తున్నాది.

వసారాలో పిల్లలు గందరగోళం చేస్తున్నారు.

"వెధవల్లారా ఏమిటా అల్లరి!" అని గట్టిగా పిల్లల్ని వెంకటప్పయ్య కసిరాడు. పిల్లలు దగ్గరగా ఉంటే చావకొట్టేవాడే.

"అబ్బ తుళ్లిపడ్డానండీ! పిడుగుపడ్డట్టు పిల్లలమీద అలాగ విరుచుకు పడుతున్నారేం?" అని రాజ్యం తెలివి తెచ్చుకొని అడిగింది. కళ్లు చిట్లించి మొగుణ్ణి చీదరగా చూసింది.

"నీ వంట్లో ఎలాగుందో చెప్పు" అని ఆత్రుతగా అడిగాడు.

"వాళ్ళ నెందుకలా కసిరారు?"

"కసిరితే కసిరాను.ముందు వంట్లో ఎలాగుందో చెప్పు".

"నిక్షేపంలాగుంది. ఇప్పుడేమొచ్చిందని?"

"పిలిస్తే పలికావా మరి?"

"పిలిచారా?"

"పిలవలేదూ మరి?"

"అలాగనా!" అని రాజ్యం నవ్వింది. దాని నవ్వుమొహం చూడ్డానికి భయంకరంగా వుంది. పైకి వచ్చేసిన గుడ్లగూబ కళ్లు, ముందుకు పొడుచుకు కనబడుతున్న ముందు పళ్లు మొహాన్ని బీభత్సం చేశాయి.

"వొళ్లు మరచిపోయానండీ!" అని రాజ్యం మళ్లా నవ్వింది.

"అంతేకదా!" అని వెంకటప్పయ్య కాస్తంత కుదుట పడ్డాడు. రాజ్యం టైఫాయిడ్ జ్వరంతో తీసుకొని కిందపెట్టవలసినంతా అయి బతికి బట్టకడుతున్నాది. పత్యంతింటూ, ఇంకా

వారంరోజులే అయింది. వెంకటప్పయ్యకి అదురుమాత్రం పోలేదు. ఆ మాయదారి టైఫాయిడు జ్వరం మూడు వారాలుగా పొక్కిపోసిన తరువాత దిగజారలేదు. మళ్లా తిరగబెట్టింది. మరి మూడు వారాలు "చూడు నా మహత్యం" అని ముప్పుతిప్పలూ పెట్టింది. పత్యం పెట్టించినా, ఆసుపత్రినుంచి ఇంటికి తీసుకొచ్చినా, వెంకటప్పయ్యకి పక్కబెదురు అలాగనే ఉండిపోయింది. ఏ క్షణంలోనైనా దాని ప్రాణం గుటుక్కుమంటుందనే వాడి భీతి!

"నా వంట్లో హాయిగా ఉంది. తింటున్నది అరుగుతున్నాది. నిద్ర పడుతున్నాది. అంతజబ్బు పడ్డాక నిలుచున్న పాళంగా మామ్మూలు మనిషిని కమ్మంటే అవుతానా?"అన్నాది రాజ్యం.

రాజ్యాన్ని చూస్తే మాత్రం దానివంట్లో ప్రాణాలు ఎలాగ నిలబడి ఉన్నాయా అని ఆశ్చర్యం వేస్తుంది. కండయావత్తూ అర్చుకుపోయి ఎమికెలమీద తోలుమాత్రం మిగిలివున్నాది.

"నువ్వు పరధ్యానంగా ఉంటే గుండెలార్చుకు పోయాయి" అన్నాడు. నిద్రపోతున్న పెళ్ళాన్ని చూశాడా, ప్రాణం ఉందా లేదా అనే సంకోచం వాణ్ణి ప్రతీరోజూ పీక్కుతింటూ ఉండడం, దాని కడుపు కిందికీ మీదకీ ఊపిరికి ఎగురుతూ ఉంటే బతికే ఉన్నాదని నిర్ధారణ చేసుకొంటూ ధైర్యపడడం వాడికి పరిపాటి అయిపోయింది.

"మనస్సు ఎటో పోయింది. నావంట్లో మరేం లేదు. ఈ యింటికి మారిన దగ్గరనుంచీ నాకు హాయిగా ఉంది" అన్నాది రాజ్యం.

"నాకూ ఈ యింటికి వచ్చిన దగ్గరనుంచి హాయిగా ఉంది. ఏదో కొత్త సంతోషం కలుగు తున్నాది. ఎటొచ్చి అద్దె కాస్త ఎక్కువనుకో" అన్నాడు.

"అద్దెకే బెంగగా ఉంది" అన్నాది రాజ్యం.

"ప్రాణానికే క్షేమంలేని తరవాత వెధవ అద్దెకు చూసుకొంటామా? ఏ బెంగా వద్దు" అన్నాడు. అంతకుముందు వాళ్లు ఇరుకు సందులో ఇక్ష్వాకులనాటి పాతగూత్యంలో అద్దె చవకని ఉండేవారు. అక్కడ ఉన్నన్నాళ్లు ఇంటిల్లిపాదికీ రోగాలే. ఆఖరికి రాజ్యానికే ప్రాణం మీదికొచ్చింది. మనిషి తోడు లేనివాడు. ఆస్పత్రిలో పెళ్లాన్నుంచి యమయాతనపడ్డాడు. కట్టుకొన్న మొగుడు, కనుకొన్న పిల్లలు అదృష్టవంతులు కావడాన్ని బతికి మనుషుల్లో పడ్డాది. ఇప్పుడు కొత్తగా కట్టిన సిమెంటు డాబాలో రెండు చిన్న గదులూ, వసారా అద్దెకు తీసుకొన్నారు. ఎదురుగుండా చూడముచ్చటైన మేడ ఉన్నాది. ఇళ్లచుట్టూ విశాలంగా పెరళ్లున్నాయి. పెరళ్లన్నీ ఉద్యానవనాలే!

"వెధవ డబ్బు. ఏదో కూడిక చేసుకొంటాము. నువ్వు బతికావు. అంతేచాలు" అన్నాడు.

"అదేమన్న మాటలెండి. నా జబ్బుకి ఎక్కణ్ణుంచి తెచ్చారో, ఎంత అయిందో ఇప్పటికి నాకు చెప్పకుండా ఉన్నారు. అదీ ఆలోచించుకోవాలి" అన్నాది.

"ఆ వూసు నిన్నెత్తొద్దన్నానా? ముందు నీ ఆరోగ్యం చూసుకో. నువ్వేమీ లోభపడకు. కావలసినంత ఓవల్టిన్ను తాగు. తెచ్చిన పళ్లన్నీ తినెయ్యి. పిల్లలకి కూడా పెట్టకు."

"తినకేం చేస్తున్నాను? కాళ్లు జాపుకొని మీ చేత వండించుకొని మరీ తింటున్నాను. ఏదైనా అప్పు అప్పేకదా? మనకింకో విధం ఉంది కనకనా?"

"ఆ వూసు ఎత్తోద్దన్నానా?" అన్నాడు. డబ్బు మాటెత్తగానే వాడికి గాభరా పుట్టింది. జీతం రెండు నెలలదీ కాక రెండువందలకి దాటి ఖర్చు అయిపోయింది. డాక్టరు అశ్వనీదేవత లాగా కాణీ పుచ్చుకోకుండా కాపాడుకొచ్చినా వుత్తమందులకి అయిపోయింది. ధర్మానుపత్రిలో పడేసినా తలకి మించిన ఖర్చు అయింది.

"ఎత్తనులెండి. తీర్చుకొందాం తాపీగా. కూడికకి ఏముంది? నా చేతిలోనే ఉంది."

"సరేలే అలాగే చేతువుకాని" అని వెంకటప్పయ్య పెరట్లోకెళ్లి పోయాడు. వాడికా సంభాషణ పెంచటం ఇష్టంగాలేదు. కాళ్లూ, చేతులూ, మొహం కడుక్కొని వచ్చాడు. తల దువ్వుకొని దుస్తులేసుకొన్నాడు. వీధిలోకి బయలుదేరాడు.

రాజ్యం మళ్లా ఈ ప్రపంచంలో లేదు. చిరచీకటి గదిలోకి ప్రవేశిస్తున్నాది. కిటికీలోంచి సాయంకాలపు వెల్తురు రాజ్యం మొహంమీదపడి బంగారపు పూత పూస్తున్నాది.

వెంకటప్పయ్య రాజ్యం మొహాన్ని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. వాడికి భయం మరి కలగలేదు. చిన్ననాటి ఏ మధుర సన్నివేశాన్నో జ్ఞప్తికి తెచ్చుకొని వొళ్లు పరవశమౌతున్న దనుకొన్నాడు. మొహంలో దేదీప్యమానంగా సంతోషం తాండవిస్తున్నాది.

కొన్ని సంవత్సరాలై రాజ్యం అంత సంతోషంగా ఉండటం వెంకటప్పయ్య చూడ లేదు. కాపరానికొచ్చిన తొలి సంవత్సరం ఇరవై నాలుగు గంటలూ కిలకిల నవ్వుతూ, బంతిలాగా తుళ్లిపాట్లుపడుతూ ఉండేది. సంవత్సరం తిరక్కుండా దాని గుండెలికి చంటికుర్రాణ్ణి వప్పగించి సంసార సాగరాన్ని ఉత్తరించుకువెళుతూ, అవతలదరికి చేరమంది జీవితం! కాపరానికొచ్చి ఆరేళ్లయింది. ముగ్గురు కొడుకులతల్లి అయి ఈదుతున్నాది.

అకస్మాత్తుగా రాజ్యం నోరుతెరిచింది. తల ఓ పక్కకి పెట్టి ఆడిస్తున్నాది. దానిచేష్టకి వెంకటప్పయ్య పకాలున నవ్వాడు. ఆ నవ్వు కోరింత దగ్గులాగా వాణ్ణి వొహంతకు గాని వదలిపెట్టలేదు. రాజ్యం విహాయస వీధుల్లోంచి ఆ నవ్వుతో భూమ్మీదికి వచ్చేసింది.

"ఎందుకూ అంత విరగబాటునవ్వు?" అని మొగుణ్ణడిగింది.

"ఏదీ, మళ్లా నోరు సాగదీసి, మెడవంచి ఆడించు చూస్తాను" అన్నాడు.

"అదా! ఎదురింటిపిల్ల పాడుతున్నాది, వినండి" అన్నాది. రాజ్యం చెప్పాక ఎదురింటి నుంచి సంగీతం వస్తున్నట్లు చెవులకు తెలిసింది. చెవుల్లో గుయ్యిగుయ్యిం మంటున్నా అదేమిటో తెలుసుకోవలసిన అవసరం వాడికి అంతవరకూ కలగలేదు!

"ఓహో! ఇక్కడ సంగీతం వినబడుతున్నదే! అదియా సంగతి! చిన్నప్పుడు నువ్వుచిన్న వాయులీన విద్వాంసురాలివి కదూ! మరచిపోయాను" అన్నాడు.

కామవర్ధని రాగాలాపనతో కంపిస్తూ, పువ్వువెలగ వాసనతో మత్తెక్కి, గాలి బరువుగా గదిలోకి ప్రవేశిస్తున్నాది.

"ఏమర్రోయ్ పిల్లలూ! ఇక్కడ సంగీత కచేరి అవుతున్నాది. వచ్చి వినండి" అన్నాడు. కొడుకులిద్దరూ వీధిలోకికూడా పోయి పాట ఆశ్చర్యచకితులై వింటూ నిలబడ్డారు.

"ఈ యింట్లో సుఖంగా ఉందనుకొన్నాను. కాని ఈ పార్శ్వశూల తప్పదులాగుంది" అన్నాడు.

"శొంఠికొమ్ము తెచ్చుకోండి" అన్నాది రాజ్యం. అతని మనస్సు చివుక్కుమంది. శొంఠిగంధం పూసినట్టు వొళ్లంతా సెగలూ పొగలూ లేచాయి.

"చీకటిపడుతూ ఉంటే ఇప్పుడెందుకూ వీధిలోకి? పెందరాళే అన్నం తిన కూడదూ?" అన్నాది.

"అనుకొంటూ ఉండగా ఆలస్యమైపోతున్నాది. ఇలాగ్గా ఇహనెల్లి పాపపరిహారార్థం ఇక మంచిపని చెయ్యాలి" అన్నాడు.

"పాపాలుకూడా చేస్తున్నారా?"

"పాపం చెయ్యందీ బతుకు వెళ్లలేదు."

పిల్లలిద్దరూ సంగీతం జాగ్రత్తగా వింటున్నారు. వాళ్లకి శ్రవణానందంగానే ఉంది కాబోలు. పిల్లల హృదయాలు నిష్కల్మషంగా ఉంటాయి. స్వభావసిద్ధంగా సంగీతం సమ్మోహ పరుస్తుంది. చిన్న వయస్సునుంచి కాస్తంత రాగతాళ జ్ఞానం కలిగిస్తే జీవితంలో సంగీతం ప్రవేశించి అజన్మాంతం ఆనందహేతువు అవుతుంది.

"ఓహో! మీరు మీ అమ్మకి పిల్లలే. సరిగమల సాంబారు మీకు నచ్చినట్టుందే!" అని వెంకటప్పయ్య వీధిలోకి నడిచాడు.

రాజ్యం మెల్లిగాలేచి స్విచ్చి నొక్కింది. దూలాల మధ్యనున్న గొట్టం క్రమేణా వెలిగి గదినిండా ఆణిముత్యంలాగ కాంతిపడ్డాది. విద్యుద్దీపాలు సిమెంటుడాబా గదుల్లో ఉన్నంత అందంగా పూర్వకాలపు నాలుగిళ్ల లోగిళ్లలో శోభించవు. బూజుపట్టిన పెణకకింద, పట్లతో నిండిన బల్బులా రాజ్యం సంగీతం రెండురోజులు వెలిగి ఫ్యూజు అయిపోయింది. దాని ఫిడేలు మూలపడ్డాది. కమాను విరిగి పెంటకుప్పని చేరింది. జీవితంలోంచి సంగీతం తొలగిపోయినా ఎదురింటి అమ్మాయి పాడుతూవుంటే ఎక్కడలేని సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తున్నాది.

రాజ్యానికి జీవితంలో అసందర్భంగా ఏమీ జరగలేదు. అంతా సవ్యంగానే నడిచింది.

ఆరేళ్లక్రితం రాజ్యాన్ని చూడడానికి పెళ్లివారు వచ్చారు. వాళ్లతో వెంకటప్పయ్య వచ్చాడు. వాళ్ళంతా రాజ్యాన్ని పాడమన్నారు. వాళ్ల నాన్న నాలుగేళ్లయి అవసరంగా సంగీతం చెప్పిస్తున్నందుకు పాడవలసిన శుభముహూర్తం వచ్చింది.

తోడిలో కీర్తన సిగ్గుపడుతూ అందుకుంది. గొంతుకెత్తేసరికి అపశృతి పలికింది. ఉసిలోకి రావలసిన తాళం వేలుమీదకొచ్చింది. వొళ్లంతా జలదరించి పాటంతా గాభరా అయి పోయింది. పాట అపగానే రాజ్యానికి ఏడుపు పర్యంతం అయిపోయింది.

కాని వచ్చిన పెళ్లిపెద్దలు పాటకు సెహబాస్ అన్నారు. తెలుగు పెద్దలకి శృతీ, అపశృతీ తెలియవని, రాగ తాళ జ్ఞానం వాళ్లకుండదని, వాళ్ల జీవితాలలో సంగీతం లేనేలేదని అమాయకపు పెళ్లికూతుళ్లకి ఏమితెలుసు!

"మీ అల్లుడు ఉద్యోగం చెయ్యక్కర్లేదు" అన్నాడొక పెళ్లిపెద్ద. రాజ్యం వాళ్ల అజ్ఞానానికి లోలోపల నవ్వుకొంది.

వెంకటప్పయ్య రాజ్యాన్ని మనసారా అంగీకరించే పెళ్లిచేసుకొన్నాడు. పేరు వెంకటప్పయ్య అయినా వెంకటప్పయ్య అల్లాటప్పయ్య కాడు. పెళ్లి నిశ్చయంకాగానే రాజ్యంకూడా తను అదృష్టవంతురాలిననే అనుకొంది. వెంకటప్పయ్య పెళ్లినాటికి పట్టపగ్గాల్లేని ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి పట్టభద్రుల్లో ఒకడు! చెన్న రాష్ట్ర ప్రభుత్వపు డెబ్బయి రెండు రూపాయల ఎల్.డి. గుమాస్తాలలో ఒకడు.

పెళ్లయిన కొత్తలో వాళ్ల కోడలు రాజ్యం మాబాగా పాడుతుందని ఊళ్లోవాళ్లు పేరంటానికి వెళితే బలవంతంచేసి పాడించేవారు. మొగుడు ఒక్కనాడు పాడమనలేదు. తాను పాడనూలేదు.

సిగ్గువదలి అత్తవారింట్లో తనకి తాను నోరెత్తి పాడుకొనే సమయం రాకుండానే పుట్టిమునిగి పోయినట్టు వేవిళ్లతో పుట్టింటి కెళ్లింది. దాంతో ఆడజన్మ సార్థకమైంది.

వసారాలో పిల్లలు గందరగోళం ప్రారంభించారు.

"ఎందుకర్రా అలాగ పీక్కుతింటారు? ఇలాగ రండి" అన్నాది. కుస్తీలు పడుతున్న కొడుకు లిద్దరు తల్లిదగ్గరకొచ్చారు. ఐదేళ్లవాడొకడూ, నాలుగేళ్ల వాడొకడూ.

"తమ్ముడు నిద్రపోతున్నాడా?" అనడిగింది.

"గుర్రు పెడుతున్నాడు" అన్నాడు పెద్దవాడు.

"అల్లరిచేస్తే లేచిపోడూ?" అన్నాది. పెద్దవాడు కొంటెగా నవ్వాడు. ఇద్దరూ పొరపాటు చేస్తున్నట్టు మొహాలు పెట్టారు.

"ఎదురింటి అమ్మాయి హాయిగా పాడుతున్నాది. కూచుని చక్కగా వినండి" అన్నాది. వాళ్లు బుద్ధిగా కూచున్నారు. పిల్లలని సముదాయించడం, శాంతంగా సబవైన మాటలుచెప్పి అల్లరి చేయకుండా చెప్పినట్లు వినేటట్టు చెయ్యడం, మొహంమీదకి పొగరాకుండా పొయ్యి ఊదడం మొదలైన విద్యలన్నీ రాజ్యం అవలీలగా నేర్చుకొంది.

ఎదురింటి అమ్మాయి స్వరకల్పన ప్రారంభించింది. స్వరాలు సెలయేళ్లలాగ ప్రవహిస్తూ, మధ్య మధ్య జలపాతాల్లాగ తిరగబడి ఘోషిస్తున్నాయి. గాత్రం తారస్థాయికి లేపి గాంధారంలో నిలుపుతూ కల్పన చేస్తున్నాది.

రాజ్యానికి ఏనుగంత సత్తువ వచ్చింది. నిత్యజీవితంలో ఆనందానికి, ఆరోగ్యానికి సంగీతం అవసరమే. తాను పాడలేకపోయినా అర్థం చేసుకోగలిగితే ఉత్తమ సంగీతం మంచిని చేస్తుంది.

అడ్డంగా పానకంలో పుడకలాగ ఎదురింటి అమ్మాయి తమ్ముడు కాబోలు వచ్చాడు.

"గిమపదని ఓజగ...

సరిసనిపదని ఓజగ...."అని గొంతుక చించుకొని అపశృతిలో స్వరాలు వేశాడు. ఆ అమ్మాయి తంబూరా, పాటా ఆపేసింది.

"వెధవా! సంగీతం నేర్చుకోమంటే రావుకానీ అల్లరికి సిద్ధం" అన్నాది.

"నేను స్వరం సరిగ్గా వెయ్యలేదూ?" అని ప్రశ్నించాడు.

"నాన్న రానీ, చెపుతాను" అన్నదా అమ్మాయి. "దానిపనినరి సానిదాని పదనిఓజగ...!" అంటూ కుర్రవాడు మరోస్వరం వేశాడు. అపశృతిలోనైనా కుర్రాడు స్వరాలు సరిగ్గానే పట్టుకు వేస్తున్నాడు. వాతావరణంలో సంగీతం ఉంటే వాసాలుకూడా పాడతాయి. అందులో గగనం లేదు.

"నాన్నరానీ వెధవా"! అని ఆ అమ్మాయి సంగీతం ఆపు చేసేసింది. రాజ్యానికి వొళ్లు మండిపోయింది. ఆ పిల్ల అన్నీ తనకొచ్చిన రాగాల్లో కృతులే పాడుతున్నాది.

"కొంచెంసేపైనా ప్రాణం హాయిగా ఉంది. ఇహనైంది సంగీతం" అన్నాది రాజ్యం.

"ఇంక పాడదేంటమ్మా?" అని పెద్దకొడుకు అడిగాడు.

"అదిగో మీలాటి అల్లరి కుర్రవాడువచ్చి కంగాళీచేస్తే కోపంవచ్చి పాట మానేసింది."

"ఎలాగమ్మా పాడుతున్నాది?"

"నేర్చుకొని పాడుతున్నాది."

"నువ్వు పాడతావూ?"

"ఓ పాడతాను. నీకు చెప్పమన్నావా?"

"ఛీ! మొగాళ్లు పాడరు."

"మొగాళ్లూ పాడతారమ్మా నీకు చెప్పమన్నావా?"

"ఏదీ చెప్పు."

"తరవాత చెపుతాలే" అని రాజ్యం కాళ్లుజాపి గదిలో అడ్డంగా పడుకుంది.

"ఒరే పెద్దాడూ! కాళ్లు పట్టుబాబూ" అంది. పెద్దవాడు మెల్లిగా కాళ్లు గుద్దుతూ కూచున్నాడు.

"నేను చేతులు గుద్దుతానమ్మా"! అంటూ రెండో వాడు చేతులు గుద్దుతూ కూచున్నాడు.

రాజ్యం కళ్యాణి కృతి అనుకొంటూ పడుకుంది. అంతా మరచిపోయింది. నంగతులు చిక్కుపడ్డ కురుల్లాగ అవకతవక అయిపోయాయి.

"నువ్వా పిల్లలాగ పాడ్డంలేదు" అన్నాడు పెద్దవాడు.

"అంతా మరచిపోయానురా"! అన్నాది. పెరటి వసారాగూట్లోంచి సిబ్బి కిందపడి వికారంగా చప్పుడై గదిమూలలన్నీ గుయ్యిపెట్టాయి.

"కుక్క కాబోలు కొట్టండి. గూట్లో అన్నం మండబెట్టింది కాబోలు!" అన్నాది రాజ్యం. కొడుకులు పరిగెట్టారు.

"కుక్క కాదమ్మా పిల్లి. అన్నంగిన్నెమీదా సిబ్బి తిరగదోసింది" అన్నాడు పెద్దవాడు.

"నయమే. మళ్లా వండుకోకుండా. కుక్క ముట్టుకున్నకూడా తినవలసిన రోజులు. తలుపులు గడియ పెట్టిరావొద్దూ?" అన్నాది రాజ్యం.

"నువ్వే వచ్చి సంగీతం వినమన్నావు" అన్నాడు పెద్దకొడుకు.

"ఔనమ్మా! నేనే మిమ్మల్ని రమ్మన్నాను. కాని తలుపులు వేసి రావాలి. తెలిసిందా!" అని మెల్లిగా చెప్పింది.

వెంకటప్పయ్య తిరిగి వచ్చేశాడు.

"పెరట్లో వెన్నెలా, పువ్వువెలగ వాసన మహబాగున్నాయి" అన్నాడు వెంకటప్పయ్య.

"అప్పుడే వచ్చేశారేం?" అన్నాది రాజ్యం.

"పనై పోయింది".

"పాపపరిహారం అయిందా?"

"కొంచెం అయింది".

"ఈ మధ్య ఎక్కడికో వెళ్లారు కాబోలు!"

"రామ రామ!"

"మీ మాటల వాళకం అలాగుంది"!

"ఛీఛీ!"

"అమాట అనలేనులెండి."

వెంకటప్పయ్య కండువాలో దాచి చంకక్రింద ఏదో పెట్టాడు. గుండ్రంగా పేపరుచుట్టి ఉంది.

"ఏమిటిది?" అన్నాది రాజ్యం.

"విప్పి చూపిస్తాను కదూ".

లోపల బాగా నాలుగువేళ్ల వెడల్పు చుట్టుజరీ అంచు చీర ఉంది. దానికి తగ్గ పట్టు రవి కలగుడ్డా ఉంది. మహారాణీ మొదలు మామూలు మహిళదాకా ప్రతి ఆడదీ మెచ్చుకునే చుట్టుజరీచీర.

"కొన్నారా?"

"కొన్నాను. ఉన్నడబ్బుకాస్తా అయిపోకుండా కొనేశాను."

"డబ్బెక్కడిది?"

"చెపితే నువ్వు నన్ను క్షమించవు".

"ఏంచేశారండీ?"

"ఏమీ అననని చేతిలో చెయ్యివెయ్యి" అన్నాడు. ముందుకు చెయ్యి జాపాడు. వాడి చెయ్యి వణుకుతున్నాది. రాజ్యం చేతిలో చెయ్యివేసింది.

"అలాగ వాణికిపోతున్నారేం? ఏం చేశారండి? దొంగతనం చెయ్యలేదుకదా?"

"అంతకన్నా హీనమైనదే. నీకు టైఫాయిడు మళ్లా తిరగబెట్టింది కదూ! నాకు ఆశలన్నీ ఉడిగిపోయాయి. స్నేహితుడొకడు ఇంటికివచ్చి చూసీచూడ్డంతో సలహా ఇచ్చాడు. తెగించి వాడికిచ్చేశాను."

"ఏమిటిచ్చేశారు?"

"నీ కింకా తెలియలేదు. వాడే పట్టుకెళ్లి రెండువందల ఏభైకి అమ్మేశాడు. అంతడబ్బు వస్తుందని కలలోకూడా అనుకోలేదు. పాతదనుకున్నాను. పాతదానికే విలువ ఎక్కువట!"

రాజ్యానికి అర్థమైంది. గది నాలుగుపక్కలా కలియజూసింది.

"ఇహ నువ్వు చూడనక్కర్లేదు".

"వెళ్లిపోయిందా?" అని దీర్ఘంగా నిట్టూర్చింది.

"నీకు కష్టంగా ఉంటుందని తెలుసు. నేను చేసింది తప్పే!" అని నేరస్తుడిలాగ మొహం పెట్టుకున్నాడు. మొగుడి మనస్సు బాధపడుతున్నాదని గ్రహించి తన విచారాన్ని క్షణంలో దిగమింగుకుంది.

"ఏ తప్పూ చెయ్యలేదు. ఏ సంసారైనా అదే చేస్తాడు. చెయ్యవలసి వచ్చి చేశారు. మీరేం తినేశారా?"

"మనకంతా మొగపిల్లలే కదా అని ధైర్యం చేశాను".

"పోనియ్యండి, నానోరు ఏనాడో నొక్కుకుపోయింది. ఇహనా ఫిడేలు ఉండి నన్ను రక్షిస్తుందా? సరస్వతీ కటాక్షం నా కంతే ఉంది. తల్లి వెళ్లిపోయింది. వెళ్లిపోతూ తల్లి తల్లిగుణాన్ని చూపించుకొంది. నాకు ప్రాణం పోసింది. వెళ్లిపోతూ నాకో చీరా రవికలగుడ్డా పెట్టింది" అని గుడ్లనిండా నీళ్లు నింపుకొంది. ఎదురుగుండా ఉన్న చీరని రాజ్యం విప్పయినా చూడలేదు.

"నాలుగు కాలాలపాటు ఉంటుందికదా అని కొనేశాను" అని చీర సగం విప్పేసి రాజ్యం భుజంమీద కప్పేశాడు వెంకటప్పయ్య.

"జ్ఞాపకంగా ఉంటుంది లెండి!" అన్నాది రాజ్యం.

❋

భారతి, 1952

కుక్కుటేశ్వరము

బక్కచిక్కిన ముసలమ్మ అస్థిపంజరం కట్టెపురుగులాగ ఊగిసలాడ్డం మొదలు పెట్టింది. పత్తిభోగల్లాటి కళ్లెత్తి చూసింది. ఆ కళ్లకి చత్వారం లేదు. మధ్యకాలంలో వచ్చిన చత్వారం మధ్యకాలంలోనే పోయింది. ముసలమ్మ చూసీ చూడ్డమే పోల్చింది. ఒక నిట్టూర్పు విడిచి ఈశ్వరుణ్ణి తలచుకుని మనస్సు కట్టుదిట్టం చేసుకొంది.

"ఎవరివి నాయనా నువ్వు?" అని, తనే కాస్త బంధుత్వం కలుపుతూ ప్రశ్నించింది.

"మనం మనం పాతవాళ్లమే. మళ్లావచ్చా ముసలమ్మా!" అన్నాడు ఎదురుగుండా ఉన్న ఉద్యోగస్తుడు. ఏమిటి సాధనం? శ్రీమన్నారాయణ మూర్తీ! అని దేవుణ్ణి సంబోధించుకుంది. కుక్కుటేశ్వరుడి ఆజ్ఞ లేనిదే కుక్కయినా మొరగదు అని ధైర్యం చెప్పుకుంది.

"లే!" అని గద్దించాడు ఉద్యోగస్తుడు. ముసలమ్మ లేస్తే నేరమే. లేవకుండానే వాణ్ణి సాధించాలి. లేవడానికి కాళ్లలో సత్తువ వాస్తవంగానే తప్పిపోయింది. ముసలమ్మ ముసుగు సవరించుకొంది. పైట చెరుగు తీసి ఒళ్లంతా కప్పుకుంది.

"నన్నెందుకు నాయనా లేవమంటున్నావు? టిక్కట్టు కొనుక్కున్నాను" అని అమాయకురాలి లాగా మొహం పెట్టింది. మొల్లో చెంగు కొసతీసి వెయ్యిముళ్లలో ఓ ముడిని విప్పుతున్నాది.

"పీటముడి ఊడిరాకుండా ఉంది" అన్నాది.

"రైలు ఆగనీ, చూద్దాం తాపీగా" అని ఉద్యోగి ఎదురు బెంచీమీద బైఠాయించాడు. జేబులోంచి కేప్‌స్టను సిగరెట్టు పెట్టె పైకితీశాడు. తాపీగా సిగరెట్టుతీసి ముట్టించాడు. అధికార అహంకారంతో రైల్లో ప్రయాణీకులందరివైపు ఒకసారి చూశాడు.

ముసలమ్మ కొంగుముడి మరి విప్పలేదు. ఇహ నెందుకు! రైలు టిక్కట్టు! ఆ అంగుళన్నర అట్టముక్కా చేతిలో ఉంటే ఎక్కడికైనా పోవొచ్చు! అదంటూ ఉంటే తెల్లారేసరికి శ్రీజగన్నాథం పోయి స్వామి వారిని ధూళిదర్శనం చేసుకోవచ్చు.

రాత్రి పదకొండు కాకుండానే బరంపురంలో దిగి కూతుర్నీ, పిల్లల్నీ, అల్లుణ్ణీ చూసుకోవచ్చు! దానికి గతిలేకే ముసలమ్మ ఎనిమిదేళ్లయి కూతుర్నీ పిల్లల్నీ చూడలేకపోతున్నాది.

కూతురి పిల్లలు, తానెరిగిన ముగ్గురూ కళ్లకి కడుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం కూతురికి మూడో పురుడు పొయ్యడానికి ముసలమ్మ బరంపురం వెళ్లింది. మూడోపురుడు పుట్టింట పనికిరాదని కొడుకు చెల్లెల్ని తీసుకొచ్చాడు కాదు. తరువాత కొడుకుని అనీ ప్రయోజనంలేని రోజులు వచ్చాయి. ఎనిమిదేళ్లయి కాలం వక్కలాగ మండిపోతున్నాది. అందులోకి నాలుగేళ్లయి మరీ అధ్వానమైపోయింది.

తాను పురుడుపోసిన చంటిగుడ్డుకి ఇప్పుడు ఎనిమిదేళ్లు! ఆ తరువాత కూతురు మరి ఐదుగురు పిల్లల్ని కనుక్కొంది. బరంపురానికి రానూ పోనూ టిక్కట్టుకి కాస్తా కూస్తా అవుతుందా? టిక్కట్టు లేకుండా దగ్గర ప్రయాణాలే ప్రమాదకరం. ఇంక బరంపురం ఎక్కడ వెళ్లగలదు! ముసలమ్మ చెవుల్లో కేరుకేరుమని చంటిగుడ్డు ఏడుపు వినబడుతున్నాది.

గోదావరి మండలం అంతర్ధానమైపోతున్నాది! పొలాలు సస్యశ్యామలంగా ఉన్నాయి. ఈన సిద్ధంగా ఉన్న వరిచేలు పరుగులు పెడుతున్నాయి. పొలాలనిండా నీటితో నింపి ఏలేరుతల్లి పరిపాలిస్తున్నాది. తరతరాలబట్టి పితృదేవతలంతా ముసలమ్మకి అన్ని వంకలవారూ దరిద్రాన్ని పంచిపెట్టుకొచ్చారు కాని కాస్తంత మట్టిబెడ్డ సంపాదించి పెట్టలేదు.

రైలు వాయువేగ మనోవేగాలతో పరుగెడుతున్నాది. పడమట మూలనుంచి కొండలు హారాలు హారాలుగా పరిగెట్టుకు వస్తున్నాయి. మేఘాలు మందలు మందలుగా వచ్చి చిక్కబడుతున్నాయి.

ఎదురుగా ఖరోడాలాగా ఉద్యోగి కూచున్నాడు. ఎదురుగా ఉన్న ఉద్యోగి అక్కడ ఉన్నాడా? భ్రాంతా? చల్లటిగాలి ప్రాణానికి హాయిగా వీస్తున్నాది.

"నువ్వెవరబ్బాయివి నాయనా?" అని ముసలమ్మ ఉద్యోగిని అడిగింది. వాడు అతి దగ్గర బంధువు అయిపోకూడదూ?

"మా అమ్మ కొడుకునే!" అని వెటకారంగా నవ్వాడు.

"మీరంతా అమ్మ కొడుకులే కాని..." అని లోలోపల గొణుక్కుంటూ పళ్లు కొరుక్కుంది. ముసలమ్మకి ఒక్క పన్ను ఊడలేదు.

"పళ్లు కొరుకుతున్నావేం?" అని హుంకరించాడు.

"వొణుకు సంకటం, పళ్లు కొట్టుకొంటాయి. మరేం విషప్పళ్లు కావులే" అన్నాది.

ఎదురుగా ఉన్నది రజ్జువుకాదు సర్పమే. పగబట్టిన నాగుపాము. ముసలమ్మని జ్ఞాపకం పెట్టుకునే ఉన్నాడు ఉద్యోగి. వాడికి గతనెల్లో పట్టుబడ్డాది. అప్పుడు సగం అన్యాయం, సగం న్యాయంచేశాడు. డబ్బు మాత్రం పన్నెండు రూపాయలు గోదావరిపాలు అయింది.

పన్నెండు రూపాయలంటే మాటలా? ఆ పన్నెండు రూపాయలూ ముప్పైయారు రూపాయలకింద లెక్క. ఏడేళ్లయి వాళ్లింట్లో రాత్రిళ్లు భోజనాలులేవు. నిత్యం శనివారమే. పిల్లలకీ పెద్దలకీ కూడా శనివారమే. ఈ నష్టంనుంచి మూడేసిరోజులకొక ఏకాదశికూడా ఆ నెలలో చేశారు. ఆ పుణ్యమంతా ఈ ఉద్యోగే మూటకట్టుకున్నాడు. గతనెల కొంపలో అంతా మంగలంలో

పేలాల్లాగ పేలిపోయారు. ఇవాళ మళ్లా భీక్షించుకు వచ్చాడు. ఈ మాట అందర్నీ మహమ్మాయి జేస్తాడు.

ఉద్యోగి సిగరెట్టుమీద సిగరెట్టుతీసి ఒకదానికొకటి అంటించుకొని ఊదేస్తున్నాడు. రొజ్జుగాలికి సిగరెట్టు అంటించీ అంటించడంతో సగానికి రాజుకు పోతున్నాది.

"కోపం తెచ్చుకోక ఒక్కమాట చెబుతాను వింటావా?" అన్నాది.

"మాకెందుకండి కోపం? మా డ్యూటీ మేము చేస్తాము" అని సౌమ్యంగా జవాబు చెప్పాడు.

"నన్నుపట్టుకొంటే నీకేం కలిసొస్తుంది?"

"ప్రభుత్వానికి కలిసివస్తుంది. అందుకే మాకు జీతం ఇస్తున్నాది."

"కుడీ ఎడమా లేదా?"

"ఉన్నాయి, మీరు చేస్తున్న పని తప్పుకాదా?"

"మా వంటివాళ్లు చేసినా తప్పే?"

"తప్పే. ఇక్కడ ప్రభుత్వం ఉంది. నేరస్తులు శిక్షించబడతారు" అన్నాడు. ఇక్కడ ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ శాసనం ప్రకారం ఇక్కడి బండి చక్రాలు నడవాలి! ముసలమ్మ ప్రభుత్వాన్ని కూలద్రోసి ధిక్కరిస్తున్నాది!

"ఎందుకమ్మా గొడవ? ఆయనకేదో పారెయ్యరాదూ, పోతాడు" అని ఒక ప్రయాణీకుడు ఆఖరికి వినివిని కలుగజేసుకొన్నాడు. ముసలమ్మ వళ్లు మరచిపోయింది.

"నా దగ్గర రొక్కం చిల్లిగవ్వలేదు. ఉన్నదంతా వాళ్ల ఎధానకొట్టి వచ్చాను. గడ్డితినే పశువులంతా అధికారులైనాక వాళ్ల నోట్లో ఇంత గడ్డికుక్కితే ఊరుకుంటారని ఎంత ముసలమ్మనయినా ఎరుగుదును. నా దగ్గర ఉండిచావందే!" అన్నాది ముసలమ్మ.

"నోటికొచ్చినట్లు మాట్లాడకండి. నేనెవర్నో తెలుసా?" అన్నాడు ఉద్యోగి. వ్యవహారం శృతిమించుతున్నాది.

"ఊరుకోవమ్మా, నువ్వు గడ్డితింటూ అందరికి గడ్డి పెడతానంటావు!" అన్నాడు, ఇంకో ప్రయాణికుడు.

"ఔను. నేనే గడ్డి తింటున్నాను. మీరంతా ప్రభువులు అయినాక ప్రజలు గడ్డి తినక అన్నం ఎక్కడ తింటారు? గడ్డికూడా కాదు నాయనా! మన్నే తింటున్నాము. కడుపునిండా తినాలంటే మన్నొక్కటే ఉంది" అన్నాది ముసలమ్మ.

"మన్నుమాత్రం మనదిటమ్మ? అదీ తేరగా లేదు. మట్టిపెల్లా మనదికాదు. కామందులు ఊరుకుంటారా? మట్టి తీసినా దొంగతనమే" అన్నాడొక ప్రయాణీకుడు.

"నీ కడుపు చల్లగా! నిజం చెప్పావు నాయనా!" అన్నాది ముసలమ్మ.

"ముసలమ్మా! ఆయనకో రూపాయి పారెయ్యి". అన్నాడు మొదటి ప్రయాణీకుడు.

"అవకతవక మాటలాడవద్దు" అన్నాడు ఉద్యోగి.

"ఎందుకయ్యా! అంత పట్టుదల. మూలనున్న ముసలమ్మని పట్టుకున్నావు ఎలాగై తేనేమి!" అన్నాడు ప్రయాణీకుడు.

"మీమీదా కేసు పెట్టమన్నారా?"

"ఎందుకయ్యో!"

"ఎందుకా? నా డ్యూటీ చేసుకోకుండా అడ్డం వచ్చినందుకు. తెలిసిందా?" అని మరో సిగరెట్టు తీసి సిగరెట్టుకే అంటించుకొంటున్నాడు.

"నీ లాంటివాళ్లని నా తలమీద ఎన్ని వెంట్రుకలున్నాయో అంత మందిని చూశాను. శ్రీరంగనీతులు చెప్పకు. చూస్తూ ఉంటే కేప్స్టను సిగరెట్లు అలాగ ఊదేస్తున్నావు! నీవు నీ జీతంమీద బతుకుతున్నావా?" అని ఎర్రగా చూశాడు ప్రయాణీకుడు. ఉద్యోగికి మొహంమీద కొట్టినట్లు జుమాయించింది.

"సరే, సరే చెపతాను" అని లేచి తలుపు దగ్గరికిపోయి తల అవతలకి పెట్టేసుకున్నాడు. మేఘాలు గుంపులుగా గుమిగూడుతున్నాయి. కొండలు పరిగెట్టుకుంటూ దగ్గరకొస్తున్నాయి. సుఖమైన గాలి వీస్తున్నాది. ఉద్యోగి వొళ్లు చల్లబడుతున్నా బుర్రలో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎంత మాట అన్నాడు ప్రయాణీకుడు! ఇప్పుడంతా మొహమ్మీద అనేస్తున్నారు. ప్రజలు బొత్తిగా బరిదిగి పోతున్నారు. అధికారంలో ఉన్న ఎవరు మానేశారు? మడికట్టుకు కూచుంటే మడిమాన్యాలు సంపాదించగలరా? చేతనైన వాడు చేతినిండా పుచ్చుకోవల్సిందే.

ప్రయాణీకుడితో జట్టీ పెంచుకోవడం ఉచితంగా వాడికి తోచలేదు. చాపకింద నీరు లాగా తన పని తాను చేసుకోవాలి! రచ్చపడకూడదు. సిగరెట్టు మళ్లా కొసకొచ్చేసింది. మరో సిగరెట్టు తీసి ముట్టించడానికి ధైర్యం చాలిందికాదు. ప్రయాణీకుడి మాట వాణ్ణి పిరికిపందని చేసేసింది. అతనెవడో! అంత ధైర్యంగా చీవాట్లు పెట్టాడు! అటువంటి వాళ్లతో జట్టీ ప్రమాదకరమౌతుంది. ఇంకో సిగరెట్టుకోసం నరాలు పీక్కుతింటున్నాయి. తీసి మళ్లా ముట్టించాడు. కాని సిగరెట్టు ప్రయాణీకులకి కనబడకుండా చేతిలో మూసుకు పట్టుకున్నాడు.

కొండలు, కొండలమీద మేఘాలు మనోజ్ఞంగా ఉన్నాయి. చుట్టూ పత్తి, మిరపపొలాలు తివాసుల్లాగ పరుచుకుని ఉన్నాయి. కొండలనిండా రంగులు తేలుతున్నాయి. ఆకాశమంతా ఊదారంగు వ్యాపించింది. ఉద్యోగి మనస్సులో భీతాహం పోయింది.

ఎదురుగుండా కొండలన్నీ వాడెరుగును. పిట్టలమాటు, పులిమాటు తను వెళ్లి చూసినవే. చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా అనుభవిస్తున్నది దేవేంద్రభోగమే. ఐశ్వర్యం వొచ్చి మీదపడి పోతున్నాది. ఒహాడు తిడతాడని, ప్రపంచం హర్షించదని పెట్టుకున్నంత అవివేకం లేదు. వెయ్యితాపులయినా ఒక బూరెముక్కకి సాటికాదని పూర్వుల మతం. ఎవరెన్ని శాపాలు పెట్టుకొన్నా తలుపులమ్మలోయకి పైరువంటిది అవుతుందా?

ఉద్యోగి పదిమంది మిత్రులతో కలిసి తలుపులమ్మలోయకి షైరు వెళ్ళాడు. అక్కడి ప్రకృతి రమణీయత వర్ణనాతీతం. ఎంత మండువేసవి అయినా శీతలంగా ఉంటుంది. రాతిలోంచి సదా జల వస్తూ ఉంటుంది. సన్నని జలధార. అమృత సమానమైన జలము. అక్కడ హాయిగా బంగాళాలు కట్టుకుని ఈ ధనికులంతా తమ తమ వేశ్యలతో కొంతకాలముండి ఎందుకు సుఖపడరు! అని ఉద్యోగికి ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది.

తలుపులమ్మలోయకి వెళ్ళిన మిత్రులంతా అనుభవించదానికి వెళ్లారు. వాళ్లు ఒంటరిగా వెళ్ళలేదు. పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామాలనుంచి ఏరుకొని వెలయాళ్లని వెంటబెట్టుకు వెళ్లారు. మిఠాయి పొట్లాలు, పళ్లతట్టలు, పుల్లావు సామాను మోసుకుపోయారు. వాళ్లకి వొక్కటే లోపం వచ్చింది. బర్గండివైన్ ప్రయత్నిస్తే దొరికిందికాదు. బ్రాందీమాత్రం కావలసినంత లభ్యమైంది.

ఉద్యోగం అంటూ ఉండబట్టి, అందులో వీలు ఉండబట్టి, తలుపులమ్మలోయలో, మరుపురానిరోజు సాధ్యమైంది. ఎంతమందో స్వప్నంలో కోరుకొనేది వాడికి జీవితంలోనే ఇంద్రధనుస్సులాగ ప్రకాశిస్తున్నాది.

నీలమేఘాల మధ్యని తెల్లగా, రాజహంసలాగ మెరుస్తూ కనబడ్డాది అన్నవరం సత్యనారాయణమూర్తి ఆలయం. ఉద్యోగి నోట్లో సిగరెట్టుతీసి పారేశాడు! రెండు చేతులూ తీసి కొండమీద దేవుడికి నమస్కారం చేశాడు. ఈ ఉద్యోగంవచ్చి, ఈ నాటికి వచ్చినది లగాయతు ఏటా కొండ ఎక్కి సత్యనారాయణ వ్రతం చేసుకొంటున్నాడు. లక్షలకి లక్షలు, వేలకి వేలు డబ్బు పోగుచేసుకొన్న వాళ్లంతా ఈ మధ్య కొండ ఎక్కి తరచు వ్రతాలు చేస్తున్నారు. సత్యనారాయణమూర్తి వాళ్లందరికీ బాగా దాఖలా ఇస్తున్నాడు.

"తలుపులకి అడ్డంలే నాయనా! దేముణ్ణి చూసుకొంటాను" అన్నాది ముసలమ్మ. ఉద్యోగి కిక్కురుమనకుండా అడ్డం లేచిపోయాడు. బెంచిమీద కూచొని దేవాలయాన్ని చూస్తూ మనస్సంతా భగవదర్పితం చేసుకొంటున్నాడు.

అన్నవరం రైలు స్టేషనులోంచి రైలు పోతున్నాది. ముసలమ్మ కొంగలాగ మెడ సాగదీసుకొని ఎగిరి ఎగిరి చూసింది. అన్నవరం స్టేషనుకెదురుగా తుమ్మ అడవి ఉంది. ముసలమ్మకి కంటకాలతో సహా గుబురుకొన్న తుమ్మడొంకలు కనబడ్డాయి.

"నువ్వు కనబడవు. కంటకాలే కనబడతాయి. మా పక్క చూడవు. కొండెక్కి కూచున్నావు" అని ముసలమ్మ సత్యనారాయణమూర్తితో చెప్పింది.

రైలుకి విరాళమెత్తింది. కొండల మధ్య మార్గం. చక్రాల మోతకి చెవులు చిల్లులు పడుతున్నాయి.

"భగవంతుడికి దయ లేదు; నరుడికీ దయ లేదు" అన్నాది ముసలమ్మ.

"ఆ సత్యనారాయణమూర్తి సన్నిధానంలో చెబుతున్నాను. చిన్నవాడివయినా నీ కాళ్లు పట్టుకొంటాను. పాపం ఒడికట్టుకోకు. నా కొడుకు స్కూలు మేష్టరు. ఏభై రూపాయలిస్తారు.

వాడి కారుగురు పిల్లలు. వాడిపీక మీదికి నేనొహత్తెనున్నాను. నన్ను పట్టుకొన్నావా ఈ నష్టం వాడికి తగులుతుంది. ఇంతమంది ఉసురూ పోసుకోకు" అని మునలమ్మ చెప్పింది. ఉద్యోగికి తేళ్లూ జెర్రులూ పాకినట్టుంది. మునలమ్మ సత్యనారాయణమూర్తి పేరు ఉచ్చరించకుండా ఉంటే బాగుండేది. కరుకుగా ఉండడమే వాడి స్వభావం. స్వభావానికి విరుద్ధంగా మునలమ్మ వ్యవహారం పరిణమించింది.

"ఇంకా ఎందుకయ్యా! మునలమ్మ మీద పట్టిస్తావు. తుని కూడా దగ్గర పడ్డాది. ఏదో తుని తగువు చేసేయి" అన్నాడు ప్రయాణీకుడు.

"నేను వొదిలితే మిగతావాళ్లు వొదులుతారా?" అన్నాడు.

"ఆ పాటి చెప్పలేవా?" అన్నాడు ప్రయాణీకుడు. రైలు రెండు నిమిషాలు కూత పెట్టింది. దాని పరుగులో మార్పు వచ్చింది. తిరగబడేటట్టు అటూ ఇటూ వూగుతూ పట్టాలు మారుతున్నాది. క్రమేణా వేగం తగ్గుతూ తుని ప్లాటుఫారము మీద ఆగింది.

ఎక్కే జనం దిగే జనం. తొడతొక్కిడి అయింది. బండిలోకి తోసుకుని మరో నలుగురు యమదూతలు ఎక్కారు.

"మునలమ్మా! మళ్లావచ్చా!" అని పలకరించారు. దానికింద దవడ వేళ్లాడి పోయింది. నలుగురూ చుట్టబెట్టేశారు. ఉద్యోగి మునలమ్మని వొదిలిపెట్టమని వాళ్లతో చెప్పలేదు! తానేదో లంచంతీసుకొని ఉంటాడని వాళ్లు భావిస్తారు. వొంతు అడుగుతారు! మునలమ్మని అప్పచెప్పి వెళ్లిపోయాడు.

"ఏయ్ మునలమ్మా! ఒక్కసారి లేచి నిలుచో" అన్నారు చుట్టవేసిన ఉద్యోగులు. ఇహ లాభంలేదు. కళ్లు చీకట్లుకమ్మి చుట్టూ అయోమయం అయిపోయింది. కొత్తగా ఎక్కిన ప్రయాణీకులంతా మునలమ్మ చుట్టూ దడి గట్టి నిలుచున్నారు.

"మునలమ్మా! ఈ పని బాగుందా?" అని అడిగారు. మునలమ్మ నోరు లేవలేదు.

"ఇది రెండవసారి కదూ!" అన్నారు

"ఆరుగురు పిల్లలు! కడిగేసిన ఏబై రాళ్లు, తొమ్మండుగురం బతకాలి" అంటూ దవడలు ఆడించింది.

"మరో ఆరుగుర్ని కనుక్కోండి" అని వొకడు మహా వెటకారంగా నవ్వాడు.

"ఒకసారి క్షమించారు. ఇహ క్షమించకండి. బతకడం నేరంగా ఉంది" అన్నాది మునలమ్మ.

"తప్పు పని చేస్తే నేరమంటారు". అన్నాడు ఉద్యోగి.

"ధర్మదేవతకి ఉన్న కాళ్లు విరగ్గొట్టేశారు. ధర్మపన్నాలు నెరుపుతున్నారు" అన్నాది మునలమ్మ.

"ధర్మపన్నాలు వల్లెవేయకు! లే" అన్నాడు ఒక ఉద్యోగి. మునలమ్మ లేవలేదు.

"లేస్తావా లేవగొట్టమన్నావా?" అని అశనిపాతంలాగా అరిచాడు ఒకడు. ఇహ మునలమ్మ కూర్చోలేకపోయింది. అడుగునుంచి యేదో శక్తి పైకి లేవదీసింది. లేచి నిలబడ్డాది. మునలమ్మ నేరాన్ని కింద వేసుకొని సుఖంగా కూర్చుంది.

"నాది కాదను" అని ఒకరు పక్కనుంచి సలహా ఇచ్చారు.

"వొదలిపెట్టే" అని మరొకరు సలహా ఇచ్చారు.

"వదిలేసి ఏ యేట్లో పడను?" అని ముసలమ్మ వాళ్లని ప్రశ్నించింది.

"దాంట్లో చిక్కు నీకు తెలియటంలేదు" అని ఇంకొకరు చెప్పారు.

"నేను దొంగతనం చెయ్యలేదు. నా కొడుకు చెమటోడ్చి గడించుకొన్న డబ్బుతో కొనుక్కున్నాను" అని ముసలమ్మ ఏడుపు మొహం పెట్టింది.

"ఈ సాకులు మాకు తెలుసు. నడవ్వమ్మా" అన్నాడు ఉద్యోగి.

ముసలమ్మ కడవలతో కన్నీళ్లు కారుస్తూ నిలబడ్డాది.

"నంగనాచిలాగ ఏడవక, లే" అన్నాడు ఉద్యోగి.

"కడుపునిండా పెట్టరు. ఉన్నచోటికెళ్లి కొనుక్కోనివ్వరు. ఈ నాటికి బియ్యం కొనుక్కోవటం నేరమైందా?" అని ముసలమ్మ రెండు కాళ్ల మధ్యనున్న ఐదుకుంచాల బియ్యపు మూటని ముణుకుల మీదికి ఎత్తుకుంది.

"శ్రీరామచంద్రుడిలా వారు పాలిస్తున్నారు తల్లీ! ఇంట్లో బియ్యముంటే నేరం! కొనుక్కుంటే నేరం. అమ్మితే నేరం. సరిపడేలాగ తింటే నేరం!" అన్నాది పక్కనున్న గవరల వర్తకురాలు.

"ఎందుకమ్మా! డబ్బిచ్చి వ్యాజ్యం కొనుక్కుంటావు?" అన్నాడు పక్కనున్న హితైషి.

"వొదిలీ, వొదిలీ అని ముష్టిసలహా ఇవ్వకపోతే వాళ్ల నోట్లో గడ్డి పెట్టకూడదూ? వొదిలేసి పిల్లలని పస్తుపెట్టనా? మీరంతా మనుషులే?" అని భీకరంగా ముసలమ్మ అందర్నీ అడిగింది.

"ఓహో అలాగా! రోజూ పట్టికెళ్లి బ్లాకు మార్కెట్టులో అమ్ముకోవడం అనుకొన్నావా? పద. పదా!" అన్నాడు ఉద్యోగి.

"పదండి భడవల్లారా! నేనే దొంగమార్కెట్టులో అమ్ముకొని మేడలు కడుతున్నాను. నాకు ఉరిశిక్షకు తక్కువ వెయ్యకండి. నా పొగ కుక్కుటేశ్వరుడికి ధూపం వెయ్యండి" అంటూ ముసలమ్మ బియ్యపు మూటని భూజానికెత్తుకుని వాళ్లవెంట నడిచింది.

గోదావరి మండలం సరిహద్దు దాటించి, ప్రభుత్వపు శాసనాన్ని ధిక్కరించి, హద్దుతప్పి, ఐదేసి కుంచాలు చొప్పున బియ్యం తరచు తరలించుకుపోతున్న ఒక ముద్దాయి పట్టుబడ్డాది!

❄

భారతి, 1952

బండపాటు

జనం మూగేశారు. గొడవ పెద్దదయేటట్టుంది. కొండల చుట్టూ రాళ్లు కొడుతున్న చప్పుళ్లు ఆగిపోయాయి. ఎక్కడపని అక్కడ ఆపేసి అంతా గుమిగూడి పోతున్నారు.

శవాన్ని గుడిసెకు చేర్చడమైంది. తరవాత తతంగమంతా తొందర తొందరగా అయిపోతున్నాది.

"నానే సెర్లోపడ్డం దేముడో!" అని పార్వతి ఒకటే ఏడుస్తున్నాది. చచ్చినవాడి పెళ్లాం పార్వతి. సర్వసన్నద్ధం అయిపోయింది. అప్పుడు దిగిపడ్డాడు నాగన్న. అంత వరకూ కనబడని వాడు అప్పుడు ఊడి పడ్డాడు.

"పని చేస్తూ సచ్చాడు! పని సేయించినోణ్ణి నిలదీసి అడగొద్దా!" అని ప్రశ్నించాడు నాగన్న. కాస్త నోరున్నవాడు నాగన్న.

"రెడ్డొచ్చాదురా మొదలెట్టండి మళ్లా" అన్నాడు గుంపులోంచి వొకడు.

"సచ్చినోడు నెగుస్తాడా? బేగి కానీయండి" అన్నాడు మేస్త్రి సత్యం. సైకిలు మీద జారబడి నిలబడి పనంతా చకచకా చేయించేస్తున్నాడు. మేస్త్రి మేసినట్టే ఉంది.

"నా మాట యినిపించుకున్నావా?" అని రొకాయించి అడిగాడు కాస్తనోరున్న నాగన్న.

"రామిగాణ్ణి కంట్రాక్టరు సంపినాదురా! బండ దొర్లుకొచ్చింది. ఆడి బుర్ర బద్దలైంది. సావు ఆనాగుంది. సచ్చాడు" అన్నాడు మేస్త్రి సత్యం.

ముందు రోజు సాయంత్రం కొండ మీద చాలా చోట్ల బ్లాస్టు చేశారు. బద్దలైన బండలన్నీ కిందికి జార్చేశారు. మర్నాడు పొద్దున్న కొండొద్దున అంతా రాళ్లు కొట్టుకుంటున్నారు. కొండ మీంచి చిన్న బండరాయి పట్టుతప్పి జారిపడ్డాది. ఇసక్కొడిరాయి. గురిపెట్టి రామిగాడి నెత్తిమీద పడ్డాది. బండా ముక్కముక్కలైపోయింది. రామిగాడి బుర్రా ముక్కముక్కలైపోయింది. వారని చచ్చి కూలిపోయాడు. వాడి పుణికెలోంచి కొబ్బరి పువ్వులాగ మెదడు బైటకొచ్చేసింది. మోచెయ్యి తెగిపోయి రెండు గజాల అవతల ఎగిరి పడ్డాది. తెల్లగా రెండెముకలు బైటకొచ్చి వాటి చివర ఐదు వేళ్లతో చెయ్యి చెయ్యిలాగే ఉంది.

"నానేసెర్లో పద్దందేముడో!" అని ఏడుస్తున్నాది పార్వతి. దాని వెనక ఏడవడాని కెవరూ లేరు. ఏకాకిగా కాకిలా గోలపెడుతున్నాది.

"దానేడుపు యింటున్నావా? దాని గతేంగాను?" అనడిగాడు కాస్త నోరున్న నాగన్న.

"ఒరే నీకు నోరుందిరా! బుర్ర మాత్రం నేదు!" అన్నాడు మేస్త్రీ.

"కంట్రాక్టరుని ఇంకెప్పుడడుగుతారు?"

"అవన్నీ అయినాయిరా. నెగు నెగు. పొద్దునేచిపోతోంది" అన్నాడు మేస్త్రి సత్యం.

"కంట్రాక్టరు డోలు చించుతానన్నాడు సత్తెం" అన్నాడు వెంట వున్న వో పనివాడు.

"హౌదుల్తామురా? ఎర్రప్పా!" అన్నాడు మేస్త్రీ.

"పాకలో ఉంది బేగెళ్లు." అన్నాడు మరో పనివాడు. పాకనగానే పరిగెట్టేడు నాగన్న. మాటలకైతే కాస్త నోరుంది కాని నాగన్నకి సారాకయితే పెద్దపులంత నోరుంది. పాకనిండా జనమే. ఎవడి పట్టుకొద్దీ వాడు పట్టేస్తున్నాడు.

గుడిసెల మధ్యా రోడ్డు మీద జనం యీనేశారు. రోడ్డుమీద టీ కొట్లలో పాలైపోయి టీ ఎవరిదగ్గరా లేదనేశారు.

మేస్త్రీ నిముషాల మీద ఏర్పాట్లు చేశాడు. అన్నీ సిద్ధంగా వున్నాయి. మరిచిపోయిం దొకటిలేదు. పాడిమీదికి శవాన్ని ఈడ్చేశారు. డప్పులు బజాయించడం మొదలెట్టేరు. డోళ్లు ధణుతు లెగరగొడుతున్నాయి. నలుగురూ నాలుక్కొమ్ములూ కాసేశారు. శవం ముందు ఏభైమంది తాళాలు మోగిస్తూ భజన అందుకున్నారు. శవం రోడ్డెక్కింది. నడక జోరెక్కింది.

"నా నేసెర్లో పద్దం దేముడో!" పార్వతి యేడుస్తూ వెంటబడ్డాది. నలుగురాడ వాళ్లు పట్టుకుని గుడిసెలోకి లాక్కుపోయారు.

"ఎంత ఘోరమైపోయింది!" అన్నాడొకడు.

"కొత్తేటిరా!" అన్నాడు ఇంకొకడు. కొత్తేంకాదు. సామాన్యంగా కొండలంతటా ఉంటున్నవే ఈ చావులు. ఒక్క ఈ కొండే సంవత్సరానికి ఐదారుగుర్ని బలి పుచ్చుకుంటున్నాది. బండలపాటు బండగా చేస్తారు. బండపాటుకి చచ్చేవాడు చస్తాడు. ఆ పూట రామిగాడొక్కడే ఉన్నాడా? వాడిపక్క పాతిక ముప్పైమంది పని వాళ్లు ఆదామొగా ఉన్నారు. వాడి బుర్ర మీదే ఎందుకు పడాలి? చావుంది. చచ్చాడు. పడవలసి ఉంది. పడ్డాది. జాగ్రత్తలు తీసుకోడానికి ప్రభుత్వం కొండలమీది కొస్తుందా?

"భద్రంగా ఉండు పార్వతీ. ఏడవకు తల్లీ" అంటూ మేస్త్రీ సత్యం జాగ్రత్త చెప్పేడు.

"తెలును సత్తెం, సూస్తాములే" అన్నాది కని పెడుతున్న కనకమ్మ. తాపీగా సత్యం చుట్ట ముట్టించాడు. వాడి గుండెల మీద బరువు కాస్త తగ్గింది. శవం వంద గజాలు వెళ్లిపోయింది. వెంట వెళ్లారు వెయ్యి మంది.

"డబ్బే కనకమ్మా! డబ్బుపోతే డబ్బు రాదు" అన్నాడు సత్యం. రామిగాడు చచ్చేడనగానే పది మందిని వెంట పెట్టుకుని సైకిళ్ల మీద కంట్రాక్టరు దగ్గరికి పరిగెట్టేడు సత్యం. కంట్రాక్టరుని మామ్మూలుగా బెదిరించలేదు. రామిగాడు చావుకి కంట్రాక్టరే కారణం. బ్లాస్టు చేసే పద్ధతి ఏమీ సవ్యంగా లేదు. కంట్రాక్టరు ఏ జాగ్రత్తా తీసుకోవడం లేదు. కంట్రాక్టరు కంగారు పడలేదు. సత్యాన్ని పట్టుకున్నాడు. సాఫీగా పనిచేయించమన్నాడు.

సత్యం తిరిగొచ్చి పార్వతికి మూడు వందల రూపాయలు మూడంటే మూడు నోట్లు తెచ్చి, గుడిసెలోకి తీసుకెల్లి ఇచ్చేశాడు. పది మందిలో ఆడవలసిన మాట పది మందిలో ఆడాలి. పార్వతి కొంగుకి గట్టిగా ముడి వేయించి, బొడ్డులోకి దోపించాడు. సత్యానికి కంట్రాక్టరు ఎంత ఇచ్చాడో ఎవరికీ తెలియదు. దహనానికెంతో, తాగుడు కెంతో వివరాలు తెలియవు. మేసే ఉంటాడు మేస్త్రీ. మేసినా పార్వతికి ఘనంగానే ముట్టచెప్పించాడు. వెనక వుప్పరరాముడు చచ్చినప్పుడు ఈ కంట్రాక్టరే ఏభై రూపాయలు పెళ్లాం చేతిలో పెట్టి మెల్లగా జారిపోయాడు. అటువంటిది సత్యం మూడు వందలు ఇప్పించాడు. అందుకే పార్వతిని భద్రంగా ఉండ మన్నాడు.

"ఎదవడబ్బు! డబ్బు పోతే డబ్బొస్తాది. మనిషి పోతే మనిషి వస్తాడా?" అన్నాది కనకమ్మ.

"డబ్బుపోతే డబ్బురాదు. పడ్డపాటంతా పొట్టకిసాలదు. కొండంతా పిండి సేసినా మూడొందలు కళ్లసూడవు. మొగుడుపోతే మరో మొగుడువొస్తాడు!" అన్నాడు మేస్త్రీ సత్యం.

"నీ జిమ్మడ! ఎంత మాటన్నావు!" అన్నాది కనకమ్మ.

"నే నన్నది నిజం! డబ్బుపోతే డబ్బురాదు. వొయిసులో ఉంది. మరో మొగుడొస్తాడు."

"నిజ్ఞెవే! కాని నువ్విప్పుడందం బాగానేదు."

"నువ్వూ నేను అనుకోవడానికేం?"

"పార్వతితోటీ అంటావు. ఇప్పుడు మన గుండెకాయలు, నీదే కాదులే, అందరివీ అనాగ పని సేస్తున్నాయి."

"నాలుగు పొద్దులు పోతే నువ్వే అంటావు. కుర్రాడు బుద్ధిమంతుడు బుద్ధిగా పెళ్ళాడు పార్వతీ అని".

"నిజ్ఞెవే! నోకమలాగుంది. మనమెవ్వరమూ సెప్పనక్కర్లేదు. అదే కట్టుకుంటుంది. సచ్చినాడుకాక దానికి మరో మొగుడు ఉండనే ఉన్నాడు!" అన్నాది కని పెడుతున్న కనకమ్మ.

"నన్నన్నావు! నువ్వెంత మాటన్నావో?"

"ఉన్న మాటనేశాను!"

"దాన్ననకు. నీ మాటోటి సెప్పు? నువ్వేటి సేసినావు?"

"సెయ్యవలిసిందే సేసినాను. అందర్నీ సెయ్యమనే సెపతాను" అన్నాది ధైర్యంగా కనకమ్మ. ఇద్దరు పిల్లల తల్లి అయినాక కనకమ్మ మొగుడు చచ్చిపోయాడు. పిల్లల్ని తల్లి కప్పచెప్పి మారుమనువొచ్చింది.

శవం వెళ్లిపోగానే జనం చప్పబడి పోయారు. సత్యం సైకిలెక్కి వెంట వెళ్లాడు.

అప్పుడు పాకలోంచి బైటపడ్డాడో ముసిలాడు. పీకమొయ్యా తాగేశాడు.

"సత్తెం ఈ సావుకి మాబాగా సేసినాడు!" అని చేటంత మొహంతో మెచ్చుకున్నాడు.

"నోరు మూసుకో ముసిలాడా! సచ్చినాడు కుఱ్ఱాడని యేడుపుకాదు! పీకమొయ్యా పోశారని సంబరం!" అన్నాదో యిల్లాలు.

"నానే సెర్లోపడ్డం బాబో!" అంటూ గుడిసెలో పార్వతి యేడుస్తున్నాది. గుడిసెనిండా గుడిసెచుట్టూ గుమిగూడారు ఆడవాళ్లు.

మధ్యాహ్నం పన్నెండుకి అంతా చల్లబడిపోయింది. కట్టెని కట్టెలకి అప్పచెప్పి వాళ్లు కడిగేసుకొన్నారు.

రోజంతా తందనాలాడుతూ పనులు మానుకొన్నారు.

వారం తిరక్కుండా దిగపడ్డాది చచ్చినవాడి తల్లి చామాలు. చామాలు కొడుకుని చూసి ఐదారేళ్లయి పోయింది. ఒక్కనాడు కొడుకునీ కోడల్నీ చామాలు సుఖంగా బతకనిచ్చింది కాదు. దాని పోరు పడలేక రామిగాడు పార్వతిని వెంటబెట్టుకుని కొండల మధ్య రాళ్లు కొట్టుకుంటూ బతికాడు. గుడిసెలు చేరగానే గుండె బాదుకుంటూ చామాలు ఏడుపు మొదలెట్టింది.

"వొచ్చినావాఁ చామాలూ! ఇక్కడ నీ ఏడుపు ఇనే వాళ్లెవరు?" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"కోడలునేదా తల్లే?" అని రాగంతో ఏడుస్తున్నాది.

"పనినోకి పోయింది."

"శబాసు! పనినోకి పోయిందా? ఎంత ఘోరం!" అన్నాది చామాలు.

"దాని కష్టానికున్నారా? సుఖానికున్నారా? ఒక్కత్తి గుడిసెలో ఉంటే పిచ్చెత్తిపోదా? మావేఁ పనిలోకి ఈడ్చుకెళ్లాము. నాల్గు రాళ్లు వస్తాయి" అన్నాది కనకమ్మ.

"మీరంతా గడుసోళ్లమ్మా! మాము సత్తెకాలపోళ్లం" అన్నాది చామాలు. పనిలోంచి తిరిగొచ్చిన పార్వతికి అత్త మొహం కనబడ్డాది.

"నానేసెర్లో పడ్డం అత్తో!" అంటూ ఏడుపు మొదలెట్టింది. వరసలు వరసలు పెట్టి ఏడవడం చాతకాలేదు. ఎప్పుడూ ఒకే ఏడుపు ఏడుస్తున్నాది.

"నానే బందలోపడ్డం కోడలో!" అంటూ అత్త లంకించుకొంది. పుట్టిన దగ్గరనుంచి రామిగాడు పెద్దవాడయీ వరకూ వాడి కబుర్లెన్నో ఏడుపుతో మిలాయించి చెప్పింది.

"అమ్మా మేస్త్రీ సంత్తెంనేదా?" అని ఆఖరికి అడిగింది.

"ఆ కంట్రాక్టరుని అడిగినారా?" అని అడిగింది. అన్నీ తెలుసుకొనే వచ్చింది. అక్షరాలా మూడు వందలు కోడలికి ముట్టాయని స్పష్టంగా తెలుసుకొన్నాకే బయల్దేరి వచ్చింది.

"ఆళ్లనడగడాని కొచ్చినావా?" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"కొడుకు పోనాడు. పోనాడనే అడగడాని కొచ్చినాను" అని ఏడ్చింది చామాలు.

"కొడుకుండగా వోపాలీ వొచ్చినావు కావేమి?" అడిగింది కనకమ్మ.

"అడుగుతారమ్మా! అడుగునున్నవి కనబడవు. కడుపు కాలి ఏడుస్తున్నాను తల్లీ. మేస్త్రీ సత్తెం నేడా? మేస్త్రీ సత్తెం సూడ్డా?" అని యేడ్చింది చామాలు.

మేస్త్రీ సత్యం వచ్చాడు.

"నీ కోసమే సూస్తున్నాను సత్తెం. అందరికీ మొనగాడివి వున్నావనే వొచ్చినాను సత్తెం" అని యేడ్చింది చామాలు

"యేటే చామాలు గోల?" అన్నాడు సైకిలు దిగి సత్యం.

"డబ్బు! నువ్వు సెప్పినావుకదా డబ్బు! డబ్బుకొచ్చింది చామాలు" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"నేనే సెర్లోపడ్డం తల్లో" అని యేడుస్తున్నాది పార్వతి.

"నా నెంత గోల పెట్టినా ఎవ్వరూ ఒక్కమాటనరు! నువ్వు నాయం సెపతావని వొచ్చినాను" అన్నాది చామాలు.

"నాను నీకేటి సెయ్యగలను చామాలు?" అని ప్రశ్నించాడు సత్యం.

"కంట్రాక్టరిచ్చింది. అందులోనే తల్లికింత అనొద్దా?" అని ప్రశ్నించింది చామాలు.

"అందుకా వొచ్చినావు చామాలు? కోడల్ని తీసికెళతావనుకొన్నాను! నాయం సెప్పమన్నావా? కొడుకు సచ్చిపోయినాడా? వాడి పెళ్లాం పార్వతికి మీరుండే యింట్లో వాటా వొస్తుంది. మీ కొంపలో కుండా మలకా ఏటుంటే ఆట్లో నీ కోడలికి వాటా వొస్తుంది. తెలిసిందా? ఇక్కడ నీ కొచ్చేది నెత్తిన సేతులే!" అన్నాడు మేస్త్రీ సత్యం.

సత్యం కొంత సత్యమే పలుకుతూ ఉంటాడు.

"నాయమెక్కడుంది? కట్టుకున్న దానికి సెప్పినారు. కనుకున్న దానికి సెప్పినారుకారు. మా కొంపకూడా కోడలి కివ్వాలట! నాయమెక్కడుంది" అంటూ నిజంగా నెత్తిమీద చేతులు పెట్టుకొని ఎవ్వరి మొహం చూడకుండా రోడ్డుకి వెళ్లిపోయింది.

"కనకమ్మా నూసినావా? తల్లిని! డబ్బే డబ్బు!" అన్నాడు మేస్త్రీ సత్యం.

"చామాల్ని ఎంట పెట్టేసినావుగాని నాదో సిన్నమాటుంది" అన్నాది కనకమ్మ.

"సెప్పు".

"ఇనాగా? మెల్లిగా సెప్పాలి" అని మెల్లిగా రహస్యంగా అడిగింది కనకమ్మ.

"నాకో కోక కొనవా?" అని.

"నీ కెందుకో కోక?"

"రెండొందలు నీకు ముట్టినాయికదా! నాకు కోక్కొను" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"నాను పడ్డ పాటో? అందరినోళ్లు నొక్కి పని గప్‌చిప్‌గా సేయించాను" అన్నాడు సత్యం.

"అందరి ఆడాళ్లనోర్లూ నొక్కి వెనక సాయం నీకు నానూ సేశాను."

"సేసినావు నిజివే, కొనుక్కో కోక, ఇస్తాను" అన్నాడు సత్యం.

"సూడు ఎంత ఘోరమో?"

"ఘోరమే! రామిగాడు చస్తే నాకు రెండొందలూ నీకో కోక వొచ్చినాయి."

"అది కాదురా ఘోరం. పార్వతికి మరో మొగుడున్నాడని సెప్పినాను కానా? ఆడు మొన్న రాత్రే దాని గుడిసెకు సేరుకున్నాడు!"

"నిజంగా?"

"నిజం."

"ఘోరమే! కాని నాను సెప్పినట్టే ఐంది."

"నువ్వు సెప్పినట్టే ఐంది. అంతేనా? ఆడు పాలెంలో గేదెని బేరమాడుతున్నాడు" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

❀

జ్యోతి దీపావళి సంచిక – 1968

వజ్రహస్తం

చెపుతాను, చెప్పమంటున్నారా? వినండి. ఏం చెప్పను! ఏం చెప్పను!

వొద్దు వొద్దు! మహాప్రభూ ఈ శిక్ష శత్రువుకి కూడా వొద్దు.

ఏదో అనుకుంటాం అంతా మనచేతిలో ఉన్నట్టు! మన చేతిలో ఏమీలేదు. అంతా వాడి చిద్విలాసం.

అంతా ఏమనుకున్నారు? సరి, పని, వీడి పని సరి! నువ్వేమను కున్నావు? వాడు? వాడు? వాడేమనుకున్నాడు. సరి సరే అనుకున్నారు!

ఉరితాడు పీకమొయ్యా బిగించారు. బిగిసిపోతూ ఉరి! ఉరిశిక్ష కాని ఉరిశిక్ష. బతికి ఉండాలి. క్షణక్షణం ఉరితాడు బిగిస్తూ చంపుతూ వుండాలి. వాడు చక్రం అడ్డువేసి ఉరితాడుని ముక్కముక్కలు చెయ్యకపోతే? వొద్దు. శత్రువుకి కూడా ఈశిక్ష వొద్దు.

మూడు సంవత్సరాలు! భగవంతుడే పరీక్షలో పెట్టాడు. అబ్బబ్బ! అంత పరీక్షా! నిలబడతానా లేదా? నిలబడ్డాను! పరీక్షకి తట్టుకున్నాను.

భగవంతుడు మన పక్షం వున్నప్పుడు కౌరవ అక్షౌహిణీలు మననేం చేస్తాయి?

నువ్వు తప్ప ఇంక శరణులేదు సుమా అన్నాను. పట్టుకున్నాను.

ప్రతిక్షణం 'భగవాన్ భగవాన్' ఆత్మఘోష పెడుతూనే వుంది. ఎదురుగా కనబడుతూనే ఉన్నాయి ఏడుకొండలవాడి వజ్రహస్తాలు. వరదా! తండ్రీ ఏదీ నీ వరం? అభయం! ఇక భయంలేదు. ఉంది ఉంది తండ్రీ నీ అభయహస్తం! నీ వజ్రహస్తం!

భగవాన్! నీ చక్రముండగా ఏ మకరం పట్టుకోగలదు!

కనబడుతూనే ఉన్నాయి. మూడేళ్ళు అనుక్షణం కనబడుతూనే ఉన్నాయి. ఏడుకొండల వాడి వజ్రహస్తాలు! ఒకటి అభయం చెపుతున్నాది. ఒకటి వరం ఇస్తున్నాది. తెలుస్తూనేవుంది. ఇది భగవంతుడు చేస్తున్న పరీక్ష. వేరొకటి కాదు.

నేనేం నేరం చేశాను? నే చేసిన ఏ పనీ నేరంకాదు. నేరమైతే ఎవడు చెయ్యడు? నా పదవిలో ఉన్నవాడు ఎవడు చెయ్యలేదు? నా దృష్టిలో అంతా చేస్తున్నారు. చట్టాలు అలాగ్గా తగలేనుకున్నారు.

అక్కన్న మాదన్న లేంచేశారు? గోలుకొండ నవాబుగారి రాజ్యంలో అక్కన్న మాదన్నలకి ఇంగ్లీషువారు కొన్ని లక్షలు నజరానా ఇవ్వలేదా! నజరానా అంటే ఏమిటి? లంచమంటే ఏమిటి?

పదవిలో వున్నవాడి కాళ్లు పట్టుకుంటారు. చేతిలో పెడతారు. తప్పా? చెప్పండి. అధికారం లేనివాడు ఏం చెయ్యగలడు? పిడకలు! అధికారం ఉంది! ఒచ్చిపడతారు. నువ్వు భగవంతుడివి అంటారు. అధికారి భగవంతుని అంశ కలవాడు. రాజు! నా విష్ణుఃపృథివీపతిః!

చట్టం ప్రజల కోసం. ప్రజలని అదుపులో ఉంచటానికి చట్టం. రాజుకోసమా చట్టం? రాజు చేసిన చట్టాలు ఏనాడైనా రాజుకి వర్తించాయా? వర్తిస్తాయా?

ఈనాడు రాజాస్థానంలో ప్రజాస్వామ్యం ఉంది. ప్రభుత్వాన్ని నడుపుతున్న వర్గం ఉంది. చట్టం ప్రజలకోసం. ప్రభుత్వ వర్గం కోసం కాదు.

వింటున్నారా? ఇవి ఉన్నతమైన రాజకీయ విషయాలు. అంతర్గతమైన మహా రహస్యాలు.

మోపు చేసేశారు! నామీద కొచ్చింది. అక్రమంగా డబ్బు పుచ్చుకుంటున్నానుట! చేసుకొన్నానుట! రుజువు చేస్తారుట!

సస్పెన్షన్! ఉద్యోగం నుంచి సస్పెన్షన్ ఉత్తర్వు జారీ అయింది. ఐదేళ్లలో పెన్షన్ పుచ్చుకోవలసినవాడికి సస్పెన్షన్!

నేరం రుజువైతే ఏం జరిగేది? ఉద్యోగం నుంచి బర్తరఫ్. అంతే అయితేనా? పూతికతో సమానం. కాదే! జైలుశిక్ష పడుతుంది.

జైలు శిక్ష పడితే బతకడం బతకడమా! చెప్పండి!

ఉచ్చులో పడ్డ మరుక్షణం చుట్టూ అంతా శత్రువులే! ఒక్కడు మాటలాడ్డు! ఒక్కడు కనబడ్డు! ఇంటికి వెళ్లి దేముడు పట్టు కెదురుగా నిలబడి చేతులు జోడించి "ఏడుకొండలవాడా! వెంకటరమణా! రక్షించు రక్షించు! శరణు తండ్రీ శరణు శరణు!"

శరణుజొచ్చాను. కళ్లమ్మడి నీళ్లు కారిపోతున్నాయి. వొళ్లు గడగడలాడి పోతున్నాది. శివజ్వరంతో కుదుపు పట్టుకొన్నాది. నా పెళ్లాం లెంపలు వాయించుకుంది.

"కాపాడు తండ్రీ కాపాడు! నా భర్త పొరపాట్లు క్షమించు. ఆయన పైకి ఏం చెప్పినా మీ దాసానుదాసుడు. రక్షించు, రక్షించు, మహాప్రభో!" నువ్వు తప్ప మాకెవరూలేరు. నీ కొండ కొస్తాము. పిల్లలందరితో వస్తాను. ఏడుకొండలూ ఎక్కివస్తాను. నా వొంటిమీద నగలన్నీ నిలువుదోపు ఇస్తాను. ఇప్పుడే నీకు ముడుపు కడతాము. మహాప్రభో, మహాప్రభో!" అని ఏడుస్తూ అది ముక్కుపుడక లగాయితు నగలన్నీ తీసేసింది. పుస్తెలు తీసేసి పసుపు కొమ్ములు కట్టుకొంది. నగలన్నీ మూటకట్టి ముడుపు కట్టింది.

ఇదంతా ఏమిటంటారు? భగవంతుడు నన్ను చేస్తున్న పరీక్ష. ఏమీ సందేహం లేదు.

బ్రాహ్మణ్ణెప్పుడైనా పిలిచానా? నా చుట్టుపక్కలకి రానిచ్చానా. పూజా పునస్కారాలు చేయించానా! ఎన్ని అపభ్రంశం మాటలన్నాను? ఎన్ని తిట్లు తిట్టేను!

నేనేనా! వాణ్ణేనా నేను? నేను ఉన్నాను సుమా అన్నాడు భగవంతుడు. నీ పోత్రం నా దగ్గర కాదన్నాడు. దాసోహం కమ్మన్నాడు. 'దాసోహం. దాసోహం" అన్నాను.

జ్వరం, మహాజ్వరం, శివజ్వరం! క్షణం ఒక యుగం. రోజు ఘనీభవించి శిలకట్టుకు పోతున్నాది. శిలాభారంతో తల వ్రయ్యలైపోతున్నాది. ఏమిటి సాధనం!

సద్బ్రాహ్మణులని పిలిచి గ్రహ పూజలు, గ్రహ శాంతులు, గ్రహ జపాలు చేయించాను. శివాలయంలో ప్రతి సోమవారం వంద కొబ్బరికాయలు కొట్టిస్తూ రుద్రాభిషేకాలు చేయించాను.

ఉదయం స్నానం చేసి, పచ్చి మంచినీళ్లు ముట్టుకోకుండా, పట్టు పంచ కట్టుకొని పీటమీద కూర్చుని రామాయణం తీసి సుందరకాండ పారాయణం రోజూ చేశాను, నిత్యం.

మహత్తు ఉందన్నారు. మహత్తు ఉంది. మూడేళ్లు ఎలాగ్గా గడిచాయి? నిముషం నిముషం చొప్పున మూడేళ్లు గడిచాయి. నిమిషమంటే మాటలా? ప్రతి నిమిషం అరవై బ్రహ్మచెముడు ముళ్లగుబుర్లు! ఎలాగ్గా గడిచాయి?

ఏడు కొండలవాడి వరదహస్తం ఎదురుగా వుంది. ఏడుకొండలవాడి అభయహస్తం ఎదురుగుండా ఉంది. ఏడుకొండలవాడి వజ్రహస్తాలు కాపాడుతూ కనబడుతూనే ఉన్నాయి.

నాతో అయిందా! నా స్నేహితుడి మీద కొచ్చింది. చిత్రం! శ్రీమన్నారాయణ మీది కొచ్చింది!

చెప్పండి, మీరంతా చెప్పండి. శ్రీమన్నారాయణ ఎవడు? మామ్మూలు వాడా? సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. ప్రజలకు ఆపదలలో ఆదుకొనేవాడు. ప్రజల మధ్య పని చేస్తున్నవాడు. ప్రజల నోట్లో నాలికలాంటివాడు. మహా మేధావి. రాజకీయాల్లో ఆరితేరినవాడు. ఊరికి ఉపకారి. తాలుకాకి ఉపకారి. జిల్లాకి ఉపకారి, రాష్ట్రానికి ఉపకారి.

ఔనంటారా?

పెరిగిపోతున్నాడు శ్రీమన్నారాయణ. విష్ణు అంశతో పెరిగిపోతున్నాడు. మొహంలో రాజవర్చస్సు కనబడిపోతున్నాది. రాష్ట్ర స్థాయికి వచ్చేశాడు. దేశం మొత్తంమీద వినబడు తున్నాడు. అన్ని హంగులూ ఉన్నవాడు. మంత్రి కావలసినవాడు. ముఖ్యమంత్రి కావలసినవాడు! ప్రధాని కాదగ్గవాడు.

మీకేం తెలుసు? నాకు తెలుసు! చిన్ననాటి నుంచి నా స్నేహితుడు. ఏమి ఘోరకలి! వాణ్ణి ఇరికించేరు! ఖూనీకేసులో! ఖూనీ చేయించాట్ట! పక్కలో బల్లెంలాగ ఉన్న రాజకీయ శత్రువుని నక్సలైట్ల మీదికి నెట్టుకుపోతుందని ఖూనీ చేయించాట్ట.

తాను చేయలేదు. ఔనా! చేయించాట్ట. శత్రువుని సంహరించమనే చాణక్యనీతి. రాజరికంలో అడ్డంగా ఉన్నవాణ్ణి అడ్డంగా నరికేయడమే న్యాయం.

ఔనంటారా? కాదంటారా? వెనకనుంచి వెన్నుపోటు పొడవడానికి పొంచున్న శత్రువుని పిట్టని కొట్టినట్టు కొట్టాద్దా!

కొట్టేడా? కొట్టించాట్ట! చూసినవాడు లేడు! టటట! అంతా టటట! తెలిసినవాడు లేడు.

నా తల వెయ్యి చెక్కలై నే చస్తున్నాను. శ్రీమన్నారాయణ కేసుతో నా నడుం జారిపోయింది.

ఈ శిక్ష శత్రువుకి వొద్దు. భగవంతుడే మా యిద్దర్నీ పరీక్షలో పెట్టాడు. పరీక్షకి తట్టు కుంటామా లేదా పరీక్ష చేస్తున్నాడు.

నట్టేట్లో పడిపోయాము. నది సముద్రానికి కొట్టుకుపోతున్నాము. కళ్లు మూసుకున్నా, కళ్లు తెరిచినా అభయహస్తం కనబడుతున్నాది. వరదహస్తం కనబడుతున్నాది. వజ్రహస్తాలు

కనబడుతున్నాయి. తీర్పు వొచ్చేసింది. మీరంతా ఆనందం పట్టలేకపోయారు. నా నేరాలు రుజువు కాలేదు! నే నేరం చేయలేదు! భగవంతుని విలాసం. ఏడుకొండలవాడి చక్రప్రయోగం. చక్రి ఆ చక్రం!

వెంటనే ఆ వెంటనే ఉన్న రైలుకి ప్రయాణం కట్టేశాం ఏడుకొండలవాడి సన్నిధికి.

కీళ్ళ నొప్పులతో నా పెళ్లాం మెట్లెక్కి పోయింది. ఇచ్చేశాడు భగవంతుడు దానికి ఏనుగంత శక్తి. పిల్లలు ఛంగు ఛంగుమని కోతుల్లాగ గెంతుతూ పోయారు.

నన్ను పరీక్షలో పెట్టేడా భగవంతుడు. నవనాళ్లూ తోడుకుపోతూ శరీరభారం మొయ్యలేక మెట్టు మెట్టు ఏడుకొండలవాడి స్మరణ చేస్తూ ఎగబడ్డాను.

నా శక్తికి మించిపోయి కొండలు కనబడుతున్నాయి. తండ్రీ నన్నెలాగ తీసికెళతావూ నీ చరణ సన్నిధికి, అని వాడి మీదే భారం వేసి ఎగబడగా గాలిగోపురం చేరుకున్నాను. నడవగా నడవగా మోకాలి పర్వతం చేరుకున్నాను.

చూడండి. బాధగా ఉంటే "ఏడుకొండలవాడా గోవిందా గోవిందా" అంటూ నామస్మరణ అన్ని వైపుల నుంచి, మీద నుంచి, కింద నుంచి వొస్తూ వుంటే నాకు తెలియకుండా శరీరాన్ని మోసుకుపోయాను.

మోచేతులతో, మోకాళ్లతో వొగురుస్తూ, ఎగబడుతూ మోకాలి పర్వతం ఎక్కేను. ఎక్కిపోయాను. కొండెక్కిపోయాను. "భగవాన్, నీ సన్నిధానానికి వచ్చాను. ఏడుకొండలవాడా! గోవిందా గోవిందా!" నామస్మరణ చేసుకున్నాను.

కాటేజ్ పుచుకున్నాను. అందరం స్నానాలు చేసి కళ్యాణకట్టకి పోయాం. నేనూ, నా పెళ్లాం పిల్లలంతా కేశ సమర్పణ చేసుకున్నాం.

అణగిపోయింది నా పోత్రం. అణగిపోయింది నా అహం. ప్రాయశ్చిత్తమై పోయింది. నా పెళ్లాం నిలువుదోపు అర్పించుకుంది.

"నువ్విచ్చిందే తండ్రీ, నాదేం కాదు. నీది నీకే ఇస్తున్నాను మహా ప్రభో!" అని కళ్ల నీళ్లు పెట్టుకుంది మహదానందంతో! ఏడుకొండలవాడికి, కళ్యాణం చేయించి దర్శనం చేసుకొని, ప్రసాదం తిని కాటేజీకొచ్చాను.

నన్ను బాధ పెడుతున్నది శ్రీమన్నారాయణ కేసు ఏమైంది? భగవాన్ వాణ్ణి రక్షించు నన్ను కాదు. నేను కాదు, వాడు రక్షించదగ్గవాడు. ముఖ్యమంత్రి కాదగ్గవాడు. ప్రధాని కాదగ్గవాడు. కుట్రలో ఇరుక్కున్నాడు. ఖూనీకేసులో! ఖూనీ చేయించాడని! రక్షించు తండ్రీ రక్షించు!

వాడికోసం నా ప్రాణం తహతహ లాడిపోతున్నాది.

చూశారా! వింటున్నారా! నాకు భగవంతుడు కనబడుతున్నాడు. మీకో? మీకు కనబడుతున్నాడా?

చూశారా! మీ వొళ్లు గగుర్పొడుస్తున్నాది! భక్తితో వుంది స్వామిశక్తి.

కాటేజీకి పోయి నా వేషం నేను వేసుకొన్నాను. నా కోటు, నా ఫేంటు నా హేటు. నేనెవణ్ణో ఇప్పుడు చూడండి. ఫస్టుక్లాసు ఆఫీసర్ని. నేను నేనయ్యాను! మూడేళ్ల తర్వాత ఏడు కొండలవాడు ఏడుకొండలు దాటించాడు. తన సన్నిధానంలో ఆఫీసరుగా, ఏడుకొండల వాడి భృత్యుడిగా నిలబడమన్నాడు. కాటేజీ ఎదురుగా నిలబడ్డాను.

చిత్రం చూడండి!

ఎదురుగా కనబడుతున్న దృశ్యం ఏమిటి? ఎవరది? ఎవరో మహానుభావుడు. మహా భక్తుడు! ఏదో అర్థించి నా కాటేజీకి వచ్చాడు. ఎవరో చెప్పేశారు నేను ఆఫీసర్నని.

"ఏడుకొండలవాడా! గోవిందా, గోవిందా!" అని కేకపెట్టాడు. వాడి బుర్ర నల్లగా, ఇనుప గుండులా వుంది. తల మీసాలు గెడ్డం నున్నగా గీయించుకున్నాడు. నుదిటినిండా నుదురునిండిపోయి నామం పెట్టుకున్నాడు. చిన్న అంగవస్త్రం కట్టుకుని జాంబవంతుడిలాగ నిలబడ్డాడు. భయోత్పాతం కలిగించే రూపం, మహా బీభత్సమైన విగ్రహం! నా దగ్గరికి ఏం కావలసి, ఏ కోరికతో వచ్చాడు! ఏడుకొండలవాడే కాని, ఆ ఉగ్రరూపంలో నా దగ్గరకు రాలేదుకదా! భ్రాంతిలోపడిపోయాను. జాంబవంతుడంత మనిషి జాంబవంతుడిలా ఉన్నాడు. నన్ను పరీక్ష చెయ్యడానికి వెంకటరమణుడే ఆ రూపంలో రాలేదు కదా! నుదిటి మీద నామం ధగధగ లాడుతున్నాది. శరీరం నలుపు నిగనిగ లాడుతున్నాది.

"స్వామీ తమకేం కావాలి?" అని అడిగాను. పిల్లలు వచ్చి బిక్కు బిక్కు మంటున్నారు.

"ఏడుకొండలవాడి అనుగ్రహం కావాలి నాయినా!" అన్నాడు.

వింటున్నారా! వాడి అనుగ్రహం కావాలి! "చిత్తం! తమకేం కావాలి?" అని అడిగాను. వాడేమడిగినా భక్తుడయినా, దొంగభక్తుడయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.

"నే(నా! నే(నా!" అన్నాడు.

"శ్రీమన్నారాయణగారండీ!" అంటూ లోపల్నించి నా పెళ్లాం బయటకు వచ్చేసింది. నా కళ్లను నేను నమ్మలేకపోయాను. శ్రీమన్నారాయణుని వివస్త్రుడై వుండగా నేనెప్పుడైనా చూశానా? పిసరంత పోల్చలేకపోయాను. మొహంనిండా బొద్దు మీసాలు, తలనిండా ఉంగరాల జుత్తు, తెల్లటి చొక్కా, తెల్లటి పంచె, తెల్లటి సిగరెట్టు, కారులోంచి దిగి నా ఇంటికి వచ్చే శ్రీమన్నారాయణ రూపు ఎక్కడ? భగవత్సన్నిధానంలో ప్రాయశ్చిత్తం చేసుకుని అంగవస్త్రంతో నిలబడ్డ శ్రీమన్నారాయణ ఎక్కడ?

ఆనందబాష్పాలతో కౌగిలించుకున్నాము. భగవంతుడు వాణ్ణి రక్షించేడు. బయట పడ్డాడు. నా వెనకే వచ్చాడు. నా తోటే వచ్చాడు. హుటాహుటీ మొక్కు చెల్లించుకుంటా ననుకొన్నాడు. హుటాహుటీ వచ్చేశాడు.

"ఏడుకొండలవాడా! ఏ లీలను ఎవరిని ఎందుకు కాపాడుతావో ఎవరికి తెలుసునయ్యా? ఏడుకొండలవాడా!"

"నన్ను రక్షించావు. శ్రీమన్నారాయణని రక్షించావు. దేశానికి కావలసినవాడు, వాణ్ణి రక్షించావు" అని స్తవం చేశాను.

పరమేశ్వరుని నిర్ణయాలు పామరులకి బోధపడవు!

❖

ఆంధ్రజ్యోతి వీక్లీ, దీపావళి సంచిక 1974

గుడిసె - దీర్ఘరోగి

ఎన్ని సార్లు వేసినా సంతృప్తి పరచడం లేదు.

అనుకొన్న "ఫీలింగు" రాలేదు. చిత్రాన్ని చూస్తున్న మిత్రులంతా అద్భుతంగా ఉందనే అంటున్నారు.

ముప్పై విధాల మార్చి చూశాను. "ఫీలింగు" రాలేదు!

చిత్రం అద్భుతంగానే ఉంది. తైల వర్ణాలతో వేసిన "దీర్ఘరోగి" చిత్రం!

గుడిసె, దాని ముందు నులక మంచం మీద కూర్చుని దీర్ఘరోగి. గుడిసె వెనక్కి రెండు యీత చెట్లు. వాటి మానులు ఏటేటా ఒక్క ఏడూ వొదలకుండా కల్లుకి నరికిన నరుకులు మెట్లుకట్టి ఉన్నాయి. వాటి తలల కింద తెగకోసిన పీకలికి కల్లుకుండలున్నాయి. ఓమూల చిత్రానికి తూకం సరిపెడుతూ నాలుగు కాళ్ళూ జాపి పంది పడుకుని ఉంది. బాగా వెనక ఆకాశం చివరిదాకా ప్రదేశ వైశాల్యం కనబడుతుంది. అదీ నే వేసిన చిత్రం.

రంగుల కలయిక, పరస్పరం ఖండించుకుంటూ అడ్డదిడ్డంగా వేసిన రేఖల పొందిక బహుమంచి చిత్రాన్ని శాస్త్రరీత్యా రూపొందించాయి. రంగులూ రేఖలు సరిపోతే ఏమి రాసినా చిత్రమే. రోగి మొహంలో "ఫీలింగు" నేను కోరుకున్నట్టు రాలేదు. దీర్ఘరోగి అని తెలుస్తున్నాది. రోగపు తీవ్రత అనుకున్నంత ఆదర్శప్రాయంగా బహిర్గతం కాలేదు. గుడిసె అద్భుతంగా సెట్టయి అమిరింది. రోగి మొహం, చూపు నన్ను సంతృప్తి పరచడం లేదు.

నా చిత్రాలలో ఆది నుంచి గుడిసెకి ప్రాధాన్యత అధికం. దృశ్యచిత్రం నేనేది వేసినా అందులో ఎక్కడో ఒక చోట గుడిసె చోటు చేసుకుంటుంది. గుడిసె అందం నన్నెప్పుడూ ఆకర్షిస్తుంది. ఏళ్ల తరబడి శిల్పులంతా చేరి కట్టిన తాజ్‌మహల్ గోరీకన్నా పాడేరు కొండచరియల్లో సవర వాడి గుడిసె నన్నాహ్లాద పరుస్తుంది.

కోకిల మీద పద్యం రాయని కవి కిశోరాలూ, గుడిసె చిత్రం వెయ్యని ప్రారంభ చిత్రకారులూ ఉండని మాట వాస్తవమే కాని నా తొలి బహుమతి చిత్రం గుడిసె. అన్ని దేశాల చిత్రకారుల చిత్రాల్లో గుడిసె కనబడుతూ ఉంటుంది. చిన్నప్పుడు దాని అందం ఒక్కటే నన్ను ఆకర్షిస్తూ ఉండేది. ఇప్పుడూ దానందం ఆకర్షిస్తుంది. ఐతే విషాదం కలుస్తుంది. పెద్దపులి సౌందర్యంలో క్రౌర్యంలాగ!

చిన్నప్పుడు నా అభిమాన కవి "వర్డ్స్‌వర్త్" కావ్యం ఎక్స్‌కర్షన్ (Excursion) చదువుతూ కొండొద్దున బండ మీద కూర్చుని ప్రకృతి సౌందర్యంలో లీనమైపోయే వాణ్ణి. చిత్రం వేసుకుంటూ రంగులో రంగులు కలుపుతూ కొత్త రంగుల వైచిత్రిలో కలిసిపోయేవాణ్ణి. తాదాత్మ్యం పొందేవాణ్ణి. భూమ్మీద మనిషై పుట్టినందుకు సౌందర్యానికి ముగ్ధుడనౌతూ ఆస్వాదిస్తూ జీవించడమే పరమావధిగా కనబడేది.

ఇదంతా ప్రారంభ యవ్వనంలో ప్రారంభ చిత్రకారుడిగా!

సరియైన జ్ఞానం కలిగిన తరవాత తెలిసింది. కోటానుకోట్ల ప్రజలు పెళ్లాం పిల్లలతో గుడిసెల్లోనే జీవిస్తున్నారనీ, కోటానుకోట్లు సగం తిని, అదీ లేక దరిద్ర జీవితం శ్రీరాములువారి కాలం నుంచీ, అశోకుల వారి కాలం నుంచీ నేటిదాకా జీవిస్తున్నారనీ మొగవాడు గోచీతో, ఆడది చింకికోక కుళ్లుకంపుతో బతుకంతా బతుకుతూ మానం కాపాడుకొంటున్నారనీ కాస్త జ్ఞానం వచ్చాకే తెలిసింది. గుడిసె ఈ దేశస్తుడి నివాసం! ఈ జాతి ప్రతీక. గాంధీజీ ఎక్కడికి వెళ్లినా గుడిసె కట్టుకునేవాడు. గుడిసెల్లో దిగేవాడు. అంగవస్త్రం కట్టేవాడు. కోటానుకోట్ల మూగజీవుల ప్రతినిధి!

పైపైని చూస్తే గుడిసె కృష్ణశాస్త్రి గీతం! లోలోతుకి చూస్తే గుడిసె భయానకాల గూడు! గూడు మీద "తెల్లని మశూచి కుండలు గగనమ్మున చుక్కలు!"

అతి మనోజ్ఞమైన గుడిసె నా 'దీర్ఘరోగి" చిత్రంలో వేశాను. ఈ చిత్రం నారాయణబాబు "దేశమాత", శ్రీశ్రీ "భిక్షువర్షీయసి" గీతాలేతాలెత్తగా బైటకొచ్చింది.

ఈ చిత్రం నా ఊహలోకి రావడానికి యథార్థ సంఘటన ఒకటుంది. ఊరవతలికి షికారుపోతే మర్రిచెట్టు కింద పల్లెటూరివాళ్లు సేదతీరుతున్నారు. రోగగ్రస్తుణ్ణి నులకమంచం మీద వాళ్ల పల్లెనుంచి పదహారు మైళ్లు పట్నంలో పెద్దాసుపత్రికి మోసుకొచ్చారు. అక్కడ వైద్యం వల్ల ప్రయోజనం లేకపోగా తిరిగి వాళ్ల పల్లెకు పదహారు మైళ్లూ మోసుకుపోతూ ఉంటే పట్నం చివరికి రాకుండానే, ఆ నులక మంచం మీదే ఎక్కడో ప్రాణం గుటుక్కుమంది. నులక మంచంతో ఆ శవాన్ని కిందదించి మర్రికింద చతికిలపడ్డారు. పదహారు మైళ్లు మనిషిని మోసుకొచ్చారు. పదహారుమైళ్లు శవాన్ని మోసుకెళ్లాలి.

అది చూసి దీర్ఘరోగి చిత్రం కాన్వాసుకి ఎక్కించాను. పూర్తి చేశాను. ఏం లాభం? రోగి చచ్చిపోతాడేమో అన్నట్టు ఉండాలి. బాధ మొహం నిండా మూర్తీభవించాలి. ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. ఆ మొహం కోసం! ఆస్పత్రుల ముందు నిలబడి ఎందరెందరో రోగుల్ని పరిశీలన చేశాను.

చిట్టచివరకు కృతకృత్యుణ్ణయ్యాను. వచ్చేసింది. నాక్కావలసిన "ఫీలింగు." మహాద్భుత మైన చిత్రం "బోద్లేరు" గీతాన్ని మించిపోయింది. విమర్శకులు ఆకాశానికి ఎత్తేశారు. ప్రదర్శనలలో బహుమతులందుకొంది. బొంబాయి కోటేశ్వరుడు కొనేశాడు. నా చెయ్యి దాటి వెళ్లిపోయింది. నాలుగు వేలు ఖరీదు పెడితే ఎవడూ కొనడనుకున్నాను. ఒకడు చిత్రకళా ప్రదర్శనంలో కొనేశాడు. నా చిత్రం ఇంక నాది కాదు!

ఆ చిత్రం బొంబాయి పట్టణంలో మలబారుగుట్టల దగ్గర కోటీశ్వరుడి మహాసౌధంలో ఉంది! ఆయన హాలు ఒక చిత్రకళా ప్రదర్శనశాల. చూడ్డానికి వెళ్ళండి. నేను వెళితే కౌగిలించుకున్నాడు. శాలువావేసి సత్కరించాడు. ఆయన మిత్రులందరికీ పరిచయం చేశాడు. ఎవరెళ్లినా ఓపికతో చిత్రాలన్నీ చూపిస్తాడు. టీ యిచ్చి పంపుతాడు.

నా చిత్రంలో ఉన్న "ఫీలింగు"కి ఆ మహానుభావుడు కొనలేదు! చిత్రంగా చిత్రానికి ఉన్న విలువనిబట్టి కొన్నాడు! ఆ చిత్రం ఎన్నిసార్లు చూసినా ఆ కోటీశ్వరుడిలో ఏ మార్పూ కలగదు. ఆ చిత్రంలో ప్రధానమైన రంగు ఏమిటో, మిగిలినరంగులన్నీ ఎలాగ్గా మిళితమై నాయో, చిత్రం ఏ విధంగా 'కంపోజు' అయిందో అలాంటివి ఆయన నేర్పుతో తెలివిగానే చెపుతారు.

ఒక్క సుగుణం అతనిలో ఉంది. చిత్రాలని అన్ని ముఖ్యమైన ప్రదర్శనలకి పంపుతాడు. నా "దీర్ఘరోగి" చిత్రం ఈ దేశానికి సందేశాన్ని ఇస్తూ ఎక్కడవున్నా దాని పని అది చేస్తూనే ఉంటుంది.

చిత్రాన్ని చూసీ చూడ్డంతో "దీర్ఘరోగి" మొహంలోకి దృష్టిని లాగేస్తుంది. రోగి చూపుతో చూసేవాడి చూపు కలుస్తుంది. గుండె గుభేలు మంటుంది. ఆ చూపు ఏదో అర్థిస్తూ ఉంటుంది. భరించశక్యంకాని బాధతో మరణ వేదనతో మనని ఏదో ప్రశ్నిస్తున్నట్టు కోరుతున్నట్టు కనబడుతుంది. సరియైన మందు వెయ్యమనా? గొంతుకలో కాస్త మంచి నీళ్ళు పొయ్యమనా? నేనిలాగా చావవలసిందేనా? చంపుతారా? ఎన్నాళ్లు చంపుతారు? అని వెయ్యి ప్రశ్నలు వేస్తున్నట్టు ఉంటుంది.

ఆ చూపులో ఆ మొహంలో అంత "ఫీలింగు" పట్టేసింది. ఆ "ఫీలింగు" ఎలాగ పట్టుకున్నాను? నా బుద్ధి కౌశలం మాత్రం కాదు. కాపీ కొట్టేశాను.

ఎక్కడ దొరికిందా మొహం? ఇంటికొచ్చిన ముష్టిదాని మొహం చూసి చూడ్డంతో "అమ్మయ్య" అనుకొన్నాను. నాకు కావలసిన మొహం ఆ ముసలి ముష్టిదాని మొహం. దీర్ఘరోగంతో సమీపించిన చావు స్పష్టంగా కనబడుతూ, క్షరవూతతో నడవలేక నడుస్తూ, అరవలేక అరుస్తూ ముష్టెత్తుకు బతుకుతున్నాది. ఎందులోనోపడి ఎందుకీ బతుకని చావలేక బతుకుతున్నాది.

గుమ్మంలోకి వచ్చి ముష్టిది ముష్టి అరుపు అరిచింది.

"నీకు తిండి పెడతాను. పావుగంట నిలబడతావా?" అని అడిగాను.

"కడుపుకి ఎడితే బాబూ పావుగంటేటి? గంట నిలుసుంటాను" అంది.

"పావుగంట చాలు" అన్నాను.

"ఎందుకు బాబు?"

"నిన్ను చూస్తూ నీ బొమ్మ వేసుకుంటాను."

"ఎందుకు బాబు?"

"నాకెందుకో కావాలి"

"మనిషిని నూసి ఎయ్యగలరా?" తెలియని విషయం తెలుసుకోవాలనే అడిగింది.

"వేస్తాను. నువ్వుమాత్రం ఎండలో నిలబడాలి".

"ఎండకేటి బాబూ? బతుకంతా ఎండే! ఎండుతూనే బతికినాము. ఎండపడక కూడెక్కడ! ఎండే మా వెన్నెల" అన్నాది ముసిలి ముష్టిది.

నీడలు, ఎండ వెలుగులూ పడి దాని మొహంలో ఎనభై ఏళ్ళ జీవితపు బాధ, మరణ వేదన దేదీప్యమానంగా దివ్యజ్యోతులై వెలుగుతున్నాయి! దివ్యత్వం అన్నింటా ఉంది. వేదనలోనే చూశా!.

ముసిల్ది చేతులు మీదికెత్తి ఈగలు తోలుకొంది. జుత్తు ఎత్తిపట్టుకుంది.

"కదలక మొహం ఎత్తి నిలుచో" అన్నాను.

"ఊరు నిండా దిక్కుమాలిన ఈగలు! ఎక్కడికెల్లినా ఈగలే"! అంది. ఊరినిండా ఈగలులేవు. ముసలమ్మ మీద స్థిరపడి ముసలమ్మతో ఊరేగుతున్నాయి. కాళ్ల నుంచి నెత్తిదాకా పట్టేశాయి. వొంటినిండా జుమ్ము మంటున్నాయి. సరిగ్గా నా దీర్ఘరోగి!

ముసలమ్మ జుత్తు చీపురు దొంకలాగ తెల్లగా మీదికి లేచి ఉంది. దాన్నంతా కూడదీసి వెనక్కి ముచ్చటగా "ముచ్చటముడి" వేసుకుంది. నాకు కావలసినది దాని మొహమొక్కటే. అది జుత్తు సరిచేసి ముడివేసుకుంది. నా వొళ్లు జల్లుమంది.

నాలోనూ ఉంది సౌందర్య పిపాస. ముసిలి ముష్టిదానిలోనూ ఉంది. సౌందర్యం కోసం తపన! అందంకోసం అన్వేషిస్తున్నాను. చుట్టూ అందగించుకొంటున్నాను. అందం కోసం ఆరాటపడుతున్నాను. అందం కోసమే బతుకుతున్నాను. చచ్చే ముసిలి ముష్టిదానిలోనూ అందగించుకోవాలనే వాంఛ మిగిలి ఉంది. నే బొమ్మ వేస్తానంటే బైటకొచ్చింది.

"జుత్తెందుకు ముడివేశావు?" అడిగాను. అది ఎందుకు వేసుకుందో తెలుస్తూనే ఉంది.

"సింపిరిగా ఏటి బాగుంటాది?" అడిగింది! నేను గ్రహించినదీ ముసిల్ది చెప్పిందీ ఒక్కటే! చింపిరిగా జుత్తు బాగుండదు. సంస్కరించుకోవాలి. అందమైన బతుకే అందరికీ కావాలి!

ఆ ముసిల్దాని మొహం "ఫీలింగే" నా దీర్ఘరోగి "ఫీలింగు"! కాపీ కొట్టేశాను. దాని అధరోష్టం వాలిపోయి చొంగలు కారుతోంది. ఆ చొంగే ప్రబంధ కవుల అధరసుధ. దాని యౌవనంలో దాన్ని ప్రేమించినవాడు బతికి ఉంటే ఇప్పుడూ అదే!

"మనిషిని మనిషి ఏం చేస్తున్నాడో" దాని చూపు చెప్పేస్తున్నాది.

ఆ మొహాన్ని నా చిత్రంలోకి దిగుమతి చేసుకున్నాను. దాని "ముచ్చటముడి" వినియోగించుకోలేకపోయాను.

"ముచ్చటముడి" మనిషిలో అంతర్గతమై ఉన్న సౌందర్య పిపాస!

అదీ నా చిత్రం.

"గుడిసె - దీర్ఘరోగి."

❋

ఆంధ్రజ్యోతి వీక్లీ, దీపావళి సంచిక - 1975

వలపు

మిట్ట మద్దేన్నం, ఎండ నిప్పులు చెరుగుతూ వుంటే గాలికి కొట్టుకు వచ్చిన మేగం – పెద్ద వాన కురిసి పట పట పటాల్ మని పిడుగును వదిలిపెట్టి గాలికి కొట్టుకుపోయింది.

మాం పొలం దున్ని ఏరుశనగ ఏసినాం. దాంతో నరి. మెరుపు పట్టుకున్నాది. కార్తి కార్తి తరవాత కార్తి ఎళ్లిపోతున్నాయి. ఏ కార్తీ వొరుపే.

అదిగో మళ్లా మగ కార్తిలో వోనొచ్చింది. పడుతల్లే పడుపడుమని ఆకాశం వంక అంతా అర్రులు సాచినాం. సిన్న వాన పడ్డంపడింది. శాన. దాంతో వొరి ఇతనాలు నారు మళ్లలో జల్లినాము.

పట్టుకుంది వొరుపు. ఆకాశంలో ఎక్కడా మెరుపే లేని వొరుపు.

నీతీ నిజాయితీ – మనుషుల్లో సచ్చినాయి. నీతి – ఆకాశానికీ సచ్చింది. నెలకి మూడు వోనలు కురిసేవట! ఇప్పుడేదీ ఆ నీతి?

దాందర్మమా అని పొద్దు – ఏళకి పొడుస్తున్నాది. రేతిరి – ఏళకి అవుతున్నాది. ఆ సూరె బగవానుడు – ఆ నీతి తప్పితే మన గతులు ఏటవుతాయి.

పంచాయతీ రేడియో సాయంకాలం అరిస్తే మా కొండల్లోకి ఇనపడతాది. ఇశాకపట్నం కాడ వోయు గుండం వున్నాది. వచ్చి పడిపోతున్నాది. గాలీ వానా అంటే పొద్దున్న అదే రేడియో ఏటో సెపుతుంది? వోయుగుండం మన్ని దాటెళ్లిపోయి వొడ్డి దేశాన్ని ఓ బాదు బాదిందని సెపుతాది!

ఇక్కడ మనకేటి పడ్డాది? తుంపర్లు పట్టుకున్నాయి. పొలాల కెళ్లి పచ్చగడ్డి బరకనేము. సిటుకు సిటుకు సినుకులు. ఇంట్లో కూకోనేము! వారం రోజులు సిటుకు సిటుకు సిన్న సినుకులు.

ఆ దిక్కుమాలిన ఆకాశాన్ని నమ్ముకుని తరతరాలు బతుక్కొస్తున్నాము.

బూదేవత పెరగనేదు. మాం పెరిగీసినం! మా ముత్తాత ఒక్కడే. ఇప్పుడు, మాం పాతికిళ్ల వాళ్ళం! ఆ బూదేవతని నమ్ముకుని పాతిక సంసారాలు ఆ ఆకాశాన్ని నమ్ముకునే గండాల బతుకులు బతుకుతున్నాం.

దగ్గరలోనే కొండవాగులున్నాయి. వాటి నీళ్లు కాస్త పైకెత్తి మా సెరువుల్లోకి మళ్లిస్తే మా కెందుకీ గతి? సూసేనాదుడు నేడు! చేసేనాదుడు నేడు!

వొరి ఇత్తనాలు ఆకుమళ్లలో ఏసినామా? అందులో నారు నెగడానికి తడి? బావుల్లో వూటనేదు, సెర్లో సుక్క నీరు నేదు. ఆకాశంలోంచి టక్కుని ఒక్క సినుకు నేదు. వొరుపు వొరుపు ఒకటే వొరుపు. ఉసూరుమని సూస్తూ వుండగా వొరాకు సుట్టుకుపోయి సుట్టుకుపోయి ఎండిపోనాది. ఏరుశనగ బెత్తెడు కొనసాగనేదు. ఆకులు నులుచుకుని ముడుచుకుపోతున్నాయి.

ఐపోయింది మా పని. ఇకనేటుంది? ఈనాటున గేమాలు గేమాల పెజ మలమలమాడి సావవలసిందే! వూళ్లన్నీ సెల్లాసెదరై పోతున్నాయి. ఆడా, మగా సత్తువున్న వాళ్లంతా పట్నాలకి పిట్టల్లా గెగిరిపోయారు. అంతా తలోదారీ పట్టేశారు.

నా కొడుకు లిద్దరూ - అళ్లకి అళ్లే - కటకం పోదాం - అనీసుకున్నారు.

మావి మారుమూల కుగ్రామాలు. కూలీనాలీ చేసుకు బతకడానికి దగ్గరలో పట్నమన్నది నేదు. సుట్టుపక్కల ఎక్కడా మిల్లు గొట్టం నేదు!

నా పెద్ద కొడుకే - ఎక్కడ తెచ్చినాడో - నెలకి రూపాయికి పావలా వడ్డీకి అప్పు కటకం ఎళ్లడానికి. అక్కడ మాకు అయినోళ్లు వున్నారు. ఎంటనే కూలి పలుకుతాది. మావాళ్లు పనిలో వొళ్ళుదాచుకోరు. అళ్ళ పని సూస్తే ఎవ్వళూ వగ్గరు.

పిల్లల్ని మాకాడ వొగ్గేసి పెద్ద కొడుకు ఎల్లినాడు. పెళ్లాన్ని మాకాడ వొగ్గేసి సిన్న కొడుకు ఎల్లినాడు. సిన్న కోడలు ఎళ్లడం మాం ఇష్టపడనేదు.

ఎందుకంటారా? మా వూరి కుర్రాడే - సిన ఎంకటప్పుడు అడి పెళ్లాం కటకం ఎల్లి ఏటిసేసింది? కటకీ అయ్యింది. నెగిసిపోయింది మొగుణ్ణొగ్గేసి ఎవడి తోనో, మరి అతీగతీ నేదు!

వయసులో వున్న ఆడదాన్ని కూలికి పంపడం సెడ్డ నఖారా, కటకం ఎల్లినారు మావోళ్లు. అక్కడ అళ్లుబతకాల. మాం ఇక్కడ బతకడానికి పంపాల. అప్పులు తీర్చాల ఎవసాయానికి మదువులు తేవాల! సంకురుమాణానికి ఇంటికి రారు. శివరేత్రికైనా వస్తారో రారో. రాదు. తొలకరి దాకా అళ్ల మొకాలు మరి కనబడవు.

గవర్నమెంటోళ్లు అప్పులిస్తున్నారంటే ఎగబడ్డాము. అప్పు పుట్టడానికి కాయితాలు రాయించినాము. ఉద్యోగం ఊడిపోయిన కరణంగారే రాసినారు. మా వూరి పెసిడెంటు కాణ్ణుంచి తాసిల్దారాఫీసు బంట్రోతుదాకా సెయ్యి జాపినోళ్లకల్లా ఇచ్చుకోవలిసింది ఇచ్చుకుంటే ఐదొందలు అప్పుకి సేతికి నాలుగొందలే వొచ్చినాయి! తిరిగి మాం ఐదొందలిచ్చుకోవాల. ఐదొందలకి వడ్డీ ఇచ్చుకోవాల. కాబూలోడి అప్పేనయం!

ఎంత నష్టమొచ్చినా - ఆ పాటి డబ్బు సేతిలో నేకపోతే గుండె దిటం వుండదు.

పంటలన్నీ వొల్లకాట్లో కలిశాక ముసుర్లు పట్టుకున్నాయి. సెరువులూ నిండినాయి.

పచ్చగడ్డి బాగా నెగిసింది. తలో బుంగడు గడ్డీ బక్కురుకొస్తే పశువుల మొర్ర తీరుతుంది.

అకాలపు వానలైనా ఏదో వొకటి సెయ్యాలికదా? గుత్తి ఏరుసెనగ నాలుగు సిన్న మళ్ళు ఏసినాము. సోడిసేను ఊడిచినాము.

అవి గాని కుసింత పండినాయంటే నాలుగు పొద్దులు మా కడుపుమంటుందే అది కాస్త నల్లారుతాదని ఆశ.

సిన్న ఆశ!

(వఱవు అంటే అనావృష్టి, కరువు అని అర్థం)

❄

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక, 22.1.88

అరసం

కథాస్రవంతి విడుదలలు

1. కొడవటిగంటి కుటుంబరావు కథలు
2. చాసో కథలు
3. మధురాంతకం రాజారాం కథలు
4. పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు
5. కేతు విశ్వనాథరెడ్డి కథలు
6. కొలకలూరి ఇనాక్ కథలు
7. ఓల్గా కథలు
8. పి. సత్యవతి కథలు
9. అల్లం శేషగిరిరావు కథలు
10. అల్లం రాజయ్య కథలు

అభ్యుదయ రచయితల సంఘం
గుంటూరు జిల్లాశాఖ ప్రచురణలు

1. సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్
   సోవియట్ ల్యాండ్ నెహ్రూ ఎవార్డ్ విజేత : కొండేపూడి శ్రీనివాసరావు
2. వైద్య విజ్ఞాన వ్యాసావళి : : డాక్టర్ పరుచూరి రాజారామ్
3. జ్వలిత జ్వాల (కవితా సంపుటి) : తిరునగరి రామాంజనేయులు
4. పలనాడు వెలలేని మాగాణిరా : శ్రీ పులుపుల వెంకట శివయ్య స్మృతి సంచిక
5. బల్గేరియా కవిత (అనువాద కవితా సంకలనం) : కొండేపూడి శ్రీనివాసరావు, డాక్టర్ పరుచూరి రాజారామ్, పెనుగొండ లక్ష్మీనారాయణ (సంపాదకులు)
6. అరాజకీయం (కవితా సంకలనం) : పెనుగొండ లక్ష్మీనారాయణ (సంకలనకర్త)
7. ఆధునికాంధ్ర సారస్వతం : డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

8.11. కథా స్రవంతి - నాలుగు సంకలనాలు : పెనుగొండ లక్ష్మీఈనారాయణ (సంకలన కర్త)

   చిరస్మరణీయమైన తెలుగు కథలు

12. లెనిన్ సాహిత్య వివేచన
    సోవియట్ ల్యాండ్ నెహ్రూ ఎవార్డ్ విజేత : డాక్టర్ పరుచూరి రాజారామ్
13. స్మృతి రేఖలు : శ్రీ కొండేపూడి శ్రీనివాసరావు స్మృతి సంచిక
14. మధ్యే మధ్యే (సాహిత్య వ్యాస సంపుటి) : నిడమర్తి ఉమారాజేశ్వరరావు
15. హింసధ్వని (నాటిక)
    పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
    సాహితీ పురస్కారం పొందిన రచన : వల్లూరు శివప్రసాద్
16. పడమటి వీధి (కవితా సంపుటి) : డాక్టర్ సి.హెచ్.సుశీల
17. రేపటిలోకి (కవితా సంపుటి) : పెనుగొండ లక్ష్మీనారాయణ
18. ఆకృతి చెదిరిపోతుంది (కవితా సంపుటి) : చెరుకుమల్లి సింగా
19. గుంటూరు కథలు (కథా సంకలనం) : పెనుగొండ లక్ష్మీనారాయణ (సంపాదకుడు)
20. ఉద్యమమే ఊపిరిగా... (కవితా సంపుటి) : చెరుకుమల్లి సింగా
21. విదిత (వ్యాస సంపుటి) : పెనుగొండ లక్ష్మీనారాయణ

అంతర్జాతీయ సాహిత్యంలో నిలవదగిన కథలు [illegible] మార్క్సిస్టుతత్వాన్ని జీర్ణించుకొన్న జీవన దార్శనికుడు. రాశి [illegible] దృష్టి వున్న రచయిత.

చాసో ఏది రాయాలో ఏది రాయకూడదో బాగా తెలిసిన [illegible] శిల్పం అంటే ఔచిత్యం. ఔచిత్యంతో రాయడానికి చాసో [illegible] పద్ధతులు, ఆయనకి అయన తను సొంతంగా ఏర్పరచుకున్న [illegible] కథల్లో మనం గమనించవచ్చు. ప్రపంచ సాహిత్యంలోని గొప్ప [illegible] అధ్యయనం చేసిన చాసో ఎవరి ప్రభావానికి లోనుకాకుండా తనదైన, [illegible] చెందిన రాసే విధానాన్ని సాధించారు. వస్తువు, సన్నివేశం, పాత్రల [illegible] సంభాషణలు అన్నిటిలోనూ అయన చింతనా, దృక్పథం [illegible] మొదటి నుండి చివరివరకూ ఉంటాయి.

ధనస్వామ్యంలో ధనం ఏ విధంగా మనుషుల్ని [illegible] చేస్తుందో, మానవత్వాన్ని ఎలా మంట కలుపుతుందో, బూర్జువా [illegible] మనుషులు ఎలా సంచరిస్తారో సునిశితంగా పరిశీలించి పాత్ర సృష్టి [illegible] మోసం, దోపిడి, దౌర్జన్యం, అమాయకత్వం, అజ్ఞానం, మూఢనమ్మ[illegible] అన్నిటినీ వ్యంగ్యంతో వ్యక్తీకరిస్తూ వ్యవస్థలోని అవకతవకలని [illegible] వ్యవస్థమారాలి, మారడానికి వీలుగా వ్యక్తి ఆలోచన సాగాలి, వృద్ధిచెందా[illegible] కళాత్మకంగా కథల్లో చెప్పారు.

అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకులలో [illegible] చాసో, కార్యవర్గ సభ్యులుగా, అధ్యక్షవర్గ సభ్యులుగా, 'అరసం' అధ్యక్షులుగా పలు బాధ్యతలను స్వీకరించి, ఉద్యమ నిమగ్నతకు పర్యాయపదంగా నిలిచారు.

చాసో భౌతికవాది. నిరీశ్వర వాది. తన మరణానంతరం తన పార్థివ శరీరాన్ని శాస్త్ర పరిశోధన నిమిత్తం దానమిచ్చిన గొప్ప మానవతావాది.